# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 162 పేజీలు : 08, వెల రూ. 5రూ/ శుక్రవారం- 20 - జూన్- 2025


## 4 రోజులు.. రూ.6,405 కోట్లు!



## పాక్ ఆర్మీ చీఫ్ కు అమెరికా విందు... శశి థరూర్ విమర్శలు

పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్‌కు ట్రంప్ విందు ఇవ్వడంపై శశిథరూర్ తీవ్ర విమర్శ

ఒసామా బిన్ లాడెన్‌కు పాక్ ఆశ్రయమిచ్చిన వైనం అమెరికా మరువరాదని హితవు

ఉగ్రవాదులకు మద్దతివ్వొద్దని పాక్‌ను ట్రంప్ హెచ్చరించి ఉంటారని ఆకాంక్ష

కాంగ్రెస్ అగ్రనాయకత్వంలో కొందరితో భిన్నాభిప్రాయాలున్నాయని థరూర్ అంగీకారం

ఆపరేషన్ సిందూర్‌పై ప్రధాని మోదీతో చర్చించానన్న థరూర్



ఢిల్లి : పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్‌కు మిగతా..2లో

## ఖమేనీ ఇక ఎంత మాత్రం ఈ భూమ్మీద ఉండడానికి వీల్లేదు

టెల్ అవీవ్ సమీపంలో ఆసుపత్రిపై ఇరాన్ క్షిపణి దాడి

ఖొమేనీని వదిలిపెట్టబోమని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి హెచ్చరిక

ఆసుపత్రిపై దాడి యుద్ధ నేరమన్న ఇజ్రాయెల్

సైనిక స్థావరమే లక్ష్యమని ఇరాన్ వివరణ

ఇరాన్‌లోని వ్యూహాత్మక ప్రాంతాలపై దాడులు పెంచాలని ఇజ్రాయెల్ ఆదేశం



ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని అంతమొందించి, మిగతా..2లో

## టోనీ బ్లెయిర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ..

- బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీలో సమావేశం అయ్యారు.
- గంటసేపు ఈ భేటీ కొనసాగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు.
- రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆవిష్కరించే 'తెలంగాణ రైజింగ్ 2047' కార్యక్రమ వివరాలను ముఖ్యమంత్రి అందజేశారు.



ఢిల్లీ: బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(గురువారం) ఢిల్లీలో సమావేశం అయ్యారు. గంటసేపు ఈ భేటీ కొనసాగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆవిష్కరించే 'తెలంగాణ రైజింగ్ 2047' కార్యక్రమ వివరాలను ముఖ్యమంత్రి అందజేశారు. రైతులు, యువత, మహిళలు వంటి వివిధ వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి, మానవ అభివృద్ధి సూచికల మెరుగుదలకు ఇస్తున్న ప్రాధాన్యతను ఈ సందర్భంగా వివరించారు. కోర్ అర్బన్, పెరి-అర్బన్, గ్రామీణ మండలాలతో మైక్రోప్లానింగ్‌కి సంబంధించి మిగతా..2లో

## నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డికి బాధ్యతలేదు..

- గోదావరి, కృష్ణా నీళ్లను ఏపీ వాడుకోమని సీఎం రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నించారు.
- రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కి దాసోహం అయ్యారని విమర్శించారు.
- నల్లమల ఏ జిల్లాల్లో ఉందో కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని హరీష్‌రావు ఎద్దేవా చేశారు.
- రేవంత్‌రెడ్డి ఏపీ బనకచర్ల ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు.




హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు ద్రోహం చేస్తోన్న రేవంత్‌రెడ్డిని ఏం చేసినా తప్పు లేదని అన్నారు. తెలంగాణకు నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డిది బాధ్యతారాహిత్యమేనని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి లెక్క తాము అడ్డదారిలో రాలేదు.. ఉద్యమం నుంచి వచ్చిన వాళ్లమని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి ఏపీ బనకచర్ల ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. అఖిలపక్షా ఎంపీల సమావేశం పెట్టింది బనకచర్లను ఆపటానికా, కట్టుకోమని చెప్పటానికా అని ప్రశ్నించారు. ఇవాళ(గురువారం) తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీష్‌రావు మీడియాతో చిట్‌చాట్ చేశారు. గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీలు ఇచ్చి మిగిలిన నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకెళ్లమని చెప్పటానికి

## ఆ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వద్దని కేంద్రాన్ని కోరాం..




- సీఎం రేవంత్ రెడ్డి బృందం ఢిల్లీ పర్యటనలో ఉంది.
- గురువారం కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు.
- భేటీ ముగిసిన అనంతరం మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు.
- బనకచర్ల ప్రాజెక్టు అంశంలో తమకు ఉన్న అభ్యంతరాలను కేంద్రమంత్రికి వివరించామని చెప్పారు.

## భయం నీడలో టెహ్రాన్ ప్రజలు

## కిక్కిరిసిన షెల్టర్ జోన్లు

- ఇజ్రాయెల్ దాడులతో అలుముకున్న ఆందోళనలు
- నగరంలో షెల్టర్ జోన్లుగా మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, మసీదులు అక్కడే గంటల తరబడి గడుపుతున్న ప్రజలు
- టెలీ కమ్యూనికేన్ వ్యవస్థలో అంతరాయం



ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను ఇజ్రాయెల్, అమెరికా లక్ష్యంగా చేసుకున్నాయి. నగరాన్ని వీడి వెళ్లిపోవాలని ఇప్పటికే అక్కడి ప్రజలకు అల్టిమేటం ఇచ్చాయి. మరోవైపు ఇజ్రాయెల్ వైమానిక దాడులు తీవ్రరూపు దాల్చాయి. దీంతో టెహ్రాన్‌లోని ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఏ క్షణంలో ఎటువైపు ఇజ్రాయెల్ బాంబులు, డ్రోన్లు పడతాయో అర్థం కాక భయంభయంగా జీవిస్తున్నారు.

ఇంటర్నెట్ సర్వీసులను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటికే ఆపేసింది. ఫోన్ కాల్స్, మెసేజింగ్ సర్వీసులూ సక్రమంగా పనిచేయడం లేదు. అవి కూడా ఏ క్షణమైనా ఆగిపోవచ్చని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### ఇప్పటికే వలస వెళ్లిపోయిన వేలాది మంది

ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు స్వేచ్ఛగా తిరుగుతుండటం వల్ల టెహ్రాన్ ప్రజల టెన్షన్ మరింత పెరిగిపోయింది. ఈ పరిస్థితుల్లో గత మూడు రోజుల వ్యవధిలో నగరం నుంచి వేలాది మంది వలస వెళ్లిపోయారు. వారంతా టెహ్రాన్ శివారు ప్రాంతాలు, కాస్పియన్ సముద్ర పరిసర ప్రాంతాలు, అర్మేనియా, తుర్కియే లకు తరలివెళ్లినట్లు తెలిసింది. మరెంతో మంది ప్రస్తుతం మిగతా..2లో

## యోగాలో 2.39 కోట్ల రిజిస్ట్రేషన్లు

## 22 వరల్డ్ రికార్డుల కోసం కృషి

### 'యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవాలి.

- రాష్ట్రంలోని 1.30 లక్షల ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు చేపడతున్నాము
- యోగాంధ్రపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం
- యోగాలో 2 కోట్ల మంది రిజిస్ట్రేషన్ జరగాలనేది లక్ష్యం.
- ప్రపంచమంతా 8 లక్షల ప్రాంతాల్లో యోగా డేలో పాల్గొంటారు" అని సీఎం చంద్రబాబు వివరించారు.
- దేశమంతా దాదాపు 7 లక్షల ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు చేస్తారు.




అమరావతి : యోగా మన జీవితంలో భాగం కావాలని సీఎం చంద్రబాబు అన్నారు. యోగాంధ్రపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవాలి. రాష్ట్రమంతా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ నిర్వహణ ఉండాలి. 9వ తరగతి నుంచి విద్యార్థులు యోగా చేయాలి. భవిష్యత్తులో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ, కోర్సులు కోర్సులు నిర్వహించనున్నాము. గత నెల 21 నుంచి ఈ నెల 21 వరకు కార్యక్రమాలు చేస్తున్నాము. యోగాలో 2 కోట్ల మంది

## పెన్షనర్ల కోసం కేంద్రం సరికొత్త క్యాంపెయిన్




- కుటుంబ, సూపర్ సీనియర్ పెన్షనర్ల ఫిర్యాదుల పరిష్కారానికి "స్పెషల్ క్యాంపెయిన్ 2.0"
- జూలై 1 నుంచి 31 వరకు ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహణ
- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మార్గదర్శకాలు విడుదల చేశారు
- ఇప్పటికే 25 శాతానికి పైగా కేసులు పరిష్కారం అయ్యాయని వెల్లడి

ఢిల్లి : కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కుటుంబ పింఛనుదారులు, సూపర్ సీనియర్ పింఛనుదారుల

## ఏపీ లాసెట్ ఫలితాలు విడుదల...

## ఉత్తీర్ణులకు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు

- ఏపీ లాసెట్, పీజీఎల్‌సెట్ 2025 ఫలితాలు విడుదల
- ఫలితాలను ప్రకటించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- మొత్తం 95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత
- లాసెట్‌లో బాలికలే టాపర్లుగా నిలిచారని మంత్రి వెల్లడి



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ లాసెట్-2025, ఏపీ పీజీఎల్‌సెట్-2025 ఫలితాలు గురువారం మధ్యాహ్నం విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. విద్యార్థులు తమ ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది లాసెట్ పరీక్షల్లో మొత్తం 95 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు మంత్రి నారా లోకేశ్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ పరీక్షలకు మొత్తం 27,253 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 20,826 మంది అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. మిగతా..2లో

## తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ ఏపీలోనూ కలకలం




- తన ఫోన్, భర్త ఫోన్ ట్యాప్ చేశారని షర్మిల ఆరోపణ
- తనకు సంబంధం లేదన్న జగన్
- వాస్తవమేనని, ఆ సమాచారాన్ని కేసీఆర్, జగన్ పంచుకున్నారని షర్మిల ఆరోపించారు.

అమరావతి : తెలంగాణలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ

## చిత్తశుద్ధితో పని చేస్తున్నాం

## ఏపీని అభివృద్ధికి చిరునామాగా మారుస్తాం




అమరావతి : గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం నియంతృత్వ పాలకుల పాలనలో నలిగిపోయిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి ఏడాదిగా చిత్తశుద్ధితో పని చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై పవన్ కల్యాణ్ ప్రగతి నివేదిక విడుదల చేశారు. ఎన్డీయే కూటమి విజయానికి అండగా నిలబడిన ప్రతిఒక్కరికీ, అలానే రాష్ట్రాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు పవన్ తెలిపారు.

- ఏడాది పాలనపై ప్రగతి నివేదిక విడుదల చేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- సీఎం చంద్రబాబు అనుభవం, దూరదృష్టి నాయకుని పాలనలో రాష్ట్రం ముందుకెళ్తోందని వెల్లడి
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై పవన్ కల్యాణ్ ప్రగతి నివేదిక విడుదల చేశారు.
- సీఎం చంద్రబాబు అనుభవం, దూరదృష్టి నాయకుని పాలనలో రాష్ట్రం ముందుకెళ్తోందని అన్నారు.

## చిత్తశుద్ధితో పని చేస్తున్నాం - ఏపీని అభివృద్ధికి చిరునామాగా మారుస్తాం

సమగ్ర అభివృద్ధి నివేదిక 2024-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరాబీ పర్యావరణ, అటవీ, సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రిగా ఏ బాధ్యతలు చేపట్టి నేటికి సంవత్సరం పూర్తైన సందర్భంగా ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చేవారిలో విశ్వాసం నింపామని అలానే కేంద్ర ప్రభుత్వం కూడా అభివృద్ధి కార్యక్రమాలకు అండగా నిలుస్తోందని పవన్ వెల్లడించారు. సీఎం చంద్రబాబు అనుభవం, దూరదృష్టి నాయకుని పాలనలో రాష్ట్రం ముందుకెళ్తోందని అన్నారు. రాబోయే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

## పాక్ ఆర్మీ చీఫ్ కు అమెరికా విందు... శశి థరూర్ విమర్శలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విందు ఇవ్వడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అల్ ఖైదా ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌కు పాకిస్థాన్ ఆశ్రయం కల్పించిందన్న విషయాన్ని అమెరికా ఎన్నటికీ మరచిపోకూడదని ఆయన హితవు పలికారు. ఈ సందర్భంగా శశిథరూర్ మాట్లాడుతూ, "వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడికి ప్రధాన సూత్రధారి అయిన ఒసామా బిన్ లాడెన్ ఉదంతాన్ని పాకిస్థాన్ బృందాన్ని కలిసిన కొందరు అమెరికన్ చట్టసభ సభ్యులు విస్మరించినప్పటికీ, అమెరికా ప్రజలు అంత తేలిగ్గా మర్చిపోలేరు. లాడెన్‌ను కనుగొనేంత వరకు, ఒక ఆర్మీ క్యాంపు సమీపంలో పాకిస్థాన్ అతడిని దాచిపెట్టిన వ్యవహారాన్ని అమెరికన్లు అంత త్వరగా విస్మరించరు" అని స్పష్టం చేశారు. ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడం, ఆర్థిక సహాయం అందించడం వంటి చర్యలకు పాల్పడకూడదని ఈ సమావేశంలో అమెరికా అధ్యక్షుడు పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించి ఉంటారని తాను ఆశిస్తున్నట్లు థరూర్ పేర్కొన్నారు.

## ఖమేనీ ఇక ఎంత మాత్రం ఈ భూమ్మీద ఉండడానికి వీల్లేదు

ఆయన పాలనకు చరమగీతం పాడతామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టెల్ అవీవ్ సమీపంలోని ఓ ఆసుపత్రిపై ఇరాన్ క్షిపణి దాడి ఘటన అనంతరం ఆయన ఈ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ దాడిలో కనీసం 47 మంది గాయపడినట్లు ఇజ్రాయెల్ సహాయక బృందాలు నివేదించాయి. "పిరికి నియంత ఖమేనీ తన సురక్షిత బంకర్‌లో దాక్కుని ఇజ్రాయెల్‌లోని ఆసుపత్రులు, నివాసాలపై క్షిపణులు ప్రయోగిస్తున్నాడు. ఇది అత్యంత తీవ్రమైన యుద్ధ నేరం. దీనికి ఖమేనీ పూర్తి బాధ్యత వహించాల్సిందే. ఆయనను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఖమేనీ ఇక ఎంతమాత్రం ఈ భూమ్మీద ఉండడానికి వీల్లేదు" అని కాట్జ్ 'ఎక్స్' వేదికగా తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఇజ్రాయెల్‌కు పొంచి ఉన్న ముప్పును తొలగించడానికి, ఖమేనీ పాలనను బలహీనపరిచేందుకు టెహ్రాన్‌లోని ప్రభుత్వ, వ్యూహాత్మక లక్ష్యాలపై దాడుల తీవ్రతను పెంచాలని తాను, ప్రధానమంత్రి కలిసి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్)ను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది. తాము ఆసుపత్రిని లక్ష్యంగా చేసుకోలేదని, సమీపంలోని ఇజ్రాయెల్ సైనిక, గూఢచార స్థావరమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది. ఆసుపత్రికి కేవలం పేలుడు తరంగాల ప్రభావం మాత్రమే తగిలిందని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ పేర్కొంది. ఇదిలా ఉండగా, ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో పలువురు సీనియర్ ఇరాన్ సైనిక అధికారులు, అణు శాస్త్రవేత్తలు మరణించినట్లు, ఇరాన్‌లోని అణు మౌలిక సదుపాయాలు, ముఖ్యంగా టెహ్రాన్‌లోని 50కి పైగా లక్ష్యాలు ధ్వంసమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా సైనిక జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్ హెచ్చరించింది. తమ దేశం ఎన్నటికీ లొంగిపోదని, బెదిరింపులకు భయపడబోమని ఖొమేనీ ఓ టెలివిజన్ ప్రసంగంలో స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితులు మరింత తీవ్రమైన ఘర్షణలకు దారితీసే అవకాశం ఉందని అంతర్జాతీయ పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీ లాసెట్ ఫలితాలు విడుదల... ఉత్తీర్ణులకు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు

మరోసారి బాలికలే టాపర్లుగా నిలిచి తమ ప్రతిభను చాటారని మంత్రి ప్రశంసించారు. పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో మూడేళ్ల, ఐదేళ్ల ఎల్ఎల్‌బీతో పాటు పీజీ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన ఏపీ లాసెట్-2025 పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన విషయం విదితమే. పరీక్ష రాసిన అభ్యర్థులు తమ ఫలితాలను  అనే అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. హోమ్ పేజీలో కనిపించే లాసెట్ ఫలితాల లింక్‌పై క్లిక్ చేసి, తమ రిజిస్ట్రేషన్ నంబర్, లాసెట్ హాల్‌టికెట్ నంబర్ మరియు పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయడం ద్వారా ర్యాంక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అడ్మిషన్ల ప్రక్రియలో ఈ ర్యాంక్ కార్డు చాలా కీలకమైనది కాబట్టి దీన్ని భద్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. అంతేకాకుండా, ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మనమిత్ర' వాట్సాప్ సర్వీస్ ద్వారా కూడా ఫలితాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఇందుకోసం 9552300009 అనే వాట్సాప్ గవర్నెన్స్ నంబర్‌కు '' అని మెసేజ్ పంపి, ఆ తర్వాత 'విద్యా సేవలు' ఆప్షన్‌ను ఎంచుకుని, 'ఏపీ లాసెట్ ఫలితాలు-2025' పై క్లిక్ చేయడం ద్వారా ర్యాంక్ కార్డును పొందవచ్చు. లాసెట్ పరీక్షలో సాధించిన ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా అభ్యర్థులకు కళాశాలల్లో సీట్లను కేటాయిస్తారు. ఫలితాలు వెలువడిన నేపథ్యంలో, ఉన్నత విద్యామండలి త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించనుంది. దీని ద్వారా దశలవారీగా సీట్ల కేటాయింపు ప్రక్రియ జరుగుతుంది.

## తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ ఏపీలోనూ కలకలం

రాజకీయ వేడిని రాజేస్తోంది. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన ఆరోపణలు ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేశాయి. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నది వాస్తవమేనని, ఆ సమాచారాన్ని కేసీఆర్, జగన్ పంచుకున్నారని షర్మిల ఆరోపించారు. తన ఫోన్‌తో పాటు, తన భర్త ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఆరోపణలపై జగన్ తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో తొలిసారిగా స్పందించారు. షర్మిల ఫోన్ ను ట్యాపింగ్ చేశారో లేదో తనకు తెలియదని ఆయన అన్నారు. గతంలో షర్మిల తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారని చెప్పారు. తనకు తెలంగాణ వ్యవహారాలతో సంబంధం లేదని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ తో తనకు సంబంధం లేదని చెప్పారు.

## టోనీ బ్లెయిర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ..

విషయాలను టోనీ బ్లెయిర్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంచుకున్నారు. అభివృద్ధి ఏజెండా స్థిరత్వ సూత్రాల ద్వారానే సాధించవచ్చని ఈ సందర్భంగా టోని బ్లెయిర్ పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి అంశాలపై టోని బ్లెయిర్ ప్రత్యేక ఆసక్తిని కనబరిచారని సీఎం కార్యాలయం పేర్కొంది. తెలంగాణ రైజింగ్ విజన్ డెవలప్‌మెంట్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం, టోని బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు సీఎంఓ ప్రకటించింది.

మెట్రో ఫేజ్-కి కేంద్రం సహకరించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ మెట్రో ఫేజ్-కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్- అవసరం ఎంతో ఉందని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్ట్‌ని కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్ట్‌గా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.మెట్రో ఫేజ్-సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతోందని.. సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి ఖట్టర్‌కు తెలిపారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని కేంద్రమంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్- ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్రమంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వద్దని కేంద్రాన్ని కోరాం..

హైదరాబాద్ : దేశ రాజధాని ఢిల్లీ పర్యటన లో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి , మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కేంద్ర జల శక్తి మంత్రి  సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యారుపోలవరం  బనకచర్ల ప్రాజెక్టు కు అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.. బనకచర్ల లింక్ ప్రాజెక్టు చట్ట విరుద్ధమని చెప్పామని.. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర జలశక్తి మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

ఇప్పటివరకు డీపీఆర్ ఇవ్వలేదు..

బనకచర్లపై త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహిస్తామని కేంద్రమంత్రి చెప్పారని, గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు తెలంగాణకు బ్లాంకెట్  ఏపీ రాసివ్వాలని కోరామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. దానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలపాలన్నారు. అప్పుడే తాము బనకచర్లపై ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు తప్పనిసరి అని, ఇప్పటి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వలేదని అన్నారు.

వీలైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం..

బనకచర్ల ప్రాజెక్టు అంశంలో తమకు ఉన్న అభ్యంతరాలను కేంద్రమంత్రికి వివరించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు పట్ల తెలంగాణ ప్రజల్లో తెలంగాణ రైతుల పట్ల ఆందోళన ఉందని, గోదావరి కృష్ణ నుంచి 1500 టీఎంసీల వాటర్ తెలంగాణకు బ్లాంకెట్  ఇస్తే దాని ద్వారా కోటిన్నర ఎకరాలకు నీళ్లు అందించగలుగుతామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు లభిస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులు వేగవంతంగా నిర్మాణం చేయాలనుకున్నా.. ప్రాజెక్టులు అనుమతులు నెమ్మదిగా అవుతున్నాయని మంత్రి అన్నారు. అయితే తమ అభ్యంతరాలపై కేంద్ర మంత్రి సీఆర్

# యోగాలో 2.39 కోట్ల రిజిస్ట్రేషన్లు - 22 వరల్డ్ రికార్డుల కోసం కృషి

మొదటి పేజి తరువాయి

రిజిస్ట్రేషన్ జరగాలనేది లక్ష్యం. లక్ష్యానికి మించి 2.39 కోట్ల మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఎల్లుండి రాష్ట్రంలో 1.30 లక్షల ప్రాంతాల్లో యోగా నిర్వహణ ఉంటుంది. దేశమంతా దాదాపు 7 లక్షల ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు చేస్తారు. ప్రపంచమంతా 8 లక్షల ప్రాంతాల్లో యోగా డేలో పాల్గొంటారు" అని సీఎం చంద్రబాబు వివరించారు.

'యోగా డే'లో పెద్ద ఎత్తున పాల్గొనండి - ప్రజలకు ప్రధాని మోదీ సందేశం

"విశాఖలో 3.5 లక్షల మంది మొబిలైజ్ చేసేలా ఏర్పాట్లు చేశాము. రామకృష్ణాపురం బీచ్ నుంచి భోగాపురం వరకు కార్యక్రమాలు ఉంటాయి. యోగా నిర్వహణకు యోగి 5 స్మార్ట్ మ్యాట్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఇది మ్యాట్ టీచర్‌కు అసిస్టెంట్‌గా, విద్యార్థికి గైడ్‌లా పనిచేస్తుంది. సీఎస్ఆర్ ద్వారా యోగాను జిల్లాల్లో



ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటాము. భారత్‌లో యోగా వారసత్వంగా వచ్చింది. 'యోగా ఫర్ వన్ ఎర్త్ - వన్ హెల్త్' నినాదంతో ఈ ఏడాది కార్యక్రమం చేపట్టాము. 2 గిన్నిస్ బుక్ రికార్డుల కోసం కృషిచేస్తున్నాము. పెద్ద సంఖ్యలో యోగాలో పాల్గొనడంలో రికార్డు. 3.50 లక్షల మందితో సూర్య నమస్కారాల కార్యక్రమం ఉంటుంది. రేపు 108 నిమిషాలపాటు సూర్య నమస్కారాల కార్యక్రమం ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతాల నుంచి 25000 మంది విద్యార్థులు వస్తారు. మొత్తం 22 వరల్డ్ బుక్ రికార్డుల కోసం కృషిచేస్తున్నాము. ఉ.6.30 నుంచి ఉ.8 వరకు కార్యక్రమం ఉంటుంది. ఉదయం 7 గం.కు యోగా ప్రారంభమవుతుంది. యోగా డీమ్డ్ యూనివర్సిటీపై ఆలోచన ఉంది. 9వ తరగతిలో సిలబస్‌గా యోగాపై ప్రతిపాదన ఉంది" అని సీఎం చంద్రబాబు అన్నారు.

# భయం నీడలో టెహ్రాన్ ప్రజలు - కిక్కిరిసిన షెల్టర్ జోన్లు

మొదటి పేజి తరువాయి

టెహ్రాన్?ను వీడి వెళ్తున్నారు. వీరి వాహనాల రద్దీతో నగరంలో ఎక్కడ చూసినా ట్రాఫిక్ జామ్‌లే కనిపిస్తున్నాయి. అయితే వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని కుటుంబీకులు వెంటనే నగరం నుంచి తీసుకెళ్లలేకపోతున్నారు.

### కిక్కిరిసిన మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, మసీదులు

ఇప్పటికే టెహ్రాన్‌లోని చాలా ఏరియాలు ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రాణ భయం పట్టుకుంది. అయితే సొంత ఊరిని వదిలి వెళ్లేందుకు చాలామందికి మనసొప్పడం లేదు. అలాంటి వాళ్లంతా నగరంలోని మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, మసీదుల్లో తలదాచుకుంటున్నారు. ఎందుకంటే వీటినే ఇరాన్ ప్రభుత్వం షెల్టర్ జోన్లుగా ప్రకటించింది. ఇవన్నీ ప్రస్తుతం జనంతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి. ఒకవేళ ఇలాంటి చోట్ల ఇజ్రాయెల్ దాడులు జరిపితే భారీ ప్రాణనష్టం జరిగే ముప్పు ఉంది. నగర ప్రజలు రోజూ సగటున 12 గంటలకుపైగా మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, మసీదుల్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తమ భవిష్యత్ ఏమిటో వారికి అర్థం కావడం లేదు. రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో టెహ్రాన్ ప్రజలకు అంతుచిక్కడం లేదు.

### భారీ భవంతులున్నా షెల్టర్లు కరువు

1980వ దశకంలో ఇరాన్ - ఇరాక్ యుద్ధం జరిగే సమయానికి టెహ్రాన్?లోని దాదాపు ప్రతీ ఇంటిలో బేస్‌మెంట్ భాగం ఉండేది. యుద్ధ పరిస్థితుల్లో ప్రజలు వాటిలో దాచుకునేవారు. గత కొన్నేళ్లలో నగరంలో నిర్మితమైన కొత్తరకం భారీ భవనాల్లో బేస్‌మెంట్లు, షెల్టర్లు వంటి ఏర్పాట్లే లేవు. ఇజ్రాయెల్ తరహాలో ఇరాన్ ప్రభుత్వం ప్రత్యేకంగా సురక్షిత షెల్టర్ జోన్లను నిర్మించలేదు. ప్రస్తుత యుద్ధంలో ఈ లోటు టెహ్రాన్ ప్రజలకు తెలిసొస్తోంది. 1980వ దశకంలో ఇరాన్ యుద్ధాలను ఎదుర్కొన్న సమయాల్లో టెహ్రాన్ పరిధిలో ఎయిర్ రైడ్



డ్రిల్స్ జరిగేవి. దాడి ముప్పు ఉన్నప్పుడు సైరన్లు మోగేవి. కానీ ఇప్పుడు ఇవి రెండూ సక్రమంగా, నమ్మదగిన విధంగా జరగడం లేదని పలువురు నగర ప్రజలు ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు చెప్పారు. మరోవైపు ఇజ్రాయెల్ దాడులకు భయపడి చాలా మీడియా సంస్థలు యుద్ధ ఘటనల కవరేజీని ఆపేశాయని తెలుస్తోంది. దీంతో ఇరాన్‌లో ఏం జరుగుతుందో వెంటనే ప్రపంచానికి తెలిసే అవకాశం లేకుండాపోయిందని పరిశీలకులు అంటున్నారు.

### రేపు బతికి ఉంటామో లేదో తెలియట్లేదు : షిరీన్, టెహ్రాన్ నగర వాస్తవ్యురాలు

'టెహ్రాన్?లో ఇప్పుడు ఫోన్ కాల్స్ చేయడం, మెసేజ్‌లను పంపడం కూడా కష్టతరంగా మారింది. మేం చేసే కాల్స్, మెసేజ్‌లే చివరివి అవుతాయని అనిపిస్తోంది. ఫలితంగా మా కుటుంబీకులు, బంధువులతో మనసారా మాట్లాడుకోలేకపోతున్నాం. అసలు రేపు మేం బతికి ఉంటామో లేదో అర్థం కావడం లేదు. ఇప్పటికే చాలామంది వలస వెళ్లిపోయారు. నగరం వదిలి వెళ్లిపోవడం అనేది పరిష్కారం కాదని నా ఉద్దేశం. కొంతమంది టెహ్రాన్వాసులు ఇరాన్ పాలకులను వ్యతిరేకిస్తున్నారు. అయితే నగరంపై ఇజ్రాయెల్ దాడులను వ్యతిరేకిస్తున్నారు' అని టెహ్రాన్కు చెందిన షిరీన్ చెప్పుకొచ్చారు.

### ప్రజలు చనిపోతుండటాన్ని చూసి తట్టుకోలేకపోతున్నాం : టెహ్రాన్ వాస్తవ్యుడు

'మా దేశం విదేశీయుల చేతుల్లోకి వెళ్లిపోవాలని మేం కోరుకోం. ఇరాన్‌లో ఏదైనా మార్పు వస్తే, ప్రజా ఉద్యమంతోనే రావాలి. అంతే తప్ప ఈవిధంగా దాడులతో కాదు. మా దేశంపై బాంబుల వర్షం కురుస్తుండటాన్ని, ప్రజలు చనిపోతుండటాన్ని చూసి తట్టుకోలేకపోతున్నాం' అని టెహ్రాన్ నగరాన్ని వదిలి మరో ప్రాంతానికి వెళ్లిపోయిన 29 ఏళ్ల యువకుడు చెప్పుకొచ్చాడు.

### టెహ్రాన్?ను వీడేందుకు సిద్ధమయ్యాం వాహన గ్యాస్ దొరకలేదు : టెహ్రాన్ వాస్తవ్యురాలు

'మా నాన్న అల్జీమర్స్‌తో బాధపడుతున్నారు. అమ్మకు తీవ్రమైన ఆర్థరైటిస్ ఉంది. గత కొన్ని రోజుల్లో వారికి అవసరమైన మందులన్నీ సమకూర్చుకున్నాను. ఇటీవలే మా ఫ్యామిలీ టెహ్రాన్ వదిలి వెళ్లిపోయేందుకు సిద్ధమైంది. నా సోదరుడు కారులో గ్యాస్‌ను పంప్ చేయించుకోవడానికి గ్యాస్ స్టేషన్ దగ్గర తెల్లవారుజామున 3 గంటల వరకు క్యూలో గడిపాడు. చివరకు గ్యాస్ స్టేషన్‌లో గ్యాస్ అయిపోందని చెప్పడంతో, నిరాశగా ఇంటికి తిరిగొచ్చాడు' అని టెహ్రాన్?కు చెందిన ఓ యువతి వివరించింది.

# నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డికి బాధ్యతలేదు..

మొదటి పేజి తరువాయి

రేవంత్‌రెడ్డి ఎవరని మాజీ మంత్రి హరీష్‌రావు నిలదీశారు. గోదావరి, కృష్ణా నీళ్లను ఏపీ వాడుకోమని ఎలా చెబుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కి దాసోహం అయ్యారని విమర్శించారు. నల్లమల ఏ జిల్లాల్లో ఉందో కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని ఎద్దేవా చేశారు. గోదావరి, కృష్ణా బేసిన్‌ల మీద బేసిక్ నాలెడ్జ్ కూడా రేవంత్‌రెడ్డికి లేదని విమర్శించారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలంగాణ పరువు తీశారని ధ్వజమెత్తారు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో స్కూల్ పిల్లాడిని అడిగినా చెబుతాడని.. ఈ మాత్రం కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. బనకచర్ల ఏ బేసిన్‌లో ఉందని రేవంత్‌రెడ్డి అధికారులను అడగటం సిగ్గుచేటని అన్నారు. రేవంత్‌రెడ్డి తేలికగా అబద్దాలు ఆడుతున్నారని ఫైర్ అయ్యారు మాజీ మంత్రి హరీష్‌రావు. ఉద్యమం చేయలేదు కాబట్టే.. రేవంత్‌రెడ్డికి నీటి విలువ తెలియదని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. పోతిరెడ్డిపాడుకు వ్యతిరేకంగా ఆరుమంత్రి పదవులకు రాజీనామా చేసిన చరిత్ర తమదని ఉద్ఘాటించారు. జగన్‌తో కేసీఆర్ మాట్లాడిన మాటలను రేవంత్‌రెడ్డి వక్రీకరించారని మండిపడ్డారు. నదీ మార్గం నుంచే నీళ్లు తేవాలని





జగన్‌తో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. రెండు తెలుగు రాష్ట్రాలకు మేలు జరిగేలా మాట్లాడుకోవాలని మాత్రమే గతంలో కేసీఆర్ అన్నారని తెలిపారు. ఇరు రాష్ట్రాలకు ఉపయోగపడేలా ప్రణాళికలను రచించుకోవాలని మాత్రమే జగన్‌తో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. సముద్రంలో కలుస్తున్న 3వేల టీఎంసీల్లో తెలంగాణకు 1950 టీఎంసీలు కావాలని కేసీఆర్ డిమాండ్ చేశారని అన్నారు. సముద్రంలో కలిసే నీటిని ఆంధ్రప్రదేశ్ తీసుకోవాలని కేసీఆర్ ఎక్కడ చెప్పలేదని తేల్చిచెప్పారు మాజీ మంత్రి హరీష్‌రావు. తెలంగాణ అంగీకారం లేకుండా నీటిని తీసుకెళ్తామంటే తాము ఒప్పుకోమని కేసీఆర్ స్పష్టం చేశారని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. వైఎస్ పెట్టిన జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అని రేవంత్‌రెడ్డి గతంలో అనలేదా అని ప్రశ్నించారు. 19నెలల్లో ఒక్క ప్రాజెక్ట్ కూడా రేవంత్‌రెడ్డి ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెడుతున్నాయని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వైఫల్యంతోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కుప్పకూలిందని ఆక్షేపించారు. తెలంగాణ హక్కుల కోసం చిత్తశుద్ధితో పోరాడితే రేవంత్ ప్రభుత్వానికి సహకరిస్తామని..లేకపోతే రైతుల పక్షాన సుప్రీంకోర్టుకు వెళ్తామని హరీష్‌రావు స్పష్టం చేశారు.

# పెన్షనర్ల కోసం కేంద్రం సరికొత్త క్యాంపెయిన్

మొదటి పేజి తరువాయి

సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'స్పెషల్ క్యాంపెయిన్ 2.0' పేరుతో జూలై 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) జితేంద్ర సింగ్ గురువారం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఆయన విడుదల చేశారు. గత 11 ఏళ్లలో సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల మంత్రిత్వ శాఖ గణనీయమైన ప్రగతి సాధించిందని ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ ప్రశంసించారు. పింఛనుదారుల సమస్యలను సకాలంలో, నాణ్యమైన రీతిలో పరిష్కరించడం అత్యంత ముఖ్యమని ఆయన నొక్కిచెప్పారు. పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ విభాగం (డీఓపీపీడబ్ల్యూ) ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సమన్వయం చేస్తుందని తెలిపారు. ఈ ప్రచారం కింద మొత్తం 2210 పింఛను ఫిర్యాదులను గుర్తించి, వాటి పరిష్కారం కోసం 51 కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థలకు పంపినట్లు మంత్రి వివరించారు. ఈ ప్రచారంలో సాధించిన విజయగాథలను, ఉత్తమ పద్ధతులను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ప్రకటనలు, ట్వీట్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కోరారు.  అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేయనున్నారు. మహిళా సాధికారతకు, సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కేంద్ర ప్రభుత్వ పింఛనుదారుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా దీనిని చాటుకుంటోందని జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ఈ ప్రచార కార్యక్రమానికి సంబంధించి పెన్షన్ల విభాగం కార్యదర్శి అధ్యక్షతన జూన్ 11, 2025న పింఛనుదారుల ఫిర్యాదులను పర్యవేక్షించే నోడల్




అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. డీఓపీపీడబ్ల్యూ రోజువారీగా ఫిర్యాదుల స్థితిని పర్యవేక్షిస్తోందని, ఇప్పటికే గుర్తించిన కేసులలో 25 శాతానికి పైగా పరిష్కారమయ్యాయని, ఇది కార్యక్రమం పురోగతికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

### యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ

ఇదే వారంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి మరో కీలక ప్రకటన వెలువడింది. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) పరిధిలోకి వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీ ప్రయోజనాలకు అర్హులని మంత్రి జితేంద్ర సింగ్ ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి చాలాకాలంగా వస్తున్న ముఖ్యమైన డిమాండ్‌ను ఈ నిర్ణయం నెరవేరుస్తుందని, పదవీ విరమణ ప్రయోజనాలలో సమానత్వం తీసుకొస్తుందని ఆయన అన్నారు. జాతీయ పింఛను వ్యవస్థ (ఎన్‌పీఎస్) కింద అన్ని కేటగిరీల ఉద్యోగులకు సామాజిక భద్రత కల్పించాలన్న ప్రభుత్వ నిబద్ధతకు ఈ కొత్త నిబంధన అద్దం పడుతుందని మంత్రి తెలియజేశారు.

# సంపాదకీయం

## ధిక్కార ఉక్రెయిన్ భవిష్యత్తు ఏమిటి

రెండు దేశాల మధ్య ఘర్షణలకు, ముఖ్యంగా సాయుధ సమరాలకు కారణాలను కేవలం వర్తమానంలోనే చూడకూడదు. గత చరిత్రలోకి కూడా వెళ్ళాలి. ఇది, ప్రస్తుతం భీకర యుద్ధంలో ఉన్న ఉక్రెయిన్, రష్యా విషయంలో మరింత అవసరం. 24, ఫిబ్రవరి 2022న ఉక్రెయిన్‌పై రష్యా పెద్ద ఎత్తున సైనిక దాడిని ప్రారంభించడంతో ఆ రెండు దేశాల మధ్య ఘర్షణ పూర్తి స్థాయి యుద్ధంగా మారింది. ఈ చర్యకు ముందు%-% 2021 చివర, 2022 ప్రారంభంలో శక్షణ విన్యాసాలు పేరుతో ఉక్రెయిన్ సరిహద్దుల వెంబడి 1,00,000 మందికి పైగా తన సైనికులను రష్యా సమీకరించింది. ఫిబ్రవరి 21, 2022న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒక ప్రసంగంలో ఉక్రెయిన్‌ను సార్వభౌమ దేశంగా గుర్తించడాన్ని తిరస్కరించారు. అది సోవియట్ యూనియన్ సృష్టి అని, పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌ను రష్యాకు వ్యతిరేకంగా యుద్ధానికి రెచ్చగొడుతున్నాయని ఆరోపించారు. తూర్పు ఉక్రెయిన్‌లోని రష్యా మద్దతు గల, స్వయం%-%ప్రకటిత ప్రాంతాలైన డొనెట్స్క్, లుహాన్స్క్‌లను స్వతంత్ర రాష్ట్రాలుగా గుర్తిస్తున్నట్లు అదే ప్రసంగంలో ఆయన ప్రకటించారు. పిదప, మూడు రోజుల తర్వాత (ఫిబ్రవరి 24) ఉక్రెయిన్‌పై ప్రత్యేక సైనిక చర్యకు పుతిన్ ఆదేశించారు. రష్యా సైన్యం రష్యా, బెలారస్, ఆక్రమిత క్రిమియా నుంచి బహుళ దిశలలో ఉక్రెయిన్‌పై దాడి చేసింది. కీవ్, ఖార్కివ్, డాన్‌బాస్ ప్రాంతంలోని కీలక నగరాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడి, 2014 నుంచి కొనసాగుతున్న సంఘర్షణను తీవ్రతరం చేసింది. నాటో, యూరోపియన్ యూనియన్‌తో ఉక్రెయిన్ సన్నిహితంగా ఉండకుండా నిరోధించడం, ఆ దేశంపై రష్యా నియంత్రణను పూర్తి స్థాయిలో స్థాపించడం అనే భౌగోళిక, రాజకీయ లక్ష్యాలు ఆ దాడి వెనుక ఉన్నాయి. ఉక్రెయిన్ లాంటి ఒక చిన్న దేశం పొరుగున ఉన్న ఒక అగ్రరాజ్యంతో తలపడటంలో (అమెరికా, ఐరోపా దేశాల మద్దతుతోనే అయినప్పటికీ) ఆ చిన్న దేశ ప్రజలు, మేధావుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవలేదు. ఇందుకు బలమైన కారణాలు తప్పక ఉంటాయి. ఈ కోణంలో చరిత్ర విలోకిస్తే ఉక్రెయిన్, రష్యాల మధ్య శతాబ్దాల ప్రగాఢ సంబంధాలు ఉన్నాయి. సాంస్కృతిక, రాజకీయ సంబంధాలూ బలంగానే ఉండేవి. అదే సందర్భంలో విభేదాలు, హింసతో కూడిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఉక్రెయిన్ 18, 19 శతాబ్దాలలో రష్యన్ సామ్రాజ్యంలో భాగమైంది. రష్యనీకరణ విధానాలు ఉక్రెయిన్ భాష, సంస్కృతుల గుర్తింపును అణచివేశాయి. రష్యన్ విప్లవం తర్వాత ఉక్రెయిన్ స్వల్పకాలం (1917%-%20) స్వతంత్ర దేశంగా వర్ధిల్లింది. ఆ తరువాత సోవియట్ యూనియన్‌లో బలవంతంగా చేర్చబడింది. జోసెఫ్ స్టాలిన్ హయాం (1924%-%53)లో ఉక్రెయిన్‌పై కఠిన విధానాలు అమలు చేశారు. జార్ చక్రవర్తుల వలే స్టాలిన్ కూడా ఉక్రెయిన్‌ను సోవియట్ నియంత్రణలో ఉంచడానికి, రష్యనీకరణను ప్రోత్సహించడానికి శతథా ప్రయత్నించారు. ఉక్రెయిన్ సంస్కృతి, భాష, జాతీయ గుర్తింపును అణచివేశారు. మొదటి నుంచి ఉక్రెయిన్ ప్రజలలో జాతీయవాద చైతన్యం బలంగా ఉంది. ఈ విషయాన్ని నొక్కి చెప్పేందుకు (పోలిష్%-%అమెరికన్ జర్నలిస్ట్, చరిత్రవేత్త) తన రచన ' ఒక కవితను ఉటంకించారు: 'నేను చనిపోయినప్పుడు / నన్ను నా ప్రియమైన ఉక్రెయిన్‌లో ఖననం చేయండి/ ఒక ఎత్తైన సమాధి కొండపై/ విశాలమైన సమతల భూమిలో/ అక్కడ నా కళ్లు చూడగలవు, నా చెవులు వినగలవు/ విశాలమైన పొలాలను, అపారమైన పచ్చిక బయళ్ళను/ ద్నీపర్ నది ఒడ్డును/ గర్జించే శక్తివంతమైన నది శబ్దాన్ని'.1920ల చివరలో స్టాలిన్ నిర్బంధ సమష్టి వ్యవసాయ వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టారు. రైతులు తమ వ్యక్తిగత భూములను వదులుకొని సోవియట్ నియంత్రిత సమష్టి వ్యవసాయ క్షేత్రాలలో పనిచేయవలసి వచ్చింది. ఇందుకు వ్యతిరేకించిన రైతులను, ముఖ్యంగా 'కులక్స్' అని పిలిచే సంపన్న రైతులను వర్గ శత్రువులుగా చిత్రీకరించి, వారి భూములు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. వేలాది రైతులను సైబీరియాకు బహిష్కరించారు. మేధావులు, రచయితలు, సమష్టి వ్యవసాయ క్షేత్రాలను వ్యతిరేకించిన రాజకీయ నాయకులను సోవియట్ వ్యతిరేకులుగా ముద్రించి అరెస్టు చేశారు. చాలా మందిని హత్య చేశారు. సోవియట్ యూనియన్ పారిశ్రామికీకరణకు నిధులు సమకూర్చడానికి ఉక్రెయిన్ నుంచి భారీ మొత్తంలో ధాన్యాన్ని సేకరించారు. దీనివల్ల స్థానిక రైతులకు ఆహార కొరత ఏర్పడింది. 1932%-%33లో స్టాలిన్ విధానాల ఫలితంగా హొలోడోమోర్ అనే భయంకరమైన కృత్రిమ కరువు ఉక్రెయిన్‌లో సంభవించింది. 'హొలోడోమోర్ 'అనే పదానికి ఉక్రెయిన్ భాషలో అర్థం 'ఆకలితో చావు' . ఇది 1932 నుంచి 1933 మధ్య సోవియట్ ఉక్రెయిన్‌లో సంభవించిన ఒక మహా కాటకం. ఈ విపత్తులో 35 నుంచి 50 లక్షల వరకు ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది సహజ విపత్తు కాదని, జోసెఫ్ స్టాలిన్ నేతృత్వంలోని సోవియట్ పాలకుల విధానాల ఫలితంగా సృష్టించబడిన విపత్తుగా చరిత్ర గుర్తించింది. దీనిని కొంతమంది చరిత్రకారులు జాతి నిర్మూలన గా ప్రకటించారు స్టాలిన్ ప్రవేశపెట్టిన సమిష్టి వ్యవసాయ విధానంవల్ల ఉత్పత్తి తగ్గినప్పటికీ, సోవియట్ అధికారులు అసాధారణంగా అధిక ధాన్య సేకరణ కోటాలను విధించారు. కోటాలను పరిపూర్తి చేయలేని గ్రామాల నుంచి ధాన్యాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. రైతులను ఆహారం లేకుండా వదిలేశారు. ఉక్రెయిన్ గ్రామాలను 'బ్లాక్‌లిస్ట్' చేసి, ఆహార సరఫరాను నిషేధించారు. ఈ కరువు ఉక్రెయిన్ జాతీయవాదాన్ని అణచివేయడానికి, సోవియట్ నియంత్రణను బలోపేతం చేయడానికి ఉద్దేశపూర్వకంగా ఉపయోగించబడిందని చరిత్రకారులు భావిస్తారు. ఈ కరువు వల్ల గ్రామాలు ఖాళీ అయ్యాయి. వేలాది కుటుంబాలు ఆకలితో మరణించాయి. ఉక్రెయిన్ సమాజంపై ఈ కరువు దీర్ఘకాలిక ప్రభావం చూపింది.

# జీ7 మేల్కొనదా?!




నానాటికీ మసకబారుతున్న ప్రతిష్ఠను కాస్తయినా పునరుద్ధరించుకోవాలన్న స్పృహ కూడా లేకుండా ఎప్పటిలా జీ7 రెండు రోజుల సమావేశాలు కెనడాలోని ఆల్బెర్టాలో పేలవంగా ముగిశాయి. రష్యా%-%ఉక్రెయిన్ యుద్ధం అంతూ దరీ లేకుండా కొనసాగుతుండగా, తాజాగా ఇరాన్‌పై అమెరికా అండతో ఇజ్రాయెల్ దండెత్తింది. కానీ రెండు విషయాల్లోనూ తన వైఖరి ఎలావుండాలో, ఏం చేయాలో జీ7 తేల్చుకోలేకపోయింది. సమావేశాల ముగింపులో లాంఛనంగా విడుదల కావాల్సిన ఉమ్మడి ప్రకటన కరవైంది. ఏకపక్షంగా ఇరాన్‌పై దాడులకు దిగి పశ్చిమాసియాలో మరో మహాసంగ్రామానికి తెరలేపిన ఇజ్రాయెల్‌ను పల్లెత్తు మాట అనకుండా తప్పంతా ఇరాన్‌దేనని ఈ దేశాలు తేల్చాయి. ఆ యుద్ధం పర్యవసానాలు తమను సైతం చుట్టుముడతాయనీ, అమెరికా ఆ ఊబిలోకి దిగితే అది మరో ప్రపంచ యుద్ధంగా పరిణమించే ప్రమాదం ఉన్నదనీ తెలిసినా కిక్కురుమనలేదు. ఇరాన్‌ను ఏదో ఒకటి అనకపోయినా... రష్యాను నిందించే ప్రయత్నం చేసినా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆగ్రహం కలుగుతుందన్న భయం జీ7 దేశాలను వెన్నాడింది. సమావేశాలకు ముందు బ్రిటన్, కెనడాలు రష్యాపై మరిన్ని ఆంక్షలుంటాయని ఆర్భాటంగా ప్రకటించాయి. కానీ ట్రంప్ తీరు చూశాక వాటికి నోరుపెగల్లేదు. గాజా విషయంలో ఇజ్రాయెల్‌ను తప్పుబట్టినట్టు కనబడుతూనే, ఇరాన్‌పై దండయాత్ర విషయంలో ఒక్క మాట అనలేకపోయాయి. అసలే జీ7 'నిన్నటి క్లబ్' అని పేరుబడింది. ఆ అపకీర్తిని మరింత పెంచుకోవటానికే సభ్యదేశాలు పాటుపడుతున్నట్టు కనబడుతోంది! ఒకప్పుడు జీ7 మహా శక్తిమంతమైనది. 1980వ దశకంలో ప్రపంచ జీడీపీలో దాని వాటా ఏకంగా 70 శాతం. నిరుడు ఆ వాటా 30 శాతానికి కాస్త అటూ ఇటూగా ఉంది. ఆర్థిక కార్యకలా పాలు పశ్చిమం నుంచి తూర్పు దిశకు వలసవచ్చి చాన్నాళ్లవుతోంది. ఈ పారిశ్రామిక దేశాలకు చైనా సవాలుగా నిలిచింది. ఆర్థికంగా బలపడుతోంది. ఆ దేశానికి జీ7లో చోటు లేదు. అటు రష్యాకు మధ్యలో కొన్నాళ్లు సభ్యత్వం ఇచ్చినా 2014లో క్రిమియాను దురాక్రమించటంతో వెళ్లగొట్టారు. మన దేశం సైతం ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. అయినా పరిశీలక హోదాయే తప్ప సభ్యత్వం లేదు. ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక ప్రపంచ సంస్థలను అమెరికా చిన్నచూపు చూడటం మొదలైంది. భద్రతామండలికి విలువే లేకుండా పోయింది. తానే నిర్మించిన డబ్ల్యూటీవోను అమెరికా బేఖాతరు చేస్తోంది. ప్యారిస్ ఒప్పందం నుంచి, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి బయటికొచ్చింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా ఏర్పడుతున్న ఖాళీని భర్తీ చేయొచ్చన్న ఆలోచనగానీ, అందుకు తగిన ప్రణాళికలుగానీ జీ7 దగ్గర లేవు. ఎంతసేపూ అమెరికా తోకపట్టుకు పోవాలన్న ధోరణే. ట్రంప్ మాటలు గమనిస్తే ఆయనకు ప్రధాన ఎజెండా అయిన వాణిజ్యంపై ధ్యాసలేదన్న సంగతి తెలుస్తుంది. సదస్సులో ఎక్కువసేపుంటే ఉక్రెయిన్ విషయంలో ఒత్తిడి తప్పదన్న భయం వల్లనో, ఇరాన్ సంగతి తేల్చాలన్న ఆవేశంతోనో ఆయన మధ్యలోనే నిష్క్రమించారు. వెళ్లేముందు రష్యా దురాక్రమణకు మీరే కారణమంటూ నిందించారు. తమ మాజీ అధ్యక్షుడు ఒబామా, అప్పటి కెనడా ప్రధాని స్టీఫెన్ హార్పర్‌లు 2014లో రష్యాను జీ7నుంచి బయటకు నెట్టకపోతే ఇవాళ ఆయన సమావేశాల్లో ఉండేవారని, యుద్ధం ఆపటానికి ఒత్తిడి తెచ్చేవారమని నిష్ఠూరమాడారు. అసలు యుద్ధమే వచ్చి వుండేది కాదని కూడా ఆయన చెప్పుకొచ్చారు. అందుకే, ఇక్కడ న్యాయానికి చోటులేదని గ్రహించారో ఏమో... ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం సమావేశాలకు మధ్యలోనే గుడ్‌బై చెప్పారు. నిరుడు జూన్‌లో జరిగిన జీ7 సమావేశాల సందర్భంగా ఉక్రెయిన్‌కు 5,000 కోట్ల డాలర్ల రుణమిస్తామని తీర్మానించారు. దాని ప్రకారం నెలకు వంద కోట్లు ఉక్రెయిన్‌కు అందించాలి. కానీ ట్రంప్ రాకముందే డిసెంబర్‌లోనే అప్పటి అధ్యక్షుడు బైడెన్ దానికి కోత పెట్టారు. ఆయనొచ్చాక ఇక చెప్పేదేముంది? ఈ భారాన్ని ఇతర సభ్య దేశాలు మోస్తున్నాయి. నిజానికి, గత వైభవం మళ్లీ దక్కాలంటే జీ7 పరిపూర్తి చేయాల్సిన లక్ష్యాలు చాలానే ఉన్నాయి. అంతర్జాతీయ శాంతికి, భద్రతకు తమ వంతు కృషి అవసరం. కృత్రిమ మేధ, క్వాంటమ్‌లకు కావాల్సిన అత్యంత కీలకమైన ఖనిజాల సరఫరా ఆటంకం లేకుండా చూసుకోవాలి. పటిష్ఠమైన మౌలిక సదుపాయాల కల్పనకూ, యువతకు భారీయెత్తున ఉద్యోగావకాశాలు వచ్చిపడే రంగాలపై దృష్టి సారించాలి. కానీ ఇవన్నీ సాకారం కావాలంటే యుద్ధాలు లేని ప్రపంచం ఉండాలి. మరి దానికోసం జీ7 చేసిందేమిటి? ఈ దేశాలన్నీ అమెరికా సాగించిన యుద్ధాల్లో భాగస్వాములుగా మారి చేజేతులా ఆర్థిక వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసుకున్నాయి. నిజానికి ఇజ్రాయెల్‌ను పూర్వంలా యూరప్ దేశాల్లో జనం వెనకేసుకు రావటం లేదు. ఇరాన్ అణ్వస్త్రం తయారు చేయటం అనర్థమన్న అభిప్రాయం ఉన్నా ఆ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి దాన్ని ఒప్పించాలని మెజారిటీ జనం భావిస్తున్నట్టు సర్వేల్లో తేలింది. అయినా జీ7 దేశాలకు పట్టదు. మనవరకూ చూస్తే ఈ సదస్సు ఎంతో కొంత తోడ్పడిందని చెప్పాలి. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత నేరుగా పారిశ్రామిక దేశాధినేతలందరినీ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా కలిసి ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్తాన్ తీరు గురించి, దానిపై చర్య తీసుకోక తప్పని పరిస్థితి గురించి వివరించగలిగారు. ఏదేమైనా ఇలాంటి సదస్సులు మొక్కుబడిగా, బాతాఖానీ క్లబ్‌లుగా మారితే ఫలితం ఉండదు. కనీసం వచ్చే సమావేశాల నాటికైనా జీ7 దేశాలు ఈ సంగతి గ్రహించాలి.

# బనకచర్లపై బరిగీద్దాం.. కేసీఆర్‌లా కొట్లాడుదాం!



జలవివాదాలు, జల సంబంధిత యుద్ధాలు ప్రపంచంలో కొత్తేమీ కాదు. అలాగని మన దేశంలోనూ జల వివాదాలకు నేటికీ పరిష్కారం చూపలేదు. నికర, మిగులు, వరద జలాలతో రాష్ట్రాల మధ్య అంతర్యుద్ధాలకు 75 ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో తెరపడకపోవడం విచారకరం. జల వివాదాలకు ఫుల్ స్టాప్ పెట్టడం క్లిష్టమే కావచ్చు కానీ, వివాదాలకెందుకు మోక్షం లభించడం లేదు. పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్రం ఎందుకు పక్షపాత ధోరణిని అవలంబిస్తున్నదనేది ఇక్కడ ప్రశ్న. కేవలం నికరజలాల ఆధారంగా రూపొందించిన ప్రాజెక్టులకే ఇప్పటిదాకా కేంద్రం అనుమతులిస్తున్నది. అదే శాస్త్రీయత, ధర్మం కూడా. శ్రీశైలం, శ్రీరాంసాగర్ సహా అనేక ప్రాజెక్టులను నికర జలాల ఆధారంగానే కట్టారు. వడ్డించేవాడు మనవాడే, ఏ బంతిలో కూర్చుంటే ఏముంది అన్నట్టుగా వరద జలాలతో రూ.లక్ష కోట్లతో ప్రాజెక్టు కడుతున్నారు. ఇది ప్రజాస్వామ్యమా.. లేదా నియంతృత్వమా? ఈ నేపథ్యంలో నీళ్ల కోసం నిప్పులు పుట్టించిన తెలంగాణ ఉద్యమ గుర్తులను మరోసారి నెమరువేసుకోవాల్సి వస్తున్నది. ఏపీ, తెలంగాణ మధ్య నిప్పు రాజేస్తున్న బనకచర్లపై మరో ఉద్యమానికి బరిగీసి కొట్లాడాల్సిన తరుణం ఆసన్నమైంది. నదీ జలాలను పంచుకునే విషయంలో సంబంధిత రాష్ట్రాల మధ్య పరస్పర అవగాహన ఉండాలి. జలాల సమాచారం పారదర్శకంగా ఉండాలి. జల వివాదాలను పరిష్కరించడానికి సమగ్ర విధానాన్ని అనుసరించాలి. కానీ, వీటన్నింటినీ పట్టించుకోకుండా కేంద్రంలో బలం ఉంది కదా అని, తెలంగాణపై మరోసారి బాబు కుట్రలు చేస్తున్నారు. ఆయన కుట్రలను తెలంగాణ చూస్తూ ఊరుకోదు కాక ఊరుకోదు. దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లోని నదుల్లో ప్రవహించే నీటి పరిమాణాన్ని లెక్కించి, నీటి లభ్యతను తేల్చి ఆయా రాష్ట్రాలకు జలాల కేటాయింపులు చేసేందుకు నదీ ట్రిబ్యునళ్లు ఏర్పాటయ్యాయి. ఇలా దేశంలో దాదాపు ఎనిమిది ట్రిబ్యునళ్లు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం ఐదు మనుగడలో ఉన్నాయి. కానీ, ఏ ట్రిబ్యునల్, ఏ అంతర్రాష్ట్ర చర్చల్లేకుండా బనకచర్లను నిర్మించే కుట్రకు చంద్రబాబు తెరలేపారు. సాహసం చేశారు. దీన్నిబట్టి తెలంగాణ పట్ల ఆయనకున్న వ్యతిరేక ధోరణిని అర్థం చేసుకోవచ్చు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టి తెలంగాణలో గోదావరి జలాల వినియోగాన్ని కుట్రపూరితంగా తగ్గించి చంద్రబాబుకు సీఎం రేవంత్ సహకరిస్తున్నారు. ఒక జాతీయ ప్రాజెక్టు చేపట్టాలన్నా, ఆయా రాష్ట్రాలు కేంద్ర జల సంఘం అనుమతితో ప్రాజెక్టులను నిర్మించాలన్నా అన్నింటికంటే ముందుగా రేకెత్తే ప్రశ్న నీటి కేటాయింపులు ఉన్నాయా? అని. ఈ నీటి కేటాయింపులు ట్రిబ్యునల్ ఆధారంగానే జరుగుతాయి. అందుకే ఇప్పటివరకు కేంద్రం అనుమతులు ఇచ్చిన ప్రతి ప్రాజెక్టుకు ట్రిబ్యునల్ నీటి కేటాయింపులే ప్రామాణికం. కానీ, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, జాతీయ నీటి ప్రమాణాలకు భిన్నంగా చంద్రబాబు చెప్తున్న వృథాజలాల ఆధారిత బనకచర్లకు మోదీ ప్రభుత్వం అనుమతులు ఎలా ఇస్తుంది? ఏటా వర్షాకాలంలో సముద్రంలోకి వృథాగాపోతున్న గోదావరి వరద జలాలను రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు తరలించేందుకు గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును నిర్మించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. కృష్ణా నదిపై ఎగువ ప్రాజెక్టుల కారణంగా నీళ్లు సరిగ్గా రావట్లేదు. మరోవైపు గోదావరి నుంచి సగటున ఏటా 2 వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలిసిపోతున్నాయి. ఇందులో 200 టీఎంసీలను వరదల సమయంలో మళ్లించాలనేది ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశంగా ఏపీ ప్రభుత్వం చెబుతున్నది. కానీ, ఇక్కడే ఏపీ సర్కారు కుట్రలు దాగి ఉన్నాయి. గోదావరిలో ఏటా 2 వేల టీఎంసీల వరద జలాలు సముద్రంలో కలుస్తున్నాయని ఏపీ చెబుతున్నది. కానీ, ఎగువన తెలంగాణ సహా మిగిలిన రాష్ట్రాలకూ ఏపీలాగా వృథా జలాలపై వాటా ఉంటుంది.రాయలసీమలోని 80 లక్షల మందికి తాగునీటితో పాటు కొత్తగా మూడు లక్షల హెక్టార్ల ఆయకట్టుకు నీరందించడం, నాగార్జున సాగర్ కుడి కాలువ, వెలిగొండ, తెలుగు గంగ, గాలేరు నగరి, కేసీ కెనాల్ కింద 22 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంతో రూ.80,112 కోట్లతో ఈ ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర జల్ శక్తి శాఖకు ఏపీ ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. దీనికి ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై), యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రాం (ఏఐబీపీ) కింద సహాయం అందించాలని కోరుతూ కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఇంట్రా స్టేట్ లింక్ (రాష్ట్ర పరిధిలో అనుసంధానం) ప్రాజెక్టు కింద నిధులివ్వాలని కోరారు. దీనిపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో కూడా సీఎం చర్చించారు. మూడు దశల్లో గోదావరి-బనకచర్ల అనుసంధానం చేపట్టనున్నట్టు ఏపీ ప్రభుత్వం ఆ ప్రతిపాదనల్లో పేర్కొంది. మొదటి దశలో పోలవరం నుంచి కృష్ణా నదికి జలాలను మళ్లిస్తారు. ఇందుకోసం పోలవరం కుడి కాలువ సామర్థ్యాన్ని పెంచుతారు. ప్రస్తుతం కుడికాలువ సామర్థ్యం 17,500 క్యూసెక్కులు ఉండగా, దాన్ని 38,000 క్యూసెక్కులకు పెంచుతారు. కొత్తగా 25 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో పోలవరం కుడి కాలువకు సమాంతరంగా వరద కాలువ తవ్వుతారు. రెండో దశలో కృష్ణా నది నుంచి నాగార్జున సాగర్ కుడి కాల్వలో 80వ కిలోమీటరు వద్ద నీటిని కలుపుతారు. ఈ కాలువను 80 కిలోమీటర్ల నుంచి 96.5 కిలోమీటర్ల వరకు సామర్థ్యాన్ని పెంచి జలాలను తరలిస్తారు. మూడో దశలో బొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నల్లమల అరణ్యం మీదుగా బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలిస్తారు. ఇందుకోసం నల్లమల అడవుల్లో 26.8 కిలోమీటర్ల మేర సొరంగం ద్వారా నీటిని మళ్లిస్తారు. మొత్తంగా తొలి దశ పనులకు రూ.13,511 కోట్లు, రెండో దశ పనులకు రూ.28,560 కోట్లు, మూడో దశ పనులకు రూ.38.041 కోట్లు మొత్తంగా రూ.80,112 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందుకోసం 48 వేల ఎకరాల భూసేకరణ జరుపుతున్నారు. ఇందులో 17 వేల ఎకరాల అటవీ భూమి కూడా ఉంది. ఈ బనకచర్ల ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోసేందుకు 4 వేల మెగావాట్ల విద్యుత్తు అవసరమని ప్రభుత్వం ఆ నివేదికలో పేర్కొంది. అంటే పేరుకు గోదావరి నీళ్లే అయినా ఇత్తేసి పొత్తుకూడి కృష్ణా జలాలకు సూటి పెడుతున్నారని చెప్పాలి. సముద్రంలో కలిసే వృథా జలాలకు కేంద్రం అనుమతులు ఇచ్చి, నిధులు సమకూరిస్తే భవిష్యత్తులో మిగిలిన రాష్ట్రాలు కూడా సముద్రంలో కలిసే జలాల ఆధారంగానే ప్రాజెక్టులను రూపొందించుకుంటాయి. ఇదే జరిగితే ఎగువ రాష్ట్రాల హక్కుల్ని కాపాడేదెవరు? ప్రధానంగా కృష్ణాలో కూడా ఈ ఏడాది (2024-25) 858 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. 2023-24 నీటి సంవత్సరంలో 72 టీఎంసీలు, 2022-23 నీటి సంవత్సరంలో 765 టీఎంసీలు సముద్రంలోకి పోయాయి. మరి వీటి ఆధారంగా తెలంగాణ గాని, ఇతర రాష్ట్రాలు గాని ప్రాజెక్టుల రూపకల్పన చేస్తే కేంద్రం అనుమతి ఇస్తుందా? కావేరికి గోదావరి జలాలను తరలించాలని కేంద్రం తాపత్రయ పడుతున్నది. కేంద్రం బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టే ఇచ్చి కావేరీ అనుసంధానాన్ని తెరపైకి తెస్తే దక్షిణాది రాష్ట్రాల జలాల పంపిణీల్లో మరిన్ని చిక్కుముళ్లు, వివాదాలు రాజుకుంటాయి. వైఎస్ హయాంలో వరద జలాల ఆధారంగా పోతిరెడ్డిపాడు విస్తరణ జరిగింది. కృష్ణా బోర్డు ముందు ఏపీ పోతిరెడ్డిపాడుకు నీటి కేటాయింపులు ఉన్నట్టు గిరిగీసి మరీ ఏటా వందల టీఎంసీలను శ్రీశైలం నుంచి తరలిస్తున్నది. శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్తు కేంద్రంలో కరెంటు ఉత్పత్తి చేస్తే పోతిరెడ్డిపాడుకు నీళ్లు అందడం లేదని, వెంటనే నిలిపివేయాలని బోర్డుకు ఫిర్యాదు చేస్తున్నది. ఇట్లాగే భవిష్యత్తులో బనకచర్ల, కావేరికి నీళ్లు సరిపోవడం లేదని, వెంటనే కాళేశ్వరం, దేవాదుల ఎత్తిపోతలను నిలిపివేయాలని ఫిర్యాదులు చేసే పరిస్థితులు కూడా దాపురించే ప్రమాదం ఉంది. పోలవరంలో బచావత్ ట్రిబ్యునల్ అవార్డు మేరకు ఎగువ రాష్ట్రాలకు కృష్ణాజలాల్లో వాటా పెంచినట్లుగా ఇందులోనూ వాటా ఇస్తారా? అసలు గోదావరిలో శాస్త్రీయంగా ఎంత నీటి లభ్యత ఉన్నది? ఎగువ రాష్ట్రాల ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలు ఏమిటనే లెక్కలు తీయాలి. అవన్నీపోగా మిగులు ఉన్నాయని తేలితే బనకచర్లకు కేంద్రం అనుమతులు ఇవ్వాలి. తద్వారా ఆ ప్రాజెక్టుకు ఎంత నీళ్లు కేటాయిస్తారో, అంతమేర కృష్ణా జలాల్లో తెలంగాణకు అదనపు వాటా ఇవ్వాలి. గోదావరి వరద నీటిని రాయలసీమలోని పెన్నా బేసిన్‌కు మళ్లించాలన్న ఆంధ్రప్రదేశ్ కుట్రలు ఇక్కడ స్పష్టంగా కనిపిస్తున్నాయి. గోదావరి జల వివాద ట్రిబ్యునల్ అవార్డుకు, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి ఈ ప్రాజెక్టు వ్యతిరేకం. తమిళనాట రాజకీయ ప్రయోజనాలు పొందాలనే ఉద్దేశంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. దీనిపై కేసీఆర్ హయాంలోనూ కేంద్రంలోని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ

# మా కూడు లాక్కుంటరా?

తెలంగాణ బీసీ జాబితాలోకి వచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్న బలిజ, కళింగ, కొప్పుల వెలమ, తూర్పు కాపు, శెట్టిబలిజ తదితర వర్గాల ప్రజలు, వారి తరఫున మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రజాప్రతినిధులకు నాదొక ప్రశ్న. తూర్పు కాపులను బీసీల్లో చేర్చవద్దని ఆందోళనలు చేసిన మీరు మా తెలంగాణలో బీసీ జాబితాలో వారిని చేర్చాలని ఎలా డిమాండ్ చేస్తారు? 2017 మార్చి 20న అమలాపురంలోని శ్రీరాంపురంలో ప్రస్తుత ఏపీ కార్మిక శాఖ మంత్రి సుభాష్ అధ్యక్షతన బీసీ సంఘాల నేతృత్వంలో ఆందోళనలు జరిగింది నిజం కాదా? కార్మిక శాఖ మంత్రికే కాదు, టీడీపీ, జనసేన, బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలనూ ఇదే ప్రశ్న అడుగుతున్నా. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ నుంచి చేరాలనుకుంటున్న మీతో పోలిస్తే మా తెలంగాణ ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, విద్యా, రాజకీయ, ఉద్యోగపరంగా వెనుకబడిపోయారు. అందుకే మీ మూలంగా తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ, యువతకు, మొత్తంగా తెలంగాణ ప్రాంత ప్రజలకు అన్యాయం జరుగుతున్నదనే కారణంగా తెలంగాణ ఉద్యమం పురుడుపోసుకున్నది. స్వరాష్ట్రం ఏర్పడింది. 'నీళ్లు, నిధులు, నియామకాలు' నినాదమంటే అన్ని రకాల వనరులు అని అర్థం. 2016లో ఏపీ బీసీ జాబితాలోని ఏడు తెలంగాణ బీసీ కులాలను తొలగించారు. మీరు మీ రాష్ట్రంలో మా తెలంగాణ బీసీ కులాలను ఉంచి, ఇక్కడ డిమాండ్ చేయడంలో ఒక అర్థముంటుంది. ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లో దళిత, బీసీ, గిరిజన, మైనారిటీల పేరుతో చాలామంది దొడ్డిదారిన చేరిపోయారు. కల్మష మెరుగని తెలంగాణ ప్రజలను ఈ విధంగా మోసం చేయడం న్యాయమా? మీ చేరిక వల్ల



బీసీల విద్యకు తీవ్రమైన ఆటంకం కలుగుతుంది. జాతీయ/రాష్ట్ర విద్యాసంస్థల్లో సీట్లన్నీ మీ విద్యార్థులే తన్నుకుపోతారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లలోనూ తెలంగాణ వారికి అన్యాయం జరుగుతుంది. ఇప్పుడు తెలంగాణలో చేరాలనుకుంటున్న కళింగ, వెలమ, రెడ్లు, కమ్మ సామాజికవర్గాలు క్రీ.శ.1323-1724 మధ్యకాలంలో ఆంధ్రా ప్రాంతంలో రాజ్యాలు ఏలినవే. చారిత్రక క్రమంలో దొడ్డిదారిన వీళ్లు వివిధ కులాల పేర, ఇంటి పేర లేదా వృత్తి పేరిట బీసీల్లో చేరిపోయారు. ఉద్యోగాలే కాదు, రాబోయే రోజుల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయ పదవులనూ వారు ఎత్తుకుపోయే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే బీసీ జాబితాలో చేరిన తర్వాత వాళ్లు కూడా తెలంగాణవారవుతారు. అసలు వాళ్లను తెలంగాణలోకి ఎందుకు ఆహ్వానం పలకాలి? వారు వచ్చేది రాశిపై పడి దోచుకుతినడం కోసమే కదా? తెలంగాణ భూమితో, సామాజిక అస్తిత్వంతో సంబంధాలు ఉన్నప్పుడు మాత్రమే తెలంగాణవాళ్లు అవుతారు. నిజానికి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో ప్రత్యేకమైన ఒక జాబితాను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. ఆ రాష్ట్ర ప్రజల అస్తిత్వం, సామాజిక స్థితిగతుల ఆధారంగానే ఇది జరుగుతున్నది. దాని ఆధారంగా చూసుకున్నా మీరు తెలంగాణవాళ్లు కాదని తేలిపోతుంది. 11వ శతాబ్దం కంటే ముందు నుంచే మీ అస్తిత్వం అక్కడే ఉంది కదా? 50 ఏండ్ల నుంచి తెలంగాణలో ఉన్నామంటున్న మీరు మీ ప్రాంతంలో ఉన్న బీసీ జాబితాలోని మీ వాటానేమైనా తీసుకొస్తున్నారా? సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా చూసినా, ఏ రూపంలో చూసినా తెలంగాణ బిడ్డలకు అన్యాయాన్ని తలపెట్టడానికే వస్తున్నారని చెప్పక తప్పదు. ఇక్కడి బీసీలు తమకు దక్కాల్సిన స్థాయిలో వాటా దక్కలేదని పోరాటాలు నిర్మిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సందట్లో సడేమియాలాగా మీ వలసవాదంతో మా వాటా కొల్లగొడతారా? మా నోటికాడి ముద్దని ఎత్తుకుపోతారా? అసలు బీసీ సంఘాలు దీనికి ఎందుకు ఒప్పుకుంటున్నాయి? ఏమైనా లోపాయికారి ఆర్థిక ఒప్పందం

## ఎస్సీ సర్పంచ్ ను అవమానించిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి బహిరంగ క్షమాపణ చెప్పాలి

### వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కొట్టలా రాజు



:ఆలూరు : దళిత వర్గానికి చెందిన సర్పంచ్ ను బహిరంగంగా అవమానించిన ఆదోనిలో ఎమ్మెల్యే పార్థసారధి ,టిడిపి నాయకురాలు గుడిసె కృష్ణమ్మ ల అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కొట్టలా రాజు డిమాండ్ చేశారు. గురువారం ఆలూరు ఆర్ అండ్ బి అతిథి గృహం లో ఆయన విలేఖర్లతో మాట్లాడారు. ఆదోని మండలం దానపురం గ్రామం లో ఎస్సి సర్పంచ్‌ను స్టేజ్ పైకి రమ్మన్నా, పక్కన ఉన్న గుడిసె కృష్ణమ్మ ఆయన ఎస్సీ అంటూ అవమానించేలా మాట్లాడటం చూస్తే దళితులను అవమానించేనట్లన్నారు. అవమానం జరుగుతున్న కనీసం ఎమ్మెల్యే హెూదా లో ఉన్న పార్థసారధి కనీసం గుడి పైకి ఎక్కించుకోకుండా వేదిక క్రిందనే నిల్చోబెట్టి మాట్లాడటం చూస్తే దళితుల కి ఇంతా కంటే అవమానం ఏముందన్నారు. ఈ ఘటన తో దళితుల మనోభావాలు దెబ్బతినాయన్నారు.ఈ ఘటనను దళిత సంఘాలు ముక్తా కంఠం తో ఖండించాలన్నారు. దళిత సర్పంచ్ కు జరిగిన ఈ అవమానం పై కూటమి ప్రభుత్వం స్పందించి ఎమ్మెల్యే పార్థసారధి పై చర్యలు తీసుకోవాలన్నారు.ఇప్పటికైనా సర్పంచ్ కు బహిరంగ క్షమాపణ చెప్పకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవలసి వస్తుందని హెచ్చరించారు.ఈ ఘటనపై దళిత సంఘాలు స్పందించి రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు కార్యాచరణ కి సిద్ధం కావాలని కోరారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు వీరాంజనేయులు సోము కళ్యాణ్ పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ నిధులు ఒకేసారి విడుదల చెయ్యాలి.

### వైఎస్సార్సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి.



గుత్తి : పట్టణంలో వైఎస్సార్సీపీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి అన్నారు.అన్నదాత సుఖీభవ పేరుతో ఇస్తామన్న ఇరవై వేల రూపాయలు ఒకేసారి ఇవ్వాలని అన్నారు.ఇప్పటికే మొదటి సంవత్సరం రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా రైతులను మోసం చేసిందన్నారు.రైతులకు ఇప్పటికే పంటలు పండక పండిన పంటలకు కనీసం గిట్టుబాటు ధర లేకుండా కుదేలయి పోతున్నారు ఇటువంటి సమయంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణం అన్నారు.రైతులకు చెల్లించాల్సిన ఇన్స్యూరెన్స్ ఇన్పుట్ సబ్సిడీ కూడా ఇవ్వలేదన్నారు.శ్రీశైలం వెనక జలాల ద్వారా నిర్మించిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిధులివ్వకుండా అటకెక్కించి రాయలసీమ రైతులకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు.అనంతపురం జిల్లా రైతులు ఎక్కువ శాతం బోర్లపై ఆధారపడతారు హంద్రీనీవా కాలువ ద్వారా ప్రవహించే నీళ్ల వల్ల బోర్లు రీఛార్జ్ అయ్యి రైతులకు ఉపయోగకరంగా ఉండేది కానీ కూటమి ప్రభుత్వం కుప్పం కి నీళ్లు తీసుకొనిపోవడానికి ఇక్కడి రైతుల నోట్లో మట్టికొట్టే విధంగా కాల్వకు సిమెంట్ లైనింగ్ ఏర్పాటు చేస్తున్నారు దీనివలన అనంతపురం జిల్లా రైతులకు తీవ్ర నష్టం చేకూరుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ గుత్తి మున్సిపల్ కౌన్సిలర్ వరద రాజులు నాయకులు జ్ఞానేశ్వర్ రెడ్డి,అరుణ్ కుమార్ సుభాష్చంద్రబోస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్య మాఫియాకు అడ్డుకట్టు వేయాలని అడిగితే ఏఐఎస్ఎఫ్ నాయకుల పైన దాడుల??

### రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యులు ఎన్డీఏ ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులే




కర్నూలు జిల్లా : ఎమ్మిగనూరు రాష్ట్రవ్యాప్తంగా శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీ అరికట్టాలనీ ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ లో ఫర్నిచర్ ధ్వంసం: ఏఐఎస్ఎఫ్‌లి రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడి అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో శ్రీ చైతన్య కళాశాల వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు పైన దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ అరికట్టాలని రాష్ట్రవ్యాప్తంగా శ్రీ చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీ అరికట్టాలనీ కోరుతూ ఎమ్మిగనూరు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య స్కూల్ లో ఫర్నిచర్ ధ్వంసం జరిగింది ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శి విష్ణు, అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్య మాఫియా ఫీజుల దోపిడీ పుస్తకాల వ్యాపారం అరికట్టాలని విజయవాడ పట్టణంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలరాజు రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్ పైన పోలీసులు దాడి చేయడానికి ఖండించారు విద్యార్థి నాయకుల పైన దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.. ఫీజుల దోపిడీ అరికట్టమని అడిగితే విద్యార్థి నాయకుల పైన దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యులు దాదాపు 90% పైగా ఎన్డీఏ ప్రభుత్వంలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులవే ఉన్నాయన్నారు. ఇంకా ప్రభుత్వ విద్యాసంస్థలు ఎక్కడ అభివృద్ధి చెందుతాయని ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్ర చట్టాన్ని అమలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల్లో ఎంత ఫీజు ఉండాలా దాని ప్రకారమే వసూలు చేసే విధంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చైతన్య విద్యాసంస్థలు ప్రభుత్వానివే విద్యాసంస్థలు మా ప్రభుత్వానివే రాష్ట్రంలో ఏ విద్యాసంస్థలు తీసుకున్న కూడా ఎన్డీఏ ప్రభుత్వం లో ఉన్న ప్రజా ప్రతినిధులవే అన్నారు.. ప్రభుత్వ నిబంధనలకు విధంగా పుస్తకాల వ్యాపారం చేయకూడదని ఉన్నప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థలు వేల రూపాయలకు అమ్ముతున్నారని మండిపడ్డారు. విద్య మాఫియా అరికట్టాలని విద్యాదోపిడి ఆపాలని శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకుల పైన దాడి చేసి అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు దాడి చేసిన ఎస్ఐ శంకర్ కానిస్టేబుల్ వీరులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సమీర్, ఆజి బాబు, భార్గవ్, గిరి, సురేష్,రవి, మహేష్,పాల్గొన్నారు

## సమస్యలు కు నిలయంగా మారిన చిలకలదోన ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాల



: కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం కేంద్రంలో చిలకల డోనా గ్రామం నందు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల సమస్యలు నిలయంగా మారడం జరిగిందని ఆర్ యు ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ ఆర్ పి యస్ ఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది మాట్లాడుతూ ఈరోజు ఈ చిలకళడొనా గ్రామ ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సీ కాలనీ ఎంపీపీ ఎస్ పాఠశాలను సందర్శిచి కొత్తగా వచ్చినటువంటి హెచ్ఎం మేడం గారిని అక్కడ ఉన్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది మేము విచారణ చేసుకోగా అక్కడ ఉన్నటువంటి సమస్యలు విద్యార్థులను మరుగుదః డ్లు ఉన్న కూడా విద్యార్థులుముళ్ళ కంపల్ లోకి పంపించడం దారుణమని విద్యార్థులు ముండ్ల కంపల్లోకి వెళ్లడం వలన వారికి విషకరమైనటువంటి వారికి హాని తల పెడితే దానికి బాధ్యులు ఎవరని వారు హెచ్ఎం ను ప్రశ్నించారు గతంలో ఉన్నటువంటి హెచ్ఎం గారికి చెప్పినా కూడా వారు పట్టించుకోకపోవడం జరిగిందని మీరైనా పట్టించుకోని విద్యార్థుల బాగోగులు చూడాలని హెచ్చరించడం జరిగింది అదేవిధంగా అక్కడ పనిచేస్తున్నటువంటి వంట ఏజెన్సీలు ప్రభుత్వం చెప్పినటువంటి నియమ నిబంధనల కు విరుద్ధంగా కట్టెలతో వంట చేయడం జరుగుతుంది కట్టెలతో వంట చేయడం వలన పక్కనే ఉన్నటువంటి విద్యార్థులకు పొగ తగలడంతో వారు అనారోగ్యానికి గురి కావడం జరుగుతుందని అదేవిధంగా వంట ఏజెన్సీ ఆన్లైన్లో ఎవరైతే పేర్లు ఉన్నాయో వారు మాత్రమే వంట ఉండడానికి అర్హులు కానీ దీనికి భిన్నంగా ఎంఈఓ హెచ్ఎం పరిగణలోకి తీసుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మరియుపాఠశాల పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి ముళ్ళకంపలను తొలగించాలని వారు కోరారు లేనిపక్షంలో మరిన్ని ఉద్యమాలకు దారి తీస్తామని వారు హెచ్చరించారు

## ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

### రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్



కడప : రెవల్యూషనరీ స్టూడెంట్ ఫోరమ్ రాష్ట్ర ప్లినరీ సమావేశాలు కడప వేదిక గా,ఆగష్టు 23,24తేదీలలో జరుగు తున్నాయని, జయప్రదం చేయాలనీ ఆర్ ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి ఎం ఓబులేసు యాదవ్ కోరారు. గురువారం ఎస్కెయు లో ఆర్ఎస్ఎఫ్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డి. యం. ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలని ఏమాత్రం పాటించకుండా కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజులు, డొనేషన్ లు, అడ్మిషన్స్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్ అంటూ కొట్లాది రూపాయల వ్యాపారం శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలు చేస్తున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల పేరుతో భారీ దోపిడీ చేస్తున్నాయానారు. దీనిపై ఆర్ ఎస్ ఎఫ్ పోరాటబాట పెట్టానుందన్నారు.అదేవిధంగా ప్రభుత్వ పాఠశాల కు, జూనియర్ కాలేజీ లు, పోలిటెక్నిక్, డిగ్రీ కాలేజీ లకు నిధులు కేటాయించాలని, ఖాళీగా వున్నా పోస్టులని భర్తీ చేయాలనీ, సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కటించాలని, ప్రధానంగా యూనివర్సిటీ లల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేసి వర్సిటీ లల్లో పరిశోధనలను పెంచే విధంగా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీ లకు నిధులు కేటాయించాలి ఆర్ఎస్ఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు... రాష్ట్రంలోని ప్రభుత్వ విద్య పరిరక్షణ ధ్యేయంగా ఆర్ఎస్ఎఫ్ కీలకంగా ఉద్యమించేందుకు ఆగష్టు 23,24 వ తేదీలో జరగబోయే రాష్ట్ర ప్లీనరీ సమావేశాలలో కార్యక్రమాల సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షులు మండ్ల రమేష్, నాయకులు మంద విజయ్, బంగారు తిరుపత్తయ్య, కే. ఓబులేసు, ఆర్ ఎస్ ఎఫ్, ఎస్ కే యు నాయకులు శివ, వీర, సురేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## కొల్లడం,చిన్నఈటిపాకంలో భూసేకరణపై తుది అవార్డు విచారణ.



సత్యవేడు :సత్యవేడు మండలం కొల్లడం,చిన్న ఈటిపాకంగ్రామాల్లో రెవెన్యూ అధికారుల బృందం భూసేకరణకు సంబంధించి తుది అవార్డు విచారణ నిర్వహించారు. గురువారం సులూరుపేట ఆర్డీవో కిరణ్మయి అధ్యక్షతన తహసిల్దార్ రాజశేఖర్ పర్యవేక్షణలో ఓజిలి తహసిల్దారు పద్మావతి, బుచ్చినాయుడు కండ్రిగ రెవెన్యూ డిటి చంద్రబాబు తదితరులు రెవెన్యూ బృందం అవార్డు విచారణ చేశారు. ఈ నేపథ్యంలో చిన్నఈటిపాకం గ్రామంలో 7-88 సెంట్లు భూములకు సంబంధించి 28 మంది రైతులు వారి హక్కు పత్రాలను,పట్టాదారు పాస్ పుస్తకం,ఇతర డాక్యుమెంట్లు రెవెన్యూ బృందానికి సమర్పించి టైటిల్ డీడ్ ధ్రువీకరించుకోవడం జరిగింది.అలాగే కొల్లడం గ్రామంలో మూడు ఎకరాల 80 సెంట్లు సంబంధించి ముగ్గురు రైతుల వద్ద నుంచి హక్కు పత్రాలను సమర్పించి భూహక్కును నిర్ధారించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ ఏవో రవికుమార్,స్థానిక రెవెన్యూ డిటి త్యాగరాజు,ఆర్ఐ సురేష్,వీఆర్వో వినోద్ కుమార్,రైతులు పలువురు పాల్గొన్నారు

## శ్రీసిటీ సీఎఫ్ఓ కు పురస్కారం



శ్రీసిటీ, : ఈ నెల 18న ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన 8వ వార్షిక బిజినెస్ వరల్డ్ వరల్డ్ ఫైనాన్స్ స్ట్రాటజీ ఎక్సలెన్స్ అవార్డులలో శ్రీసిటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఆర్.నాగరాజన్ ప్రతిష్టాత్మక 'బెస్ట్ ఇన్ స్మాల్ ఎంటర్‌ప్రైజ్' అవార్డును అందుకున్నారు. ఉత్తమ ఆర్థిక ప్రణాళిక, పనితీరుకు గాను ఆయనకు అవార్డు దక్కింది.

## ఆర్ డి టి సంస్థ ఎఫ్ సి ఆర్ ఏ చట్టంలో ఉన్న ఆంక్షలు వెంటనే ఎత్తివేయాలి.

### గ్రామ ప్రజల డిమాండ్.




ఆలూరు : ఆలూరు నియోజకవర్గం హాలగుంద మండల, పరిధిలోని ప్రజలు ఆర్డిటి సంస్థ ఎఫ్ సి ఆర్ ఏ చట్టంలో ఉన్న ఆంక్షలు ఎత్తివేయాలని నిరసన తెలిపారు. మనదేశంలో1969 వ సంవత్సరము నందు స్పెయిన్ దేశపు విన్సెంట్ ఫెర్రర్ ఆర్డిటి రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ అధినేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరువు జిల్లాలోని రాయలసీమ ప్రాంతంలో మొదట అనంతపురం జిల్లాలో ఆర్ డి టి సంస్థను ఏర్పాటు చేసి ప్రధానంగా ఎస్సీ, ఎస్టీలు వెనకబడిన గ్రామాలను గుర్తించి వారి ఆర్థికా భివృద్ధికి సహాయ పడాలని సదుద్దేశంతో ఆర్థిక అభివృద్ధి విద్యా, వైద్యం ఇతర మౌలిక సదుపాయాలు ఆసుపత్రిలో ఉచిత వైద్యము అందించుట ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడము ఆర్డిటి యొక్క ముఖ్య ఉద్దేశం అందులో భాగంగా హొళగుంద మండల చుట్టుపక్కల గ్రామాలలో వెనకబడ్డ వర్గాలు ఎస్సీ,ఎస్టిలను తండాలను గుర్తించి16 సంవత్సరాలుగా ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ఆర్ డి టి ఎఫ్ సి ఆర్ ఏ నిధుల్ని కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడం జరిగింది. కావున ఎఫ్ సి ఆర్ ఏ చట్టంలో ఉన్న ఆంక్షలు ఎత్తి వేయాలని కొగిలాతోట, మార్లమడికి, ఎల్లార్తి, చిన్నహ్యాట, గ్రామ ప్రజలు హొళగుంద మండల తాసిల్దార్ నిజాముద్దీన్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, గోవర్ధన్, బసవరాజ్, చెన్నప్ప, వీరేష్, తారనాథ్, మండల ప్రజలు పాల్గొన్నారు.

## యోగాంధ్ర ను విజయవంతం చేద్దాం : ఎంపీడీఓ ప్రసాద్



వరదయ్యపాలెం, : ప్రతి ఒక్కరూ యోగా ని తమ జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్ పిలుపునిచ్చారు.జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా,యోగాంధ్ర ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.వైద్యపరంగా,మానసికంగా మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు యోగా కీలక పాత్ర పోషిస్తుందని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు.విద్యార్థులు,మహిళలు, ఉద్యోగులు,రైతులు %-% ప్రతి వర్గం వారూ యోగా చేయడం ద్వారా మేలును పొందవచ్చని వివరించారు.సర్వత్రా యోగా పై అవగాహన పెంచేలా కార్యక్రమాలు,శిబిరాలు నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను కోరారు. గ్రామీణ స్థాయిలో స్వచ్ఛంద సేవకులు,సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తో పాటు స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, యోగా గురువులు పాల్గొనున్నారు."మన ఆరోగ్య భద్రతకు యోగా మార్గదర్శకం అవుతుంది,అందరం కలిసి యోగాంధ్రను విజయవంతం చేద్దాం" అంటూ ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

## బిజెపి ఎమ్మెల్యే పై, గుడిసె క్రిష్ణమ్మ పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

### సుధాకర్ బాబు



కర్నూలు :ఆదోని బిజెపి ఎమ్మెల్యే పై, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్ బాబు మాట్లాడుతూ ఆదోని మండలం ధనాపురం గ్రామంలో జరిగిన కూటమి ప్రభుత్వం సంవత్సర పాలన సంబరాలు జరుపుకుంటూ గుడి దగ్గర జరిగిన సభలో దళితుడైన సర్పంచ్ చంద్రశేఖర్ ను అవమానించడం బాధాకరమన్నారు. సర్పంచ్ చంద్రశేఖర్ వేదిక దగ్గరికి వచ్చిన వేదికపైకి పిలవకుండా క్రింద నిలబెట్టి మాట్లాడటం దళిత జాతికి అవమానకరమని ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు, రాజ్యాంగ హక్కులను గౌరవించి సాటి మనిషిని మనిషిగా చూడటం నేర్చుకోవాలని హితవు పలికారు. ఒకపక్క మమ్ములను ఎస్టీ జాబితాలో చేర్చాలని అడుగుతూ ఎస్సీలను అవమాన పరచడం ఎంతవరకు సమంజసం అని సుధాకర్ బాబు ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ , ఎస్పీ గారు మంచి పరిపాలన అందిస్తున్నారని మంచి పేరు ఉందని ఆదోని ఎమ్మెల్యే పైన, గుడిసె కృష్ణమ్మ పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఈ కేసును సుమోటోగా తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని సుధాకర్ బాబు తెలియజేశారు. అనంతరం మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు మాట్లాడుతూ చంద్రశేఖర్ ని స్టేజి మీదకు పిలవకుండా అవమానపరిచినందుకు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పై, గుడిసే కృష్ణమ్మ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని తెలియజేశారు. అనంతరం జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఎన్సి బజారన్న మాట్లాడుతూ దళిత సర్పంచ్ చంద్రశేఖర్ ను అవమానించడం దళిత జాతికి అవమానమని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చిత్తూరు జిల్లాలో దళిత మహిళను చెట్టుకు కట్టి కొట్టడం జరిగిందని దళితులపై దాడులు ఎక్కువయ్యాయని, ఆదోని ఎమ్మెల్యే పై గుడిసె కృష్ణమ్మ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని త్వరలో జిల్లా కలెక్టర్ గారిని, జిల్లా ఎస్పీ గారిని కలిసి వినతి పత్రం సమర్పిస్తామని తెలియజేశారు. అనంతరం కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ దళిత సర్పంచ్ చంద్రశేఖర్ స్టేజి మీదకి పిలవకుండా కిందనే నిలుచోబెట్టి ఎస్సీ అని సంబోధించి అవమానపరచడం దళిత జాతికి అవమానమని వెంటనే వారి పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఎన్సి బజారన్న, కోడుమూరు కోఆర్డినేటర్ అనంత రత్నం మాదిగ, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కేకేసి చైర్మన్ ఎజాస్ అహ్మద్, జిల్లా మహిళా కాంగ్రెస్ ఎస్ ప్రమీల కాంగ్రెస్ నాయకులు సయ్యద్ నవీద్, ఎండ్లురు లాజరస్, అబ్దుల్ హై, ఐఎన్టియుసి రేపల్లె ప్రతాప్, జాన్ సదానందం కిషోర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## పిల్లల భవిష్యత్తు కోసం తల్లికి వందనం...

### ఏ రాష్ట్రంలో లేని విధంగా పథకం అమలు...

### తల్లికి వందనంతో లబ్ధిదారుల సంబరాలు...



(తనకల్లు) : విద్యతోనే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని విద్యతోనే అంటరానితనాన్ని రూపుమాపచ్చని భావించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి సంవత్సరానికి 13 వేల రూపాయల చొప్పున ఏ రాష్ట్రంలో కూడా లేనివిధంగా పథకాన్ని అమలు చేయడంతో లబ్ధిదారులు మండల పరిధిలోని బాలసముద్రం పంచాయతీకి చెందిన చంద్రబాబు నాయుడు కాలనీలో చైతన్య విద్యా మందిరం నందు సంబరాలు చేసుకుంటున్నారు.ఈ సందర్భంగా తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన తల్లికి వందనం పథకాన్ని ఒక పండుగ వాతావరణం లో ఈనెల 12 తారీఖున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇంట్లో విద్యార్థులు ఎంతమంది ఉంటే అంతమందికి ఏ రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలో పిల్లల భవిష్యత్తు బావుండాలని, వారు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని ఉద్దేశంతో సంవత్సరానికి తల్లికి వందనం పేరుతో 13000 రూపాయల చొప్పున ప్రతి ఒక్కరికి వారి తల్లుల ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందన్నారు. పిల్లలకు పుస్తకాలకు స్కూల్ ఫీజులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి సమయంలో తల్లికి వందనం డబ్బులు వేసినందుకు ప్రతి ఒక్క తల్లి తండ్రి ఆనందంగా సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ పథకాన్ని జీర్ణించుకోలేని వైసీపీ సైకోలు ప్రజలను మభ్యపెట్టే విధంగా ప్రవర్తిస్తున్నారని,ఈ రాష్ట్రంలో 2019 నుంచి 2024 వరకు ప్రభుత్వంలో ఉన్నటువంటి వైసీపీ అరాచక పాలన జీర్ణించుకొని ప్రజలు 2024లో తమ ఓటుతో బుద్ధి చెప్పిన వైసీపీ ప్రభుత్వానికి ఇంకా బుద్ధి రాలేదని లేనిపోని మాటలు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగేపల్లి అశోక్,షేక్ మా భాష, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు,పురుషోత్తం రెడ్డి, చైతన్య స్కూల్ అధినేత తలమర్ల పవన్ కుమార్,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పండ్లతోటల పెంపకం రైతులకు లాభదాయకం :- రత్నం




పత్తికొండ :- పండ్లతోటల పెంపకం లాభదాయకం అని క్లస్టర్ ప్లాంటేషన్ సూపర్వైజర్ రత్నం తెలిపారు. గురువారం ఆయన మండల పరిధిలోని పులికొండ, జూటూరు, రాజులమండగిరి గ్రామాలలోని రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోటల పెంపకనకు కేంద్రప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. యస్సి, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులు మామిడి, చీని, బత్తాయి, జామ, థైవాన్ జామ, సపోట, కొబ్బరి, చింత, డ్రాగన్ ఫ్రూట్, సీతాఫలం, అంజీర, దానిమ్మ, నేరేడు, యాఫిల్ బెర్, పండ్లతోటలతొ పాటు మునగ, గులాబీ, మల్లెపూల తోటల సాగుచేస్తే మూడు సంవత్సరాలపాటు నిర్వాహణ ఖర్చులు ప్రభుత్వం ఇస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రప్రభుత్వం బిందు సేద్యం, తుంపర సేద్యం కోసం బిసి చిన్న సన్నకారు, యస్సి, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ ఇస్తుందని ఆయన తెలిపారు. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, జాబ్ కార్డు జిరాక్స్ ప్రతులను తీసుకొని ఫీల్డ్ అసిస్టెంట్ కి గాని, టెక్నీకల్ అసిస్టెంట్ గాని,మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్యాలయంలో గాని ఇవ్వాలని ఆయన తెలిపారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పండ్లతోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో టెక్నీకల్ అసిస్టెంట్లు బసవరాజు, కాశన్న ఫీల్డ్ అసిస్టెంట్లు మహానంది, సురేంద్ర నాయుడు, సీనియర్ మేటీలు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## యమ్ ఆర్ పి యస్ ఆధ్వర్యంలో గ్రామాకమిటీలు ఏర్పాటు



దేవనకొండ : మండల పరిధిలోని యమ్ ఆర్ పి యస్ ఆధ్వర్యంలో లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది అని యమ్ ఆర్ పి యస్ నాయకులు మాచపురం ఈరన్న తెలిపారు గురువారం అలారుధిన్నే వరిముక్కల గ్రామాలల్లో కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు అలాగే అన్ని గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుంది అని అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల యమ్ ఆర్ పి యస్ నాయకులు పాల్గొన్నారు

## రోడ్డుప్రమాదంలో డీఐపిఆర్ సిబ్బంది బి.నాగరాజు మృతి కలెక్టర్ సంతాపం.




నంద్యాల, : మిడుతూరు మండలం రోళ్లపాడు మలుపు వద్ద గురువారం ఉదయం 5-30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయపు ఆఫీస్ సబార్డినేట్ బి. నాగరాజు హఠాన్మరణం చెందారు. ఈ ప్రమాదంపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేసారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం అందించాలని డిపిఆర్ఓ, నందికొట్కూరు తాసిల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. డిఐపిఆర్ఓ కార్యాలయపు సిబ్బంది కూడా నాగరాజు మృతి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ తమ సంతాపాన్ని తెలిపారు

# జాబ్ మేళా తేదీ లో మార్పు.

ధర్మవరం జాబ్ మేళా తేదీ మారింది

జూలైలో జరగనున్న మెగా జాబ్ మేళా.

జూన్ 24న జరగాల్సిన జాబ్ మేళా వాయిదా హరీష్ బాబు వెల్లడి.

మంత్రి క్యాబినెట్ సమావేశం కారణంగా జాబ్ మేళా వాయిదా.

మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హిందూ టైగర్ హరీష్ బాబు.



ధర్మవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో, సంస్కృతి సేవా సమితి సౌజన్యంతో ధర్మవరం పట్టణంలో భారీ స్థాయిలో నిర్వహించవలసిన మెగా జాబ్ మేళా తేదీ వాయిదా వేయబడినట్లు మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హిందూ టైగర్ హరీష్ బాబు తెలిపారు. అంతకుముందుగా జూన్ 24, 2025న జరగనున్నట్లు ప్రకటించిన ఈ జాబ్ మేళా, అదే తేదీన మంత్రి కి రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఉండడం వల్ల వాయిదా వేయడం జరిగిందని హిందూ టైగర్ హరీష్ బాబు తెలిపారు. ప్రజలు, నిరుద్యోగ యువత ఎలాంటి గందరగోళానికి లోనవ్వకండి అంటూ ఆయన కోరారు. జాబ్ మేళా జూలై మొదటి వారంలో లేదా రెండవ వారంలో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఖచ్చితమైన తేదీ, సమయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్టు హిందూ టైగర్ హరీష్ బాబు వెల్లడించారు. మంత్రి ఆదేశాల మేరకు ఈ జాబ్ మేళా మరింత సమర్థవంతంగా, పర్యవేక్షణతో నిర్వహించబడనున్నదని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని ఎక్కువమంది యువతఉపయోగించుకోవాలంటూ,ముందస్తు సన్నాహాలు కొనసాగించవలసిందిగా హిందూ టైగర్ హరీష్ బాబు యువతకు సూచించారు.

# సఖి కేంద్రం (వన్ స్టాప్ సెంటర్ లో చట్ట ప్రకారంగా విధులు నిర్వహించాలి.

సఖీ కేంద్రం లో ప్రతి నెల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.



అనంతపురం,: జిల్లాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అములు చేస్తుందని వీటి పై మహిళలకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు.గురువారం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రి ఆవరణలో జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖీ కేంద్రం (వన్ స్టాప్ సెంటర్) ను జిల్లా మహిళ శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమణి,ఆర్ యం ఓ.డాక్టర్ హేమలత,అర్బన్ తహశీల్దార్ హరి ల తో కలసి సఖీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అములు చేస్తుందని వీటి పై మహిళలకు పూర్తి అవగాహన కల్పించాలని పి డి ని ఆదేశించారు.వన్ స్టాప్ సెంటర్ (సఖీ కేంద్రం) లో ప్రతి నెల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,చట్ట ప్రకారంగా సఖీ కేంద్రం లో ఉన్న సిబ్బంది పనిచేయలని ఆదేశించారు. సఖీ కేంద్రంలో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, సఖీ కేంద్రానికి ఎలాంటి సమస్యల తో వచ్చే మహిళల కు సఖీ కేంద్రం ద్వారా ఎలాంటి సేవలు అందింస్తున్నారని, సమస్యలతో సఖీ కేంద్రానికి వచ్చిన వారి పూర్తి వివరాలు మరియు మీరు వారికి ఎలాంటి సలహాలు అందజేస్తున్నారు,సఖీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సేవలకు సంబంధించి నమోదు చేసిన రిజిస్ట్రార్లు ను పరిశీలించారు.చెక్ లిస్ట్,ఫైల్స్ మెయింటైన్స్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.24 / 7 గంటలు సఖీ కేంద్రం లో సేవలు అందుబాటులో ఉంటాయని,సఖీ కేంద్రానికి సమస్యలతో వచ్చే మహిళలకు కౌన్సిలింగ్,వైద్యసేవలు, న్యాయ సలహాలు,పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి,ఆపద నుండి ఆదుకోవడం,రక్షణ కల్పించడం వంటి అంశాలపై సమస్యలతో వచ్చిన మహిళలకు సేవలు అందించడం జరుగుతుందని,2006 నుండి జిల్లా లో గృహ హింస చట్టం క్రింద 1914 కేసులు నమోదు చేయడం జరిగిందని, అందులో 1290 కేసులు పరిష్కరం చేయడం జరిగిందని, 592 కేసులు కోర్టు విచారణలో ఉన్నాయని,32 కేసులు రక్షణ అధికారి విచారణలో ఉన్నాయని సఖి కేంద్ర మేనేజర్ శాంతామణి కలెక్టర్ గారికి వివరించారు.ఈ సమావేశంలో డిప్యూటీ ఆర్ యం ఓ పద్మజ, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావు, డి సి పి ఓ మంజునాథ్, ఎస్పై భారతి, సోషల్ కౌన్సిలర్ ఉమాదేవి, లీగల్ కౌన్సిలర్ ఏ. నర్మద,డేటా ఎంట్రీ ఆపరేటర్ గీతమ్మ, హెూంగార్డులు పి ఆర్ భారతి, షకీర్ భాషాపాల్గొన్నారు.

# యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనండి.

(21వ తేదీ టేక్కె మార్కెట్ యార్డులో ఘనంగా యోగాంధ్ర కార్యక్రమాలు)

(జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా)



నంద్యాల, : ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలోని టేక్కె మార్కెట్ యార్డులో పండుగ వాతావరణంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం 6-45 గంటల నుంచి 8 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు చురుగ్గా పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు. యోగాంధ్ర యాప్ లో నమోదైన దాదాపు 8 లక్షల మంది పౌరులు కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాలు, మున్సిపల్ పట్టణాలు, జిల్లా స్థాయిల్లో యోగాంధ్ర వెన్యూలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పాఠశాలలు, ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ, ఇంజనీరింగ్ కళాశాలలు, మెడికల్ కళాశాలలోని విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేలా సంబంధిత విద్యాసంస్థల ప్రతినిధులకు ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నెల రోజుల పాటు జిల్లావ్యాప్తంగా యోగంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ నెల 21వ తేదీన నంద్యాల పట్టణంలోని టేక్కె మార్కెట్ యార్డులో దాదాపు 5,000 మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని జిల్లాను ముందంజలో ఉంచేలా చూడాలన్నారు. అత్యధిక శాతం ప్రజలు భాగస్వామ్యం కావడం ద్వారా మన రాష్ట్రానికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం దక్కే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతోందని, ఈ కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తదితరులు పాల్గొంటారన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ సాధన చేసి ఒత్తిడిని తగ్గించుకుంటూ, మానసిక ప్రశాంతతను పొందాలన్నారు. జీవితంలో యోగాని భాగం చేసుకోవాలని, నిత్యం యోగాను ఆచరించి ఆరోగ్యాన్ని బాగుపరచుకోవాలన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు అందరూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డిపిఆర్ఓ, నంద్యాల వారి ద్వారా జారీ

# అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో జిల్లా ప్రజలు చురుగ్గా పాల్గొనాలి

అనంతపురం నగరంలోని పిటిసి గ్రౌండ్ లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమం

ప్రెస్ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,




అనంతపురర్, : జూన్ 21వతేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో జిల్లా ప్రజలు చురుగ్గా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ఈనెల 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా యోగాంధ్ర కార్యక్రమం, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్వహించే యోగాంధ్ర జిల్లా స్థాయి కార్యక్రమం అనంతపురం నగరంలోని పిటిసి గ్రౌండ్ లో నిర్వహించడం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు ఒక గంట సేపు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో దాదాపు 5 వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతోందని, ఈ కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తదితరులు పాల్గొంటారన్నారు. జిల్లాలో 23 లక్షల మంది జనాభా ఉండగా, యోగాంధ్రలో భాగంగా ఇంటింటికి సర్వే చేసి 9,97,518 మంది పౌరులను రిజిస్టర్ చేయడం జరిగిందన్నారు. జిల్లా మొత్తం 100 మంది మాస్టర్ ట్రైనర్లు, 6504 మంది ట్రైనర్లు రిజిస్టర్ చేసుకుని ఉన్నారని, శిక్షణ పూర్తి చేసుకున్న పౌరులకు రాష్ట్ర ముఖ్యమంత్రి సంతకంతో ఎక్సలెన్సీ లేదా పార్టిసిపేషన్ సర్టిఫికెట్ జారీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి, మండల స్థాయి, జిల్లాస్థాయిలలో యోగాంధ్ర సందర్భంగా 14 ఈవెంట్లలో పోటీలు నిర్వహించగా, అందులో గెలుపొందిన అనంతపురం జిల్లా నుంచి 27 మందిని విజయవాడకు పంపడం జరిగిందన్నారు. రాష్ట్ర స్థాయిలో అనంతపురం జిల్లాకు చెందిన పౌరులు 8 విభాగాలలో విజయం సాధించి బహుమతులు గెలుపొందారన్నారు. వీరందరు ఈనెల 21 తేదీ విశాఖపట్నంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొనే యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందన్నారు. అనంతపురం జిల్లాలో ఈనెల 21వ తేదీన శనివారం ఉదయం 7 గంటలకు జిల్లా వ్యాప్తంగా రిజిస్టర్ చేయబడిన 5,967 వెన్యూ కేంద్రాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 9,97,518 మంది పౌరులు సచివాలయ స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని, ప్రజలందరూ పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు సచివాలయ స్థాయిలో యోగా కార్యక్రమంలో పాల్గొంటారని, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దారులు కూడా మూడు రోజులపాటు వేరువేరుగా సచివాలయ స్థాయిలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లాలో రిజిస్టర్ అయిన వారు కూడా ఏదో ఒక రోజు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని, ఇప్పటివరకు 8,03,465 మంది ఏదో ఒక రోజు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని యోగా చేశారని, మిగిలిన వారు కూడా యోగాంధ్రలో పాల్గొనాలని అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో జరిగే యోగాంధ్ర కార్యక్రమాలను విశాఖపట్నంలో ప్రధానమంత్రి హాజరయ్యే కార్యక్రమానికి అనుసంధానం చేయబడుతుందన్నారు. జిల్లాలోని పాఠశాలలు, ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ, ఇంజనీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలలో వెన్యూలను ఏర్పాటు చేశామన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో 10 లక్షల మంది దాకా జిల్లా ప్రజలు పాల్గొని ప్రపంచ రికార్డు చేయగలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. యోగాను ప్రతి ఒక్కరూ సాధన చేయాలన్నారు. దయచేసి ప్రతి ఒక్కరూ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని, జీవితంలో యోగాని భాగం చేసుకోవాలని, నిత్యం అప్లోడ్ చేసి ఆరోగ్యం బాగుపరచుకోవాలన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు అందరూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆయుష్ అధికారి డా.రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగుల అభ్యర్ధనను దృష్టిలో ఉంచుకోండి.

సచివాలయ బదిలీ జీవో పై పునః సమీక్ష చేసేలా మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.

హరీష్ బాబుకు సచివాలయ ఉద్యోగుల సంఘం వినతిపత్రం.

ధర్మవరం లో హరీష్ బాబుకు వినతిపత్రం అందజేసిన గ్రామ/వార్డు సచివాలయ సంఘం.

బదిలీలపై న్యాయసమ్మతమైన పరిష్కారానికి కృషి చేస్తాం

మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హిందూ టైగర్ హరీష్ బాబు.



ధర్మవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. ధర్మవరం పట్టణంలో మంత్రి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో, ఏపీ విలేజ్ మరియు వార్డ్ సెక్రెటేరియట్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా మరియు ప్రధాన కార్యదర్శి పి. నరసింహారావు పాల్గొన్నారు. వారు హరీష్ బాబును కలిసి, ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో. ఎమ్మెస్. నెంబర్. 5, తేదీ: 12.06.2025 లోని నిబంధనలపై తమ ఆందోళనను వ్యక్తం చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు విధుల్లో 5 సంవత్సరాలు పూర్తి చేసిన తరువాత తప్పనిసరిగా ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలనే నిబంధన పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ఉద్యోగుల కుటుంబ జీవితంపై, పిల్లల చదువు, గృహ ఆర్థిక స్థితి మరియు సామాజిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అలాగే ఉద్యోగులు పుట్టి పెరిగిన స్వగ్రామ ప్రాంతాల్లోనే సేవలందించగలగడం వల్ల వారు సామాజికంగా, కుటుంబపరంగా సుస్థిరంగా ఉండగలుగుతారని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ...., ఉద్యోగుల అభ్యర్ధనను దృష్టిలో ఉంచుకొని, సంబంధిత జీవోపై మానవతా దృక్పథంతో పునఃసమీక్ష జరిపేలా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అలాగే సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సంక్షేమం మా ప్రభుత్వానికి ప్రాముఖ్యత కలిగిన అంశం. ఉద్యోగుల కోణంలో చూస్తే, బదిలీల విషయంలో ఒక సరళమైన, సున్నితమైన విధానం అవసరమని నేను భావిస్తున్నాను. మీరు వినిపించిన మాటలు మంత్రి దృష్టికి తీసుకెళ్లడం ద్వారా, ఈ జీవో పట్ల ఒక సానుకూల, న్యాయమైన పునఃసమీక్ష జరగడం కోసం మా తరపున ప్రయత్నిస్తాం అని హామీ ఇచ్చారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలి

ప్రతి వెన్యూలో ఖచ్చితంగా యోగా కార్యక్రమం జరగాలి

రాష్ట్రస్థాయిలో అనంతపురం జిల్లాను ముందంజలో నిలపాలి

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,



అనంతపురం, : ఈనెల 21వతేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం అన్ని రకాల ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. గురువారం సాయంత్రం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నద్ధత, తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, తహసీల్దార్ లు, సిఎస్ఓలు, మండల విద్యాశాఖ అధికారులు, పంచాయతీ సెక్రెటరీలు, ఎడ్యుకేషన్ సెక్రెటరీలు, ఇతర మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని పిటిసి గ్రౌండ్ లో యోగాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో దాదాపు 5 వేల మంది పాల్గొని యోగా చేయడం జరుగుతుందని, అందరికీ సర్టిఫికెట్స్ అందించాలని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఈ కార్యక్రమం కోసం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. గురువారం ఉదయం సచివాలయం స్థాయిలో ఉన్న వెన్యూలలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దారులు యోగా కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పామని, కొంతమంది ఇందులో పాల్గొనలేదని, శుక్రవారం ప్రతి ఒక్కరూ యోగా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ప్రతి వెన్యూలో ఖచ్చితంగా యోగా కార్యక్రమం జరగాలని, ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. సిటిజెన్స్ - ట్రైనర్స్ మ్యాపింగ్ పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని, శుక్రవారం యోగా చేయడం ద్వారా ఆరోగ్యం బాగుంటుందన్నారు.రాష్ట్రంలో అనంతపురం జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమం ఎక్కువగా జరగాలని, రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉండేలా సవాలుగా తీసుకొని కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. శుక్రవారం రిజిస్ట్రేషన్ చేసుకున్న అందరూ యోగా చేయాలని, వారికి పార్టిసిపేషన్ సర్టిఫికేట్ ఇవ్వాలన్నారు. శుక్రవారం సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు మీ సచివాలయ పరిధిలో ఉన్న అన్ని విద్యాసంస్థలైన పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు, ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటిఐ, ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యంతో సమావేశం పెట్టుకొని మీ సంస్థ యోగా చేయడానికి రిజిస్ట్రేషన్ అయి ఉంది, వెన్యూ ఇన్చార్జిలు ఉండాలని, అందరు పిల్లలు రిజిస్ట్రేషన్స్ చేసుకోవాలని, రేపు మధ్యాహ్నం 3:30 గంటల నుంచి 4:30 గంటల వరకు యోగా డెమానిస్ట్రేషన్స్ చేయాలని, ఎల్లుండి ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగా జరగాలని వారికి తెలియజేయాలని ఆదేశించారు. ప్రతి విద్యా సంస్థలలో యోగా ఖచ్చితంగా జరగాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమం పూర్తయ్యాక అన్ని వెన్యూ ప్రాంతాలను శుభ్రం చేయాలని, ఇందుకోసం శానిటేషన్ సెక్రటరీలను నియమించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డిఈఓ ప్రసాద్ బాబు, డిఆర్డీఏ పిడి శైలజ, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఆయుష్ అధికారులు డా.రామ్ కుమార్, లాల్యానాయక్, ఏపీఎంఎస్ఐడిసి ఈఈ, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ కోఆర్డినేటర్ ధనుంజయ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. మెగా మాస్ డెమోనిస్ట్రేషన్ అన్నిచోట్ల చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమం కోసం జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్లను వెంటనే యాక్టివేట్ చేయాలని ఆదేశించారు. యోగా కార్యక్రమం అనంతరం సచివాలయ స్థాయిలో డిజిటల్ అసిస్టెంట్లు డేటా ఎంట్రీ ఖచ్చితంగా చేయాలని, ఇప్పటికే పూర్తయిన కాంపిటీషన్స్ కి సంబంధించి సర్టిఫికెట్లను అందజేయాలన్నారు. వెన్యూలో ఒకరోజు యోగాలో పాల్గొన్న వారికి పార్టిసిపేట్ సర్టిఫికెట్ అందించాలని, మూడవరోజు పాల్గొంటే సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ జనరేట్ చేయాలని, పెండింగ్ లేకుండా సర్టిఫికెట్ అందించడం పూర్తి చేయాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా తీసుకొని ప్రధానమంత్రిని ఆహ్వానించి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారన్నారు.


# సైబర్ స్కామ్‌లలో... అందరం బాధితులమే..!

స్కామ్‌లలో డబ్బులు పోగొట్టుకున్న వారు ఎవరో అమాయకులని మనం అభిప్రాయపడతాం. కానీ డిజిటల్ అరెస్టులో గాని, బ్యాంకు స్కామ్‌లలో గానీ, ఫోన్ల ద్వారా ఓటీపీలు చెప్పే వారిని గానీ పరిశీలించి చూస్తే... వీరిలో సగం కంటే ఎక్కువమంది తెలివైన వారూ, బాగా సామాజిక జ్ఞానం ఉన్నవారూ కనిపిస్తారు.. వీరిలో లాయర్లు, సీఈవోలు కూడా ఉన్నారు.. ఏదో అమాయకంగా డబ్బులు పోగొట్టుకున్నారు అనే రకంగా వీరి ప్రొఫైల్ ఉండదు. కానీ మనం తెలివైన వాళ్లం అనుకుంటే స్కామర్స్ మనకంటే తెలివైన వాళ్లు అయి ఉంటారు.. ఒక వ్యక్తి మీద టార్గెట్ పెట్టి ఆ వ్యక్తి నుండి వేలు, లక్షలు, కోట్లు స్వాహా చేసే ప్రణాళిక ఉన్న స్కామర్లు చాలా పకడ్బందీగా ప్రణాళిక వేస్తారు. ఎవరి మీద టార్గెట్ పెడతారో వారి వివరాలన్నీ కూడా వారి దగ్గర ఉంచుకుంటారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్ వారి దగ్గర ఉంటాయి. పగడ్బందీగా ప్రణాళిక వేసుకొని వీరు ముందుకు నడుస్తారు. గత ఏడాది నరేంద్ర మోడీ దేశంలో డిజిటల్ అరెస్ట్ లాంటిది దేశంలో లేదని స్వయంగా మాన్ కి బాత్ ఉపన్యాసంలో స్పష్టంగా చెప్పారు. కానీ ఆ తర్వాత కూడా దేశంలో ఎన్నో డిజిటల్ అరెస్టులు జరిగాయి.. అలా డిజిటల్ అరెస్టులకు గురైన వారెవరూ కూడా అత్యంత అమాయకమైన నిరక్ష రాస్యులు కారు. చదువుకున్న వారూ, తెలివైన వారే.. మరి వీరంతా ఈ స్కామ్‌లలో ఎలా పడిపోతున్నారు అన్నది చాలా పెద్ద ప్రశ్న. మనం ఆలోచించేంత లోపలే వారు పని ముగించుకుని వెళ్లిపోతారు. తొందర పెడతారు. భయపెడతారు. మనుషుల ఎమోషన్స్‌ని నియంత్రిస్తూ వారితో ఆడుకుంటారు. ఇక ఓటీపీలు చెప్పకండి అని బ్యాంకులు కొన్ని వందల వేల ప్రకటనలు ఇస్తున్నాయి.. అయినా సరే స్కామర్లకు మనం ఓటీపీలు చెప్పేస్తూనే ఉన్నాం. దీనికి కూడా కారణాలు ఉన్నాయి. అవతలి స్కామర్లు బ్యాంకులు చెప్పినంత సునాయాసంగా ఓటీపీలు అడగరు.. ఆ ఓటీపీ కోసం వారు ఒక కథ అల్లుతారు. ఆ కథలో మనల్ని ముఖ్య నటుడు లేక నటిగా మార్చి వారికి కావాల్సిన ఓటీపీ తీసేసుకుంటారు. మనం తెలుసుకునే లోపే మన ఓటీపీ వారికి వెళ్లిపోయి ఉంటుంది. ఇందుకోసం వీరు ఒకసారి అకౌంట్ బ్లాక్ అయింది. మీ అకౌంట్‌లో మీరు ఏ వర్క్ చేయలేరు అని మనల్ని భయపెడతారు.. తొందర పెడతారు. ఇక మనమే వారికి ఏం చేయాలని రిక్వెస్ట్ చేస్తాం. అప్పుడు వాళ్లు ఆపద్బాంధవుల్లా ఆదుకున్నట్టు నటిస్తారు.. వెరిఫికేషన్ కోడ్ ఒకటి వచ్చింది. పంపించండి. మీ అకౌంట్ యాక్టివేట్ చేసేస్తున్నామంటారు. ఓటీపీనే వారు వెరిఫికేషన్ కోడ్ అన్న మరో పదంతో మన నుండి తీసుకుంటారు. బ్యాంకర్లు మనల్ని ఓటీపీలు ఇవ్వకండి అని లక్షల సార్లు చెబుతారు. నిజమే మనం ఓటిపి ఇవ్వకూడదని మన మెదడు ట్యూన్ అయి ఉంటుంది. కానీ వెరిఫికేషన్ కోడ్ ఇవ్వకూడదు అని ఎవరూ చెప్పలేదు.. కాబట్టి వెరిఫికేషన్ కోడ్ పేరు మీద ఓటీపీని మనం అందించేస్తాం. ఇక ఈ కథ కూడా పాతయిపోయిన తర్వాత ఇటీవల ఐవీఆర్ఎస్ పద్ధతిలో ఓటీపీలు అడుగుతున్నారు. అంటే మనం ఓటీపీ చెప్పాల్సిన అవసరం లేదు. అవతలి ఒక స్కామర్ మనకు బాగా తెలిసిన మిత్రుని కాల్ మనకు వచ్చినట్టు భ్రమింపజేసి ఆ కాల్ మెర్జ్ చేయమని అంటారు. మన మిత్రుని కాలే కదా అని మనం యాడ్ చేస్తాం కానీ మనకు తెలియకుండా ఆ చర్య ద్వారా ఐవీఆర్ఎస్‌లో వచ్చిన ఓటీపీ వారికి కన్ఫర్మ్ అవుతుంది. దాంతో మన అకౌంట్‌లో ఐదారు లక్షలు స్వాహా.. ఆలోచించినంతలోనే ఇది జరిగిపోతుంది. మీరే పొరపాటు చేశారు. కాబట్టి మీ డబ్బులు మేము తిరిగి ఇవ్వలేమని బ్యాంకులు, చేతులెత్తేస్తున్నాయి. కానీ, మనం చెప్పని మన పాస్వర్డ్, మనం చెప్పని మన ఆధార్ కార్డు నంబర్లు అవతలి వ్యక్తులకు ఎలా అందాయి?

## పోయిన డబ్బు తిరిగి రావాలంటే..

ఈ ఒక్క ఆర్గుమెంటుతో బ్యాంకు తర్కాన్ని మనం బలహీనం చేయొచ్చు. అంటే, డబ్బులు పోవడానికి తప్పు మనం మాత్రమే చేయలేదు. మొత్తం వ్యవస్థ కలగాపులగమై ఉంది. మనం చేసింది నేరం కాదు.. పొరపాటు మాత్రమే. కానీ ఇతర సంస్థలు మన వివరాలను లీక్ చేసి నేరం చేశారు.. అది పొరపాటు కాదు. కాబట్టి, మనం కోల్పోయిన డబ్బులు మనకు ఇవ్వాల్సిన బాధ్యత కూడా బ్యాంకులదే అనే తర్కం కూడా ఇక్కడ ఉంది. డబ్బులు పోయిన నాలుగు గంటల తర్వాత ఆ మొత్తం డబ్బు దేశం బయటకు వెళ్లిపోతుంది.

# ఇంతకూ ధర్మాసనం ఎందుకు




గవర్నర్లు బిల్లుల ఆమోదంపై కాలపరిమితిని పాటించకపోవడం రాజ్యాంగ సమస్యగా మారింది. రాష్ట్రపతి 14 కీలక ప్రశ్నలతో సుప్రీంకోర్టును సందర్శించడంతో, పాలనా జాప్యాలపై చర్చ మరింత తీవ్రతరమైంది. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, కేంద్ర రాష్ట్ర కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ళు, పరిపాలన సంబంధిత నిబంధనల నిర్వహణ... ఇవన్నీ ప్రజలకు తక్షణం పరిష్కారం కావాల్సిన అవసరాలు. ఇటీవల బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి, గవర్నర్లకు కాలపరిమితిని సూచిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఇది కొత్త ఆలోచన కాదు. హోంమంత్రిత్వ శాఖ మార్గదర్శకాల్లోనే ఉంది. హోంమంత్రిత్వ శాఖే సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ విచారణలో బిల్లుల ఆమోదంపై గడువును నిర్ణయించాలని అన్నది. ?ఇప్పుడు మళ్లీ సుప్రీం తీర్పుపై వివరణ కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించారు. గడువు అవసరాన్ని ప్రభుత్వమే ఒప్పుకున్న తర్వాత మరలా ఆ గడువుకు సంబంధించిన తీర్పు మీదనే సుప్రీంకోర్టుకే 14 రెఫెరెన్స్‌లు ఎందుకు? అందుకోసం సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇటూ అటూ లాయర్లు సుదీర్ఘ కాలం నడిపిస్తారు. చివరకు సుప్రీంకోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా, "మాకిష్టం లేదు. మేం ఒప్పుకోం," అనే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉందని రాజ్యాంగంలోనే మనం రాసుకున్నాం. అలాంటప్పుడు ఇదంతా వృథా కాదా? 2024 ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో: "మేము కేవలం హోం మంత్రిత్వ శాఖ 2016లో జారీ చేసిన మెమొరండమ్ రూపంలోని మార్గదర్శకాలను అనుసరిస్తున్నాం, అవి మూడు నెలల గడువును సూచించాయి" అని పేర్కొంది. అంటే ఈ కాల పరిమితిని మొదట కేంద్ర ప్రభుత్వమే సూచించింది. అటువంటప్పుడు మళ్ళీ సుప్రీంకోర్టు విచారణ అవసరం ఎందుకు? భారత రాష్ట్రపతి దేశ పాలనలో రాజ్యాంగ అత్యున్నత పదవిలో ఉన్నారు. రాష్ట్రపతి ఎన్నిక కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఓటింగ్ చేస్తారు. దేశవ్యాప్తంగా అత్యంత విశాలమైన ప్రజాతంత్ర ప్రాతినిధ్యం కలిగి ఉంటుంది. అందుకే ఆ పదవికి గౌరవం. గవర్నర్లను రాష్ట్రపతి ద్వారా ప్రధానమంత్రి, మంత్రివర్గ సిఫార్సు మేరకు నియమిస్తారు. ఇది ఎన్నిక కాదు. వారు చేసే ఎంపిక. ఆయా రాష్ట్రాల్లో గవర్నర్లకు అత్యున్నత పరిపాలనాధికారాలు ఉంటాయి. వాటిని దుర్వినియోగం చేయకూడదు. బాధ్యతాయుతంగా పనిచేయాలి. కానీ ఇది జరగటం లేదు. ఇది కేవలం తమిళనాడు సమస్యేకాదు, ఎన్డీయేతర రాష్ట్రాలన్నిటిలోనూ ఈ సమస్య ఉంది. ఆర్టికల్ 200, 201లో కాల పరిమితులు లేకపోవటం తప్పుగా పరిగణించాల్సిన అవసరం లేదు. కానీ పరిపాలనలో సమయానుకూల నిర్ణయాలు కీలకం. గవర్నర్లు ఈ బాధ్యతను విస్మరించరాదు. తాము సంప్రదాయ పరిపాలనా అధికారం కలిగినప్పటికీ, నిర్ణయాలు ఆలస్యం చేయకూడదు. సుప్రీంకోర్టు తీర్పు అందరు గవర్నర్లకు వర్తిస్తుంది. గవర్నర్ ముఖ్యమంత్రుల మధ్య ప్రతి రాష్ట్రంలోనూ గొడవ ఉండదు. కేంద్రంలో రాష్ట్రాల్లో వేరే పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఈ ఆలస్యాలు కావాలని చేస్తున్నట్టు కనపడుతూనే ఉంది. ఈ కారణంగా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసుకోలేక పరిపాలన స్తంభించిపోతున్నది. తమిళనాడు వెర్సస్ గవర్నర్ ఆఫ్ తమిళనాడు (2025) కేసులో గవర్నర్ 'పాకెట్ వీటో' వాడుతున్నారని తీవ్ర విమర్శలు వచ్చాయి. 'పాకెట్ వీటో' అంటే బిల్లులను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచటం. రాష్ట్రపతి వేసిన ఐదు కీలక ప్రశ్నలు ఇవే: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ అధికారాలు న్యాయపరంగా పరిశీలించదగినవేనా? 2) ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్/ రాష్ట్రపతి పూర్తిగా న్యాయ సమీక్షకు అతీతమా? 3) రాజ్యాంగ కాలపరిమితి లేకపోతే గవర్నర్ బిల్లుపై నిర్ణయం తీసుకోవడం ఏ విధంగా జరగాలి? 4) ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి చేసే నిర్ణయాలు న్యాయపరంగా సమీక్షించదగినవేనా? 5) ఆర్టికల్ 201 ప్రకారం బిల్లులపై రాష్ట్రపతికి గడువు విధించవచ్చా? ఉందనుకుంటే సుప్రీంకోర్టు గడువులు ఇవ్వవచ్చా? రకరకాల అనుమానాలు: 1) ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కి నిర్ణయాల విచక్షణాధికారాలు ఉన్నాయా? గవర్నర్ రాష్ట్ర కేబినెట్ సలహా మేరకే పనిచేయాలా? అప్పుడు రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా తీసుకోవచ్చా? 2) ఆర్టికల్ 142 ప్రకారం కోర్టులు గవర్నర్/ రాష్ట్రపతిని తొలగించే ఆదేశాలు ఇవ్వగలవా? 3) గవర్నర్ అంగీకారం లేకుండా రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టం చట్టబద్ధమా? 4) ఈ అంశంపైన ఆర్టికల్ 145(3) ప్రకారం కనీసం ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాల్సిన అవసరముందా? 5) ఆర్టికల్ 131 ప్రకారం ఒరిజినల్ సూట్ లేకుండా కేంద్రం రాష్ట్రాల మధ్య విభేదాలను సుప్రీంకోర్టు పరిష్కరించగలదా? న్యాయమూర్తి పార్థీవాలా అభిప్రాయం ప్రకారం గవర్నర్‌కు ఒక బిల్లు వచ్చాక... మూడు మార్గాలు మాత్రమే ఉంటాయి. ఒకసారి బిల్లు తిరిగి శాసనసభకి పంపి, అదే రూపంలో తిరిగి వస్తే రాష్ట్రపతికి పంపించే హక్కు గవర్నర్‌కు ఉండదు. ఆయన సూచనల మేరకే మార్పులు జరిగితే తప్ప. గవర్నర్ లేదా రాష్ట్రపతి బిల్లులపై జాప్యం చేస్తే ఆ ప్రభుత్వాలు కోర్టులో మాండమస్ రిట్ వేయవచ్చు. బిల్లుల ఆమోదంపై సుప్రీంకోర్టు తీర్పు దిశను సూచించినప్పటికీ, తుది స్పష్టత కోసం రాజ్యాంగ ధర్మాసనం అవసరమే. కానీ ఆర్టికల్ 143 ప్రకారం, సుప్రీంకోర్టు ఇచ్చే సలహాను ప్రభుత్వం పాటించాల్సిన అవసరం లేదు. ఈలోగా మంత్రిత్వ శాఖల ఆమోదానికి పంపిన బోలెడు బిల్లులు ఎక్కడివక్కడే ఆగిపోతాయి. ఇది ప్రజల పాలనపై హక్కును దారుణంగా ఉల్లంఘించటమే.

# సత్యాసత్యాలుజి



పాకిస్తాన్‌పై భారత్ చేసిన దాడిలో భారత వైమానికదళానికి కూడా నష్టం జరిగిందని చౌహాన్ ఒప్పుకున్నారు. విమానాలు కోల్పోయిన విషయంపై స్పష్టత ఇవ్వకపోయినా, వ్యూహాలను మెరుగుపరచామంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌పై ఇటీవల జరిపిన దాడిలో భారత వైమానికదళానికి కూడా నష్టం వాటిల్లిందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ అంగీకరించారు. భారత్‌కు చెందిన ఆరువిమానాలను కూల్చేశానని పాకిస్థాన్ చెప్పడం శుద్ధ అబద్ధమని అంటూనే, ఎన్ని విమానాలను భారత్ కోల్పోయిందో ఇదమిత్థంగా చెప్పకుండా త్రిదళాధిపతి ఈ యుద్ధానికి సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. విమానాలు కోల్పోవడం కంటే, ఎందుకు, ఎలా జరిగిందన్న కారణాలు తెలుసుకోవడం ముఖ్యం కనుక, వ్యూహాత్మక తప్పిదాలను సరిదిద్దుకొని, వ్యూహాలను మెరుగుపరుచుకొని అమలు చేశామని అన్నారాయన. ఆదిలో వేసిన ఈ తప్పుటడుగులవల్ల ఒనగూరిన నష్టమెంతో చెప్పలేదు కానీ, సరిదిద్దుకున్న అనంతరం పాకిస్థాన్‌ను అద్భుతంగా దెబ్బతీయగలిగామన్నారు. ఎంతో కచ్చితత్వంతో పాక్ స్థావరాలపై దాడులు చేయడంతో వాటిని ఆపాల్సిందిగా ఆ దేశం ప్రాధేయపడిందని ఆయన వివరించారు. చైనా చేయూతతో భారత్‌ను పాకిస్థాన్ గట్టిదెబ్బ కొట్టిందన్న ప్రచారం ఉధృతంగా జరిగిన నేపథ్యంలో, అసలు చైనా సమకూర్చిన రక్షణవ్యవస్థలు సరిగా పనిచేయనేలేదని కూడా ఆయన గాలి తీసేశారు. విపక్షాలకు చౌహాన్‌వ్యాఖ్యలు మంచి మందుగుండు సమకూర్చాయి. మోదీ సర్కారు దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నదనీ, గుట్టు విప్పడం లేదు, నిజం చెప్పడం లేదు అంటూ ఆదినుంచీ ఆగ్రహిస్తున్న విపక్షాలు ఇప్పుడు మళ్ళీ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను డిమాండ్ చేస్తున్నాయి. ఎన్ని విమానాలు?, ఏమిటవి అన్న ప్రశ్నలతో పాటు చాలా అనుమానాలు నివృత్తిచేసుకోవాలని, అమెరికా అధ్యక్షుడు ఒకటికి పదిసార్లు వాణిజ్యం బూచి చూపి తానే యుద్ధం ఆపానంటూ బల్లగుద్దుతున్న సంగతీ మాట్లాడుకోవాలని అవి అంటున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో ఉన్నదేమిటో జనానికి తెలియనక్కరలేదా? అన్నది మంచిప్రశ్న. ఇప్పటివరకూ పొరుగుదేశం చెబుతున్న గొప్పలను, లెక్కలను సహజంగానే నమ్మకపోవడంతో పాటు, అంతర్జాతీయ మీడియానూ, రక్షణరంగ విశ్లేషణలను సైతం భారతీయులు అనుమానించారు. పాక్‌మీద ప్రేమతో పాశ్చాత్యదేశాలన్నీ అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని భావించారు. కానీ, యుద్ధం ముగిసిన మూడువారాల తరువాత చౌహాన్ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యంతో పాటు కీలకమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. యుద్ధం అన్నాక నష్టాలు సహజం అని అప్పట్లో ఎయిర్‌మార్షల్ భారతి, ఇప్పుడు చౌహాన్ ప్రత్యేకంగా ఉద్ఘాటించాల్సిన అవసరం ఏమీ లేదు. పోరాటంలో నెగ్గడంతో పాటు, పోగొట్టుకోవడం కూడా ఉంటుందని సామాన్యుడికి సైతం తెలుసు. అయితే, ఐదువిమానాలను కూల్చినట్టుగా పాక్ తొలిరోజునే చేసిన ప్రకటనను వమ్ముచేయడానికి కాబోలు, వాయుసేన పైలట్లందరూ సురక్షితంగా తిరిగివచ్చారని చెప్పి వైమానిక నష్టాలేమీ జరగలేదన్నట్టుగా ఎయిర్‌మార్షల్ దేశప్రజలకో అభిప్రాయాన్ని కలిగించారు. సరికొత్త ఒప్పందంతో, ఫ్రాన్స్‌నుంచి మరింత ఖరీదుకు కొనుక్కున్న రాఫెల్‌కు అప్రదిష్ట రాకూడదన్న జాగ్రత్త అందులో ఉండివుండవచ్చు. ఇప్పుడు సీడిఎస్ చౌహాన్ పాకిస్థాన్ అంటున్న స్థాయిలో కాకున్నా నష్టం అధికంగానే సంభవించిందని తేల్చేశారు. యుద్ధకాలంలో పాక్ పని అయిపోయిందంటూ ఎన్నిరకాల ప్రచారాలు జరిగాయో, అందులో బీజేపీ నాయకులు ఎంత ముందున్నారో అందరికీ తెలుసు. ఆ ఉద్వేగాల మధ్య, మరోపక్క పాకిస్థాన్ దీనికి ప్రతిగా, ప్రతీకారంగా మరింత విషప్రచారం సాగించిన నేపథ్యంలో, వాస్తవిక స్థితిని చెప్పడానికి సైన్యం కత్తిమీద సాముచేయాల్సివచ్చింది. అయితే, సత్యాన్ని దాచడంవల్లనో, అర్థసత్యాలు చెప్పడం వల్లనో అసత్యప్రచారాలను వమ్ముచేయడం సాధ్యంకాదు. దేశం కోసం ప్రాణాలకు తెగించిపోరాడే సైన్యానికి రాజకీయాలతో నిమిత్తం లేదు కనుక, ఉన్నదివున్నట్టు చెప్పడానికి ఏ దశలోనూ సందేహించనక్కరలేదు. ఈ యుద్ధంలో పాకిస్థాన్‌కు తీరని నష్టం చేశామని, ఉగ్రస్థావరాలను కుప్పకూల్చి ఒక కొత్త లక్ష్మణరేఖ గీశామన్నది వాస్తవం. జాగ్రత్తగానైనా కొన్ని నిజాలు విప్పినందుకు చౌహాన్‌ను అభినందించాల్సిందే. అయితే, మూడువారాల తరువాత కూడా అది 145కోట్లమంది దేశప్రజల సమక్షంలో గాక, కఠినమైన ప్రశ్నలు, విశ్లేషణలు ఎదుర్కొనే సందర్భంలో, ఒక విదేశీ వేదికమీద జరగడం కాస్తంత అసంతృప్తిని కలిగిస్తున్న మాట నిజం.

# సూర్యాపేట ఘటనలు ప్రభుత్వానికో హెచ్చరిక



సూర్యాపేటలో లింగ నిర్ధారణ పరీక్షలతో జరిగిన అమానవీయ ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. అనుమతులేని ఆసుపత్రులు, అవినీతిలో కూరుకుపోయిన అధికారుల వల్ల ఇద్దరి ప్రాణాలు నష్టపోయాయి. ఇటీవల సూర్యాపేటలో వెలుగుచూసిన వరుస ఘటనలతో రాష్ట్రం నివ్వెరపోయింది. ప్రభుత్వం నిషేధించినప్పటికీ ఓ స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిగాయి. మూడోసారీ ఆడపిల్లే పుట్టబోతోందని తెలిసి, నెలల గర్భవతిగా ఉన్న ఓ మహిళ అబార్షన్‌కు సిద్ధపడింది. కాసులకు కక్కుర్తిపడిన ఓ ఆర్ఎంపీ ఆమెను పట్టణంలో అనుమతుల్లేని ఓ ఆస్పత్రిలో చేర్పించాడు. సదరు ఆస్పత్రి నిర్వాకం వల్ల ఆ గర్భవతి మృతి చెందింది. ఇక్కడి వరకూ ఓ కథ. అంతకు కొద్దిరోజుల ముందు అదే సూర్యాపేటలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఓ స్కానింగ్ సెంటర్ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత ఆ కేసు నుంచి తప్పించేందుకు నిందితుడిని స్థానిక డీఎస్పీ, సీఐ రూ.25 లక్షలు డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డారు! నిబంధనలను పాతరేసిన స్కానింగ్ సెంటర్, అనుమతులు లేని ఆసుపత్రి, సమాజాన్ని రక్షించాల్సిన పోలీసు అధికారులు అవినీతికి పాల్పడడం, ప్రాణాలను కాపాడాల్సిన వైద్యులు ప్రజల ప్రాణాలను హరించడం లాంటి అమానుష ఘటనలు సభ్య సమాజంలో అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న స్కానింగ్ సెంటర్లకు, ఆసుపత్రులకు అనుమతులు ఉన్నాయా? ఉంటే అవి నిబంధనలకు లోబడే పని చేస్తున్నాయా? ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులకు సరైన అర్హతలు ఉన్నాయా? అనుమతులు లేని ఆసుపత్రులపై చర్యలు తీసుకోడానికి వైద్య ఆరోగ్యశాఖ ఎందుకు వెనుకాడుతోంది? అనుమతి లేని స్కానింగ్ సెంటర్ వ్యవహారంలో ఏసీబీకి పట్టుబడిన డీఎస్పీ, సీఐ వ్యవహారం బయటకు వచ్చిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖ స్పందించి ఉండాల్సింది. అనుమతులు లేని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈ అమానవీయ ఘటన జరిగేది కాదు. కేవలం వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగానే రెండు ప్రాణాలు బలయ్యాయి. తల్లిని కోల్పోయిన ఇద్దరు అమ్మాయిల భవిష్యత్తుకు భరోసా ఎవరు? రాష్ట్రంలోని పలు నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న కొన్ని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులు గర్భస్థ లింగ నిర్ధారణ, పిండ విచ్ఛిన్న కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఇవి గ్రామస్థాయి వరకు దళారులను నియమించుకొని లింగ నిర్ధారణ పరీక్షలతో వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ తల్లీ బిడ్డల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. మామూళ్లకు అలవాటుపడిన వైద్యాధికారులు సదరు ఆసుపత్రుల జోలికి వెళ్ళడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూర్యాపేట ఘటనలను ఓ హెచ్చరికగా తీసుకుని స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రులపై వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ నిరంతరం నిఘా పెట్టాలి. భ్రూణ హత్యల నిరోధక చట్టాన్ని అతిక్రమించిన వైద్యులను కఠినంగా శిక్షించాలి.

# ఆదిమ జాతుల అస్తిత్వ పెనుకేక




కెన్యాలో బ్రిటిష్ వలస పాలనకు, వలస పాలన అనంతరం పాలించిన స్వదేశీ పాలకుల దాష్టీకానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, చింతనాపరుడు, సామాజిక శాస్త్రవేత్త, విప్లవ రచయిత గూగీ వా థియాంగో మే 28న అమెరికా లోని జార్జియాలో కన్ను మూసాడు. ఐరోపా కేంద్రీకృత చర్చల ఆధిపత్య... కెన్యాలో బ్రిటిష్ వలస పాలనకు, వలస పాలన అనంతరం పాలించిన స్వదేశీ పాలకుల దాష్టీకానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు, చింతనాపరుడు, సామాజిక శాస్త్రవేత్త, విప్లవ రచయిత గూగీ వా థియాంగో మే 28న అమెరికా లోని జార్జియాలో కన్ను మూసాడు. ఐరోపా కేంద్రీకృత చర్చల ఆధిపత్య ధోరణులను తమ రచనలతో, మేధా సంపత్తితో తుత్తునియలు చేసిన వారిలో ఎడ్వర్డ్ సయిద్, గూగీ వా థియాంగో ముందు వరసలో ఉంటారు. సయిద్ 1935లో పాలస్తీనాలో, గూగీ 1938లో కెన్యాలో పుట్టారు. విషాదం ఏమిటంటే, ఇద్దరూ పుట్టిన నేల మీద రక్షణ లేక, దశాబ్దాలపాటు ప్రవాసులు గానే బతికారు. 'ఓరియంటలిజం' రచనతో ఎడ్వర్డ్ సయిద్‌బీ 'డీకాలనైజింగ్ ద మైండ్', 'మూవింగ్ ద సెంటర్' రచనలతో గూగీ తమవైన మేధా తాత్త్విక మార్గాల్ని రహదారులుగా వేసారు. ఈ ఇద్దరి ప్రస్తావనా లేకుండా ఆధునిక సామాజిక శాస్త్రాలు అసంపూర్ణం. మూల వాసుల మౌఖిక గాథలను పారవశ్యంతో ప్రపంచ యవనిక మీద నిలబెట్టిన సాహసి గూగీ. తండ్రి థియాంగో 'గికుయు' తెగకు చెందిన ఒక విస్తాపితుడు, ఇద్దరు అన్నలు 1950ల్లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన మౌ మౌ సాయుధ పోరాటంలో అమరులు. గూగీ బాల్యం ఈ సాయుధ పోరాటం నేపథ్యంగా గడిస్తే, యవ్వనం స్వీయపాలన వచ్చాక కొనసాగిన నియంతల పాలన నేపథ్యంగా గడిచింది. ఆంగ్ల సాహిత్యం చదువుకుని నైరోబి విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా వృత్తి జీవితం మొదలుపెట్టాడు. అధ్యాపకుడిగా ఉన్న కాలంలోనే ఆయనపై రాజ్యం కన్నెర్ర చేసింది. దీనికి కారణం వలస పాలన అనంతరం కెన్యా పాలకుల దాష్టీకాలపై ఆయన చేసిన రచనలు. మొదట 'జేమ్స్ గూగీ' పేరుతో ఇంగ్లీషులో రచనలు చేసిన గూగీ తదనంతరం కాలంలో వలసవాద చిహ్నమైన 'జేమ్స్'ను తన పేరు నుండి తొలగించుకున్నాడు. ఇంగ్లీషును వదిలి మాతృభాషలైన 'గికుయు', 'స్వాహిలి' భాషలలో రాయటం మొదలుపెట్టాడు. ఈ నిర్ణయం తోనే ఆయన సాహిత్య రాజకీయ కార్యాచరణ మొదలైంది. ఆ క్రమంలో స్థానిక భాషలకు మౌఖిక సాహిత్యం ఎంత ముఖ్యమో బలంగా వాదించాడు. ఒక దశలో ఇంగ్లీష్ డిపార్టుమెంటులను రద్దు చేయాలి అనేదాకా పోయాడు. పంతొమ్మిది వందల యాభైలలో సాయుధ రాజకీయాల తర్వాత, కెన్యా వలస పాలన నుంచి విముక్తం అయ్యాక, డెబ్బయ్యవ దశకంలో తన సహచర నాయకులు పాలకులుగా మారడం మూలంగా, గూగీ బలవంతపు ప్రవాసిగా మారాల్సి వచ్చింది. మాతృదేశాన్ని వదిలిన తర్వాత దశాబ్దాలపాటు ప్రవాసి గానే బతికాడు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో తులనాత్మక సాహిత్యం %-% అనువాద విభాగానికి అధిపతిగా పనిచేశాడు. పూర్వీకులు వారసత్వంగా కాపాడుకున్న అపారమైన జానపథ కథలు, ఇతిహాసాలతోపాటు, కెన్యా సాయుధ పోరాటం భూమికగా పనిచేసిన గెరిల్లా వీరుల సాహస గాథలే గూగీ రచనల సారం. కెన్యా దేశంపై వలస పాలన తెచ్చిమోపిన ఆంగ్ల విద్య ఎలా స్థానిక భాషలను, సంస్కృతులను ధ్వంసం చేసిందో ఆయన ప్రతి రచన లోనూ చూడగలం. వలసవాద అణచివేతను ఆయనతోపాటు ఆయన సృష్టించిన పాత్రలూ ఎదుర్కోవటం ఒక విశేషం. 'మాటిగిరి' అనే నవలలో మాటిగిరి పాత్ర మీద పోలీసులు లుక్ అవుట్ నోటీసు కూడా ఇచ్చారు! ఆయన రచనల్లోని పాత్రలు కూడా పాలకులను వణికించాయంటే వాటి బలాన్ని, ప్రాసంగికతను అర్థం చేసుకోవచ్చు. 'వీప్ నాట్, చైల్డ్', 'ద రివర్ బిట్వీన్', 'అ గ్రైన్ ఆఫ్ వీట్', 'పెటల్స్ ఆఫ్ ద బ్లడ్', 'డెవిల్ ఆన్ ద క్రాస్', 'మాటిగిరి', 'విజార్డ్ ఆఫ్ క్రౌ' వంటి నవలలతో బాటు కథలు, నాటకాలు, 'డి కాలనైజింగ్ ద మైండ్', 'పెన్ పాయింట్స్ అండ్ గన్ పాయింట్స్', 'బారెల్ ఆఫ్ పెన్', 'మూవింగ్ ద సెంటర్' వంటి నాన్ ఫిక్షన్, జైలు డైరీ, యుద్ధకాలం నాటి జ్ఞాపకాలు... మొదలైనవి గూగీ ప్రసిద్ధ రచనలు. "చరిత్రలో భాష సంస్కృతులనేవి ప్రజల సామూహిక జ్ఞాపకాల నిధి" అంటాడు గూగీ. పూర్వీకులు వారసత్వ సంపదగా కాపాడుకుంటూ వచ్చిన ఆ నిధిని పాశ్చాత్య వలసవాదం, భాషా సామ్రాజ్యవాదం కబళిస్తున్నాయి అంటూ, ఆంగ్ల భాషా సాహిత్యాల స్థానే అంతరించిపోతున్న స్థానిక మూలవాసుల భాషలను అధ్యయనం చేయాలి అని బలంగా వాదించాడు. వలస వాదం తెచ్చిన క్రైస్తవ మతం, పాశ్చాత్య విద్య స్థానిక తెగల మధ్య ఎలాంటి అంతర్గత విభేదాలను, సాంస్కృతిక వైరుధ్యాలను పెంచి పోషిస్తున్నాయో, ఆ రెండు సమాజాల మధ్య పారుతున్న నది సజీవమైన జీవన విధానాన్ని ఎలా కాపాడుకుంటూ వస్తున్నదో 'ద రివర్ బిట్వీన్' నవలలో చూడగలం. ఇది కెన్యా దేశ కథ మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న జాతులు, వారి బాషా సంస్కృతుల వలపోత. ఈ ప్రపంచంలో నల్లవాడిని తెల్లవాడు, స్త్రీని పురుషుడు, కూలీని రైతు క్రమానుగతంగా దోపిడీ చేస్తున్నారుబీ వీరందరిలోనూ నల్ల జాతి స్త్రీ, వ్యవసాయ కూలీ అత్యంత వ్యవస్థీకృత హింసకు బలవుతున్నారు అంటాడు 'విజార్డ్ ఆఫ్ క్రౌ' నవలలో. ఇరవై తొమ్మిదేళ్ళ కిందట హైదరాబాద్‌లో అఖిల భారత విప్లవ సాంస్కృతిక సంస్థ జాతుల సమస్య మీద నిర్వహించిన సదస్సులో పాల్గొనటానికి గూగీ ఈ దేశం వచ్చాడు. హుస్నాబాద్‌లో అమరుల స్మృతిలో నిర్మించుకున్న ఆసియాలోనే అతిపెద్దదైన స్థూపాన్ని పారవశ్యంతో చూసాడు. "మీకు కనీసం అమరుల జ్ఞాపకాలను నిలబెట్టుకునే స్వేచ్ఛ అయినా ఉంది," అని సంతోష పడ్డాడు. ఆనాటికే తాను కెన్యా విడిచి అమెరికాలో ప్రవాసిగా బ్రతుకుతున్న వైనాన్నీ, పుట్టిన నేల మీద 'మౌ మౌ' సాయుధ పోరాట కాలంలో ప్రాణాలను కోల్పోయిన సహచరులనూ యాది చేసుకున్నాడు. మళ్ళీ ఏడేళ్ళ క్రితం 2018లో హైదరాబాద్ వచ్చాడు. అప్పుడు తన బాల్య యాది చద్దిమూటను వెంట పెట్టుకుని వచ్చాడు. గూగీ కథ వింటుంటే బస్తర్ అడవుల్లోని ఆదివాసీ గూడేల్లో, తెలంగాణ మారుమూల పల్లెల్లో నీకూ నాకూ ఎదురైన ఆకలి, అవమానం, పీడన అంతా అద్దం ముందు నిలబడినట్టు ఉంటుంది. భాషా సామ్రాజ్య వాద పెత్తనం, యూరో సెంట్రిక్ ఆలోచనల శవ పేటికకు కొట్టిన మేకులు గూగీ రచనలు. స్వాభిమాన, ప్రతిఘటన పోరాటాలు ఉన్న ప్రతిచోటా ఆయన రచనలు అనువాదం అయ్యాయి. లక్షలాది అభిమానులకు, వేలాదిమంది పరిశోధకులకు కరదీపికగా మారాయి. ఆయన పరంపరకు వేలాదిమంది వారసుల పుట్టుకొచ్చారు. ఆయన స్ఫూర్తితో ఛిద్రమైన తమ మూలాలను, కోల్పోయిన పూర్వీకుల జాడలను అక్షరీకరిస్తున్నారు. అంతేకాదు, ఆయన నలుగురు పిల్లలు కూడా రచనలను ప్రచురించారు. ఆయన కొడుకు ముకోమా వా థియాంగో పేరు మోసిన అకడమిక్. ఆఫ్రికన్ నవలా వికాసం, అస్తిత్వ రాజకీయాల మీద సాధికారత కలిగిన బుద్ధిజీవి. "నిన్ను నీవు సజీవంగా ఉంచుకోవటానికి ప్రతిఘటన ఉత్తమమైన మార్గం. అన్యాయాన్ని తిరస్కరించటమనే చిన్నపాటి రూపంలోనైనా సరే ప్రతిఘటించాలి. నీ మార్గం సరైనదని నువ్వు నమ్మితే, నీ నమ్మకాలపై నువ్వు స్థిరంగా నిలబడితే, అవే నీ ఉనికిని కాపాడతాయి," అని గూగీ బలంగా నమ్మాడు. ప్రపంచవ్యాప్తంగా పోరాడే జనుల పక్షాన తన రచనలను ఒక మద్దతు వాక్యంగా నిలబెట్టాడు. బాధిత స్వరంలో ఆయన రాజేసిన కొలిమి కెన్యన్ వాడల నుంచి బస్తర్ అడవుల దాకా సజీవం గానే ఉంది.

# భారత్‌కు మరో రెండు స్క్వాడ్రన్ల ఎస్-400



రష్యా ఉపరాయబారి రోమన్ బాబుష్కిన్ ప్రకారం 2025-26 నాటికి మిగిలిన రెండు ఎస్-400 స్క్వాడ్రన్లు భారత్‌కు అందజేయబడతాయి. ఇటీవల జరిగిన భారత్-పాక్ ఘర్షణలలో ఎస్-400 వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని ఆయన తెలిపారు. డ్రోన్లపై నియంత్రణ కోసం యాంటీ-డ్రోన్ సాంకేతికతను భారతదేశంతో రష్యా భాగస్వామ్యం విస్తరించే భాగంగా చర్చలు జరుగుతున్నాయి.

### వచ్చే ఏడాది నాటికి అందజేస్తాం

### రష్యా ఉప రాయబారి బాబుష్కిన్ వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 2: ముందు అనుకున్న ప్రకారమే 2025-26 నాటికి మిగిలిన రెండు స్క్వాడ్రన్ల ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను భారత్‌కు అందజేస్తామని.. భారత్‌లో రష్యా ఉప రాయబారి రోమన్ బాబుష్కిన్ స్పష్టం చేశారు. ఇటీవలి భారత్-పాకిస్థాన్ ఘర్షణల సందర్భంగా ఎస్-400 సమర్థవంతంగా పని చేసినట్లు తమకు తెలిసిందన్నారు. 543 కోట్ల డాలర్ల విలువైన ఐదు ఎస్-400 స్క్వాడ్రన్ల కొనుగోలుకు భారత్ 2018లో రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే మూడు స్క్వాడ్రన్లు భారత్‌కు చేరాయి. భారత్‌తో రక్షణ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు వీలుగా.. గగనతల రక్షణ వ్యవస్థలకు సంబంధించిన చర్చలను ముందుకు తీసుకెళ్లటానికి సిద్ధంగా ఉన్నామని బాబుష్కిన్ వెల్లడించారు. భారత్-పాక్ ఘర్షణలో డ్రోన్లను భారీఎత్తున వినియోగించటాన్ని గుర్తు చేస్తూ.. డ్రోన్ల సమస్యను తాము చాలాకాలంగా ఎదుర్కొంటున్నామన్నారు. డ్రోన్లను నిలువరించే సాంకేతికతను తాము ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తున్నామని, భారత్-రష్యా రక్షణ భాగస్వామ్యం చర్చల్లో యాంటీ డ్రోన్ వ్యవస్థలు కూడా కీలకాంశమని గుర్తు చేశారు.

# కాళేశ్వరంపై కక్ష.. రైతులకు శిక్ష



పునాదులు పడ్డ నాటి నుంచీ బీఆర్ఎస్ పార్టీ రాజకీయ ప్రత్యర్థులు, కేసీఆర్ వ్యతిరేకుల నుంచి కాళేశ్వరం విమర్శలు, ఆరోపణలను ఎదుర్కొంటున్నది. ఆ విమర్శలు, ఆరోపణలను చూస్తుంటే, ఈ ప్రాజెక్టును అపఖ్యాతి చేయడమే వారి ముఖ్య ఉద్దేశమని స్పష్టమవుతున్నది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో నిర్మించిన, నిర్మిస్తున్న అనేక సాగునీటి ప్రాజెక్టుల్లో చాలా పొరపాట్లు జరిగాయి. ఈ పొరపాట్లు, తప్పులకు స్పష్టమైన ఆధారాలున్నాయి. అయినప్పటికీ కాళేశ్వరంపై జరిగినంతగా దుష్ప్రచారం మరే ఇతర ప్రాజెక్టు విషయంలో జరగలేదు. బీఆర్ఎస్ ప్రత్యర్థి పార్టీల వాదనలు దాదాపు ఒకేలా ఉండటం ఆసక్తికరం. సాధారణంగా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రాజకీయ పార్టీలు ఇటువంటి పొరపాట్లను రాజకీయం చేయవు. ముఖ్యంగా, కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో. అందులోనూ, నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ఆచితూచి స్పందిస్తాయి. ఇటువంటి బహుళార్థ సాధక ప్రాజెక్టు విషయంలో రాజకీయ ప్రత్యర్థి పార్టీలు ఎన్నికల్లో కూడబలుక్కొని ధైర్యంగా రాజకీయం చేయగలగడానికి ప్రధాన కారణం తెలంగాణ రైతు సమాజం ఒక బలమైన రాజకీయ శక్తిగా ఎదగకపోవడమే. తెలంగాణ రైతు సమాజం సాగునీటి వనరులపై ఇంకా సరైన అవగాహన పెంచుకోలేదు. దీనికి ఉదాహరణ పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు. తలాపున ఉన్న నీళ్లు దారిమళ్లిపోతున్నా కృష్ణా బేసిన్ రైతులు ఆయా రాజకీయ పార్టీలను నిలదీయడం లేదు. కావేరి నీటి విషయంలో గాని, నాగార్జునసాగర్ కుడి కాలువ జలాల విడుదల విషయంలో గాని ఆయా ప్రాంతాల్లోని రాజకీయ పార్టీలన్నీ రైతు ఎజెండా లక్ష్యంగా ఉద్యమిస్తాయి. కానీ, తెలంగాణలో మాత్రం కొన్ని రాజకీయ పార్టీలు ఈ జల దోపిడీని అడ్డుకోవడానికి ఉద్యమించడం అటుంచి, ఎన్నికల్లో చర్చించదగిన అంశంగా కూడా గుర్తించేందుకు నిరాకరిస్తున్నాయి. ఇక్కడ రెండు వైపులా పొరపాట్లు కనిపిస్తున్నాయి. ఒకటి, రైతులు సంఘటితమై గట్టిగా నిలదీస్తే రాజకీయ పార్టీల్లో చైతన్యం రావొచ్చు. అది జరగడం లేదు. రెండవది, రాజకీయ పార్టీలు ఈ జల దోపిడీని ఎన్నికల అస్త్రంగా మార్చుకొని రైతులను చైతన్యం చేయవచ్చు. కానీ, అసలు దీన్నొక ఎన్నికల అంశంగా కూడా ఎవరూ గుర్తించడం లేదు. తెలంగాణలోని కొన్ని రాజకీయ పార్టీల దౌర్భాగ్యం ఏమిటంటే.. అవి ఇంకా పక్క రాష్ట్ర ప్రయోజనాలే ఎజెండాగా ఉన్న రాజకీయ పార్టీల జెండా కిందే పనిచేస్తున్నాయి. కాళేశ్వరంపై అసంబద్ధ, నిరాధార ఆరోపణల ప్రచారం వల్ల ప్రధానంగా బలవుతున్నది తెలంగాణ రైతులే. తమ జీవనోపాధికి సాగునీటి కోసం కలలుగంటున్న తెలంగాణ అన్నదాతలే నష్టపోతున్నారు. సోషల్ మీడియా యుగంలో తప్పుదోవపట్టించే సమాచారం సత్యం కంటే వేగంగా వ్యాపిస్తుంది. సోషల్ మీడియాలో కుట్రపూరిత ప్రయోజనాలకు అనుగుణంగా కథనాలు రూపొందుతాయి. కాళేశ్వరంపై ఇలాంటి తప్పుడు కథనాలు ఎన్నో ప్రచారమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ సంస్థల నివేదికల ఆధారంగా తెలంగాణ రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వాస్తవాలను విశ్లేషించే ప్రయత్నమే ఈ వ్యాసం.

**కాళేశ్వరం ప్రాజెక్టు 2019 జూన్‌లో ప్రారంభమైంది.**

ఇది ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు. తెలంగాణను దాటి కిందికి పరిగెత్తుతున్న గోదావరి నదీ ప్రవాహాన్ని ఎత్తిపోసి, చారిత్రకంగా కరువుపడిన వ్యవసాయ భూములను సేద్యానికి అనుకూలంగా మార్చే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. ఈ ప్రాజెక్టు 1,832 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 203 కిలోమీటర్ల మేర వాగులు, భారీ జలాశయాలు, కాలువలు, పంప్ హౌస్‌లు ఇందులో భాగం. సముద్ర మట్టం నుంచి 100 మీటర్ల ఎత్తున ఉన్న మేడిగడ్డ నుంచి 618 మీటర్ల ఎత్తున ఉన్న కొండపోచమ్మ సాగర్‌కు (15 టీఎంసీలు) కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని లిఫ్ట్ చేస్తుంది. దారిలో మధ్యమానేరు (25 టీఎంసీలు), అన్నపూర్ణ (3.5 టీఎంసీలు), రంగనాయకసాగర్ (3 టీఎంసీలు), మల్లన్నసాగర్ (50 టీఎంసీలు) లాంటి జలాశయాలను కాళేశ్వరం నింపుతుంది. రాష్ట్రంలోని 20 జిల్లాల పరిధిలో ఉన్న సుమారు 45 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ఈ ప్రాజెక్టును నిర్మించారు. 18 లక్షల కొత్త ఆయకట్టుకు సాగునీటిని అందించడమే కాకుండా, 27 లక్షల ఎకరాల ప్రస్తుత ఆయకట్టు స్థిరీకరణ కాళేశ్వరం లక్ష్యం. పరోక్షంగా, 2023 వరకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా శ్రీరాంసాగర్, నిజాంసాగర్, పలు చెక్‌డ్యామ్‌ల కింద సుమారు 20 లక్షల ఎకరాలను సేద్యానికి అనుకూలంగా మార్చారు. కాళేశ్వరం సాధారణ సాగునీటి ప్రాజెక్టు కాదు. వాస్తవానికి భారతదేశంలో ఎక్కడా, ఎటువంటి ప్రాజెక్టులతో పోల్చలేనటువంటి అసాధారణమైన ఇంజినీరింగ్ నమూనా దీని సొంతం. ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రైతుల దీర్ఘకాలిక నీటి సమస్యలను పరిష్కరించటమే కాక వివక్ష, నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా

**నిలబడిన గొప్ప కట్టడం కాళేశ్వరం.**


ప్రత్యేక సమస్యలకు మూస పద్ధతిలో పరిష్కారం కనుగొనలేం. కాళేశ్వరం ప్రాజెక్టు ఈ భావాన్ని అద్భుతంగా ఆచరణలోకి పెట్టింది. తెలంగాణ సోయిలేని కొందరు ఇంజినీర్లు, రాజకీయ నాయకులు సూచించినట్టుగా గోదావరి-ప్రాణహిత సంగమంలో భారీ డ్యామ్‌ను నిర్మించడానికి పూనుకుంటే ఇంకో మూడు దశాబ్దాలైనా ఆ ప్రాజెక్టు పూర్తికాకపోయేది. ఎందుకంటే, అలాంటి డిజైన్ వల్ల అంతర్రాష్ట్ర జలవివాదాలు, పర్యావరణ, ముంపు సమస్యలు ఏర్పడే అవకాశం ఉండేది. అలా కాకుండా కొత్త దారిలో నడిచిన కాళేశ్వరం వినూత్న పరిష్కారాన్ని అందించింది. గోదావరిపై నిర్మించిన వరుస బ్యారేజీలకు నీళ్లను లిఫ్ట్ చేయడం వల్ల నదినే జలాశయంగా ఉపయోగించుకునే వెసులుబాటు లభించింది. తద్వారా ఇది ఇంజినీరింగ్ అద్భుతంగా నిలిచింది. పరీవాహక ప్రాంతంలో పునరావాస సమస్యలు లేకుండా గోదావరి నదిని పునరుజ్జీవింపజేసే విధంగా 38 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు తోడ్పడ్డాయి. ఈ విభిన్న ఆలోచనా విధానం ప్రధాన సవాళ్లను అధిగమించడమే కాక, అతి తక్కువ కాలంలో ఎగువ జిల్లాలకు నీటిని అందించింది. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. అయితే, కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ చేసి చూపే ప్రయత్నంలో విమర్శకులు కాగ్ నివేదికను ఉటంకిస్తూ 2022 మార్చి నాటికి 40,888 ఎకరాలు మాత్రమే సాగులోకి వచ్చినట్టు ప్రచారం చేస్తున్నారు. కానీ, వారి వాదనను 2022 మార్చి నాటికి వరి సాగు డేటాతో పోల్చి చూస్తే వాస్తవాలు తెలుస్తాయి. 2023 జనవరి 15న ఓ ఆంగ్ల పత్రికలో ప్రచురితమైన (గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌పై నిందలను ప్రచారం చేసింది ఈ పత్రిక. ఆ ప్రచారాన్నే ఇప్పటికీ కొనసాగిస్తున్నది) కథనం ప్రకారం.. 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి 2023 జనవరి 11 నాటికి 17,98,466 ఎకరాల్లో వరి సాగైంది. ఇది ఆ కాలానికి అంచనా వేసిన సాగు విస్తీర్ణం (8,29,279 ఎకరాలు) కంటే రెండు రెట్లు అధికం కాగా, 2021-22లో అదే సమయంలో సాగు విస్తీర్ణం (3,85,106 ఎకరాలు) కంటే నాలుగు రెట్లు ఎక్కువ. 2018-19 నుంచి 2023-24 మధ్యకాలంలో వరి కొనుగోళ్లు సుమారు 55 శాతం పెరిగాయి. అంటే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటి లభ్యత పెరిగి, తద్వారా ధాన్యం ఉత్పత్తి పెరిగినట్టు ఈ డేటా సూచిస్తున్నది. అందువల్ల విమర్శకుల ఆరోపణలు రైతాంగాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని చెప్పక తప్పదు. అంతేకాదు, విమర్శకులకు డేటాపై సరైన అవగాహన లేదని వారి ఆరోపణలు తెలియజేస్తున్నాయి. పంట దిగుబడులే కాకుండా, భూగర్భ జల స్థాయిలను మెరుగుపరిచి పర్యావరణ సమతుల్యతకు కూడా కాళేశ్వరం దోహదపడింది. జలాశయాలను నింపడం ద్వారా భూగర్భ జల నిల్వలు సగటున 4 మీటర్ల కంటే ఎక్కువ పెరిగాయి. దీని వల్ల బోర్లు, బావుల ఆధారిత సాగు విస్తృతంగా పెరిగింది. సాగునీటిని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతు ఆత్మహత్యలను తగ్గించేందుకు కాళేశ్వరం కృషి చేసింది. ఫలితంగా వ్యవసాయ స్థిరత్వానికి దేశంలో ఒక ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. భారతదేశపు 'రైస్ బౌల్'గా, స్థిరమైన అభివృద్ధికి దిక్సూచిగా తెలంగాణను ప్రపంచానికి కాళేశ్వరం పరిచయం చేసింది. కాళేశ్వరంప్రాజెక్టు ప్రయోజనాల లోతును అర్థం చేసుకోవడానికి ఈ చర్చను చారిత్రక నేపథ్యంతో చూడడం అవసరం. చారిత్రకంగా 1956 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాంతాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. గోదావరి జలాలను తెలంగాణ కోసం వినియోగించలేదు. గోదావరి బేసిన్‌లో 75 శాతం విశ్వసనీయతతో 4,158 టీఎంసీల నీటి వార్షిక ఉత్పత్తి అంచనా వేయబడింది. ఈ నీటిని ఉత్తర తెలంగాణలోని కరువు జిల్లాలకు మళ్లించవచ్చు. కానీ, అప్పటి ప్రభుత్వాలు అలా చేయలేదు. 1963లో నిజామాబాద్‌లో గోదావరి మీద నిర్మించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు తెలంగాణ సాగుకు ఉపయోగపడాల్సింది. కానీ, నిధుల కొరత, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆలస్యమై ప్రాజెక్టు మరుగునపడ్డది. కర్ణాటక, మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల్లో నిర్మించిన ప్రాజెక్టుల కారణంగా, పూర్తికాని కాలువల వల్ల ఈ ప్రాజెక్టు ఆయకట్టు ఉనికిలో లేకుండాపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కోస్తాంధ్ర సాగునీటికి ప్రాధాన్యతనివ్వగా, గోదావరి నీటిని తెలంగాణ కోసం అస్సలు వినియోగించలేదు. అంతర్రాష్ట్ర ఒప్పందాలు, ప్రాజెక్టు ఖర్చులు, భౌగోళిక సమస్యలు గోదావరి జలాల వినియోగాన్ని సంక్లిష్టం చేశాయి. కాళేశ్వరం నీళ్లు తెలంగాణలోని అత్యంత ఎత్తయిన ప్రాంతాలకు చేరుకున్నాయి. అక్కడి నుంచి గురుత్వాకర్షణ శక్తి ద్వారా అత్యంత ఎత్తయిన ప్రాంతాల్లోని బీడు భూములను సస్యశ్యామలం చేశాయి. హల్దీవాగు, కూడెల్లి వాగు వంటి చిన్నవాగులు కూడా పునరుజ్జీవనం పొందాయి. పాత బావుల్లో ఊటలు పెరిగాయి. మరుగునపడిన బోర్లు మళ్లీ నీళ్లు పోయడం ప్రారంభించాయి. కాళేశ్వరం ప్రారంభమైన తర్వాత తెలంగాణ గ్రామాల్లో బోర్‌వెల్ బండ్ల రాక బంద్ అయ్యింది. దీని వల్ల తెలంగాణలోని ఒక గ్రామం ఏడాదికి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ఆదా చేసుకుంటున్నది. కాళేశ్వరం జలాలు రైతుల మనోధైర్యాన్ని పెంచాయి. హైదరాబాద్, ముంబై, దుబాయి వంటి సుదూర నగరాలకు వలసవెళ్లిన చాలా మంది రైతులు స్వగ్రామాలకు తిరిగివచ్చి మళ్లీ వ్యవసాయాన్ని చేపట్టారు. నిరాశ నుంచి ఆశ వైపు మార్పు స్పష్టంగా కనిపించింది. రైతుల్లో భవిష్యత్తుపై భరోసా ఏర్పడింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా వ్యవసాయ రంగంలో ఒక స్వర్ణయుగాన్ని తీసుకువచ్చింది నాటి సర్కారు. దీని ద్వారా అతి తక్కువ కాలంలోనే 'బంగారు తెలంగాణ' సాకారమైంది. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు సాగునీరు సహాయపడింది. కాళేశ్వరంలో అంతర్భాగమైన మిషన్ భగీరథ ద్వారా కోటి మందికి పైగా తాగునీటిని అందించింది. తద్వారా మహిళలకు శ్రమ తగ్గింది. ఇది స్థిరమైన అభివృద్ధికి దోహదపడింది. సాగునీరు అందించడం, భూగర్భజల పునరుద్ధరణ మాత్రమే కాదు, 2014-15 నుంచి 2023-24 వరకు చేపల ఉత్పత్తిని 70 శాతం పెంచుతూ, 2024 నాటికి రూ.7 వేల కోట్ల వార్షిక ఉత్పత్తి విలువనూ కాళేశ్వరం సాధించింది. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఈ విధంగా గ్రామీణాభివృద్ధికి కాళేశ్వరం ఊతమిచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రయోజనాలను ప్రత్యక్షంగా గుర్తించిన పలువురు రాజకీయ నాయకులు దాని అపఖ్యాతి పాల్జేసే కుట్రలో క్రియాశీలంగా పని చేశారు. ఇది అత్యంత దుర్మార్గం. అభివృద్ధి ఎప్పుడూ రాజకీయ ఆకాంక్షలకు మించి ఉండాలి. కానీ, దురదృష్టవశాత్తు వ్యక్తిగత ప్రతీకారాలకు, రాజకీయ ప్రేరేపణలకు కాళేశ్వరం బలవుతున్నది. కొందరు నాయకులు వ్యక్తిగత స్వార్థానికి వాడుకోవాలని చేసిన ప్రయత్నం చివరికి ఒక పెద్ద రాజకీయ దుమారం ఏర్పడటానికి కారణమైంది. ఉమ్మడి ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల తరతరాలు అభివృద్ధికి నోచుకోలేదు. దీని వల్ల సామాజిక, ఆర్థిక నష్టం జరిగింది. సామాజికంగా వెనుకబడిన వర్గాలను అభివృద్ధి చేయ డం ప్రభుత్వ రాజ్యాంగపరమైన బాధ్యత. అందువల్ల కాళేశ్వరాన్ని సాగునీటి ప్రాజెక్టుగా కాకుండా సామాజిక సంక్షేమ, అభివృద్ధి ప్రాజెక్టుగా చూడాలి. ఖర్చు-లాభ నిష్పత్తిని పరిమిత దృష్టితో కాకుండా చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దడం, వెనుకబడినవర్గాల అ భ్యున్నతి, పేదరికం దుష్పరిణామాలను అధిగమించడమనే కోణంలో కాళేశ్వరాన్ని అర్థం చేసుకోవాలి. ప్రాజెక్టు ఖర్చు అధికమే కావ చ్చు. కానీ, గతంలో తెలంగాణ రైతుల పట్ల జరిగిన నిర్లక్ష్యం ఖర్చు కూడా తక్కువ కాదు.

# పేద పిల్లల మీదనా.. మీ టాయిలెట్ ప్రయోగాలు?



'గురుకుల పిల్లలు వాళ్ల టాయిలెట్ వాళ్లు కడుక్కుంటే తప్పేముంది? చపాతీలు చేయడం నేర్చుకుంటే తప్పేముంది? వాళ్లేమైనా సంపన్న వర్గాల (పోష్ సొసైటీ) నుంచి వచ్చారా కూర్చున్న టేబుల్ మీదికే అన్నీ రావడానికి? ఈ పనుల గురించి వాళ్ల తల్లిదండ్రులు స్కూల్‌కు వచ్చి ప్రశ్నిస్తే వాళ్లకు షోకాజ్ నోటీసులు ఇచ్చి బయటకు గెంటేయండి. వినకపోతే ఎఫ్ఐఆర్ బుక్ చేయండి' అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిణి తమ సిబ్బందికి ఇటీవల మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. వంటశాల, శానిటేషన్ పనులను పర్యవేక్షించే 261 మంది అసిస్టెంట్ కేర్‌టేకర్లను రాత్రికిరాత్రే నిర్దాక్షిణ్యంగా తొలగించేశారు. ఒక ప్లంబర్, ఎలక్ట్రీషియన్‌ను మూడు పాఠశాలల పనులు చేయాలంటున్నారు. మెస్ కమిటీలను ఏర్పాటు చేసి పిల్లల పర్యవేక్షణలోనే అన్ని పనులూ జరగాలంటున్నా రు. 'నెలకు ఇరవై ముప్పై గంటల చదువు పోతే ఏం నష్టం జరుగుతుంది' అని తమ చర్యలను గట్టిగా సమర్థించుకుంటున్నారు. పేద వర్గాల మీద తాము చేస్తున్న కుట్రలు బయట పడేసరికి ఎటూ పాలుపోక ప్రవీణ్ కుమారే పిల్లలకు విషాహారం పెట్టించారని మొదట నాపై నిందలు మోపారు, ఇప్పుడు 'ప్రవీణ్ కుమార్ హయాంలో ఏకంగా రూ.వంద కోట్ల అవినీతి జరిగింది' అని విషప్రచారం చేస్తున్నారు. ఈ కుట్ర మీద రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరగాల్సిందే. గతంలో కేసీఆర్ హయాంలో ఈ బిడ్డల సర్వతోముఖాభివృద్ధి ఏ విధంగా జరిగిందో కొన్ని ఉదాహరణలు చెప్తాను. కొన్నేండ్ల క్రితం బీసీ రజక బిడ్డ అగసార నందినిని కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రీడా పథకం ద్వారా శిక్షణకు పంపిస్తే, ఆమె భారతదేశానికి ఎన్నో పతకాలను సాధించారు. ఇటీవల దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో దేశానికి బంగారు పతకం గెలిచారు. అతి చిన్న వయస్సులో ఎవరెస్ట్ ఎక్కి ప్రపంచ రికార్డు నెలకొల్పిన మాలోతు పూర్ణ నుంచి స్కైడైవింగ్ చేసిన దర్శనాల సుష్మ, పైలట్లు, నేవీ కెప్టెన్లుగా పనిచేస్తున్న అమ్మాయిల వరకు అనేక అద్భుతాలు.. నేను గురుకులాల సెక్రెటరీగా ఉన్నపుడు నాటి కేసీఆర్ ప్రభుత్వ సహాయంతో చేయగలిగాం. పాఠశాల ప్రాంగణంలో హార్వర్డ్, కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల గురించి చెప్పేవాళ్లం. విద్యార్థులకు వారి తల్లిదండ్రులు గుర్తుకురాకుండా చక్కగా చూసుకునేవాళ్లం. అందువల్లనే గత పదేండ్లలో గురుకులాల నుంచి ఎంతో మంది డాక్టర్లు, ఇంజినీర్లు, ఆర్మీ కెప్టెన్లు తయారయ్యారు. 'మేం ఏదైనా చేయగలం' అని ఆలోచించే విధంగా పిల్లలను ప్రోత్సహించేవాళ్లం. అంతేకానీ, 'వ్యక్తిత్వ వికాసం' కోసం 'చెత్త ఊడ్చాలి, బాత్రూమ్‌లు కడుక్కోవాలి, తరగతి గదులు క్లీన్ చేసుకోవాలి' అని ఏనాడూ చెప్పలేదు. ఇవన్నీ ఎలా చేసుకోవాలో ఆ బిడ్డలకు పేద తల్లిదండ్రులు బాల్యం నుంచి నేర్పిస్తారని ఆ సమాజం నుంచి వచ్చిన నాకు తెలుసు. పిల్లలకు సరైన ఆహారం పెట్టడంలో ఏనాడూ వెనక్కి తగ్గలేదు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గురుకులాల పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వందలాది గురుకులాల్లో విషాహారం తిని గత విద్యాసంవత్సరంలో 85 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. విద్యార్థులు మరణిస్తున్నా అధికారులపై చర్యలు గాని, మార్పులు గాని చెయ్యలేదు. ఎస్సీ వర్గాలకు చెందిన ప్రజలే దేశంలో మెజారిటీ సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్నారని గణాంకాలు చెప్తున్నాయి. చివరికి జైళ్లలోనూ ఆ వర్గాల ఖైదీలతోనే మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్నారని సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. తమ పిల్లలకైనా ఇలాంటి పాచి పని నుంచి విముక్తి కల్పించి, గొప్ప స్థానాల్లో చూడాలని తల్లితండ్రులు గురుకులాలకు పంపితే, ఇక్కడ కూడా పిల్లలు అదే పని చేయాలని చెప్పడం దేనికి సంకేతం? కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వర్గాల ప్రజలు తరతరాలుగా ఒకే పని చేస్తూ బతకాలని చెప్తున్నదా? ఒక పక్క కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశమంతా రాజ్యాంగం పట్టుకొని తిరుగుతుంటే, తెలంగాణలో అదే కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగంలోని సమానత్వపు హక్కు ఆర్టికల్ 14, అంటరానితనాన్ని నిషేధించే ఆర్టికల్ 17, ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఆర్టికల్ 21లను కాలం సీఎం రేవంత్ 'నేనే పెద్ద మాదిగ, నేనే పెద్ద మాల' అని ఉపన్యాసాలు ఇస్తూనే, మరోపక్క అధికారులతో పేద పిల్లలను అవమానాలకు గురిచేస్తున్నారు. ఇది ఆయనకు పేద వర్గాలపై ఉన్న ప్రేమ, చిత్తశుద్ధిని తెలియజేస్తున్నది. గురుకులాలను నిర్వీర్యం చేసి పేద వర్గాలను చదువుకు దూరం చేయడమే రేవంత్ లక్ష్యం. 12 గురుకుల జూనియర్ కాలేజీలను రద్దు చేయాలని చూశారు. ఇప్పటివరకూ గురుకుల డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించలేదు. బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన ఆర్మీ డిఫెన్స్ డిగ్రీ ప్రిపరేటరీ కళాశాలను ఎత్తేశారు. వందలాది మంది డాక్టర్లను అందించిన గౌలిదొడ్డి వంటి గురుకుల కళాశాలల్లో ఇపుడు బైపీసీ గ్రూపు లేకుండా కుట్ర చేస్తున్నారు. తెలంగాణ ప్రజలు ఇందుకోసమేనా కాంగ్రెస్‌ను గెలిపించుకున్నది? పిల్లలతో టాయిలెట్లు కడిగించాలని చెప్పడమేనా మార్పు? విషాహారం పెట్టడమేనా ప్రజాపాలన? కాంగ్రెస్ నాయకుల పిల్లలు చదివే పాఠశాలల్లో వాళ్లే టాయిలెట్లు కడుగుతున్నారా? పోనీ కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేసే అధికారులు వారి ఆఫీసుల్లో చీపురు పట్టి ఊడుస్తారా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ఇంట్లో బాత్రూం క్లీన్ చేసుకుంటారా? పేద పిల్లలపైనే ఈ ప్రయోగాలు చేయాలా? అగసార నందిని ఇటీవల సీఎంను కలిశారు. గతంలో నిఖత్ జరీన్, సిరాజ్ వంటి క్రీడాకారులకు ఇచ్చినట్టు గ్రూప్-1 ఉద్యోగం, నగదు బహుమానం, హైదరాబాద్‌లో ఇల్లు వంటి ప్రకటనలు తనకు కూడా వస్తాయని ఆశించారేమో కానీ, అలాంటివేమీ జరగలేదు. సీఎంతో ఫొటో తీసి పంపించేశారు. ఈ రాష్ట్రంలో పేద వర్గాల పిల్లలను, ముఖ్యంగా గురుకులాల్లో చదివిన విద్యార్థులను రేవంత్ సర్కార్ పట్టించుకోదు సరికదా, అవమానిస్తుందని బహుశా నందినికి, మరెందరో తల్లిదండ్రులకు తెలియదేమో. తల్లిదండ్రులారా.. మీ పిల్లల భవిష్యత్తు పట్ల జాగ్రత్త.

# మద్దతుదారుల మెప్పు కోసమే మోదీ వాగాడంబరం



ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాని మోదీ ఉపయోగిస్తున్న భాష చాలా మందిని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌పై విజయం సాధించినట్టు భారత్ ప్రకటించింది. ఆ తర్వాత మోదీ ఆ కీర్తికాంతుల్లో దర్జాగా ఓలలాడాలి. కానీ, అలా జరగడం లేదు. అందుకు విరుద్ధంగా రోజు విడిచి రోజు పాకిస్థాన్‌పై భారత్ కఠిన వైఖరి గురించి గుండెలు బాదుకుంటూ ఆవేశపూరిత ప్రసంగాలు ఎందుకు చేస్తున్నట్టు? మోదీ ఉపయోగిస్తున్న వైవిధ్యభరితమైన భాష అనాలోచితమైందిగా భావించడానికి వీల్లేదు. 32 దేశాలకు ఏడు అఖిలపక్ష ప్రతినిధివర్గాలతో దౌత్య రాయబారాలు పంపించిన తర్వాత అం దుకు భిన్నంగా ఈ ఆవేశకావేశాలు ఏమిటా? అని విస్మయం కలుగుతున్నది. మోదీ దూకుడు ను ప్రపంచ నేతలు సానుకూలంగా తీసుకోరు. అదేవిధంగా జైషే మహమ్మద్, లష్కరే తోయి బా వంటి ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం ఇవ్వ డం ద్వారా భారత్‌పై పాక్ యుద్ధం జరుపుతున్నదనే సందేశానికి తోడ్పాటునూ అందించరు. మోదీ వాగాడంబరం స్థానిక ఒత్తిళ్లతో స్వదేశీ ప్రజల కోసం ఉద్దేశించినట్టుగా కనిపిస్తున్నది. ఇంతకూ ఏమిటవి? టీవీలకు, పత్రికలకు పతా క శీర్షికలు సమకూర్చాలనే దుగ్ధ కారణమా? ఆయన ఉపయోగిస్తున్న సినీ ఫక్కీ డైలాగుల కొత్తదనం పదేపదే ఉపయోగించే రొడ్డకొట్టుడు ప్రసంగాలు చేసే రాజకీయ నాయకుల కంటే మోదీని భిన్నంగా నిలబెడుతున్నది. ప్రతి ప్రసంగంలో ఆయన కథనాన్ని మార్చి మీడియాకు రోజుకో పతాక శీర్షికను సమకూరుస్తున్నారు. కీలకమైన బీహార్ ఎన్నికల్లో బీజేపీని ఏకైక అతిపెద్ద పార్టీగా గెలిపించాలన్న ఉద్దేశంతో మోదీ అలా మాట్లాడుతున్నారనేది మరో వివరణ. కీలకం ఎందుకంటే, జనతాదళ్ (యునైటెడ్) నేత నితీశ్‌కుమార్‌కు రాష్ట్రానికి మరో విడత సారథ్యం వహించే శారీరక, మానసిక క్షమత ఎంతమాత్రం లేనట్టుగా కనిపిస్తుండటం. ఏదేమైనప్పటికీ, బీహార్ ఎన్నికలు మాత్రం కుల సమీకరణాల ఆధారంగా జరుగుతాయి. కాబట్టి, మోదీ చేస్తున్న గుండెలు బాదుకునే ప్రసంగాలు ప్రధానంగా బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవి కాకపోవచ్చు. పాకిస్థాన్‌పై సైనిక చర్య ప్రారంభించిన భారత్.. పీవోకేను చేజిక్కించుకోలేదని మితవాదవర్గాలు అసంతృప్తితో ఉన్నాయి. భారత రక్ష ణ దళాలు విజయం సాధిస్తున్నాయని, పాక్ రక్షణ వ్యవస్థలను బద్దలు కొడుతున్నాయని మే 7-10 వరకు మీడియా సమావేశాల్లో ప్రభు త్వం చెప్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో హఠాత్తు గా కాల్పుల విరమణకు అంగీకరించడం వారిని విస్మయానికి గురిచేసింది. కాల్పుల విరమణ అనేది పాకిస్థాన్ బెదిరిపోయి అడిగినందుకా లేక ట్రంప్ బెదిరింపులు, వాణిజ్య ప్రోత్సాహకాల కోసమా? అనే వివరణలతో వారికి నిమిత్తం లేదు. ఉన్నపళంగా యుద్ధాన్ని ఆపివేయడం వారికి నచ్చలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సైనిక, రాజకీయ వ్యూహం గురించి తన మద్దతుదారులను ఒప్పించేందుకు తగిన బహిరంగ వైఖరిని మోదీ రూపొందించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. సైనిక చర్య కొనసాగుతుందని ఆయన ఇస్తున్న హామీ రెండు దేశాల మధ్య శత్రుత్వాన్ని, ఉద్రిక్తతలను పెంచుతుంది. ఆయన మద్దతుదారులు కోరుకునేది అదే. అందుకే 'సిందూర్'కు ఇప్పటికీ కొనసాగుతున్న మిలిటరీ ఆపరేషన్‌గానే ముద్రవేస్తున్నారు. చర్య కొనసాగుతున్నదని, దీర్ఘకాలిక యుద్ధం జరుగుతున్నదని భరోసా ఇస్తే మద్దతుదారుల్లో మోదీ తరహా దుందుడుకు నాయకత్వ శైలికి ప్రాసంగికత, ఆవశ్యకత ఉన్నాయన్న నమ్మకం ఏర్పడుతుంది. పార్లమెంటులో గుచ్చిగుచ్చి అడిగే ప్రశ్నలను తప్పించుకునేందుకు 'కొనసాగుతున్న ఆపరేషన్' వెనుక దాక్కునేందుకు వీలు కలుగుతుంది. మితవాద మద్దతుదారుల వంటి వారి నుంచి వచ్చే స్వదేశీ ఒత్తిళ్లు రెండు దేశాల మధ్య మరో విడత సైనిక ఘర్షణకు దారితీస్తుందా? అనేది ఇక్కడ అసలు ప్రశ్న. ఈ నేపథ్యంలో ఈ దుందుడుకు మాటలు ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చి, శత్రుత్వాన్ని పెంచి, ఉద్రిక్తతలకు ఆజ్యం పోయకుండా చూడాల్సి ఉంది. ఎందుకంటే పహల్గాం పాకిస్థాన్‌లో లేదు.

# డాలస్‌లో గులాబీ సంరంభం



జూన్ 2 అంటే బిగించిన పిడికిలి తెలంగాణ భౌగోళిక పటంగా పరిణమించిన రోజు. ఆత్మగౌరవ పోరాటం అద్వితీయ విజయం సాధించి న రోజు. రాజకీయంగా తెలంగాణ పతాకం రెపరెపలాడిన రోజు. ఈ సారి ఈ పండుగ రెండు విధాలా ప్రాముఖ్యాన్ని సంతరి ంచుకున్నది. రాష్ట్ర అవతరణం రోజున, రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ కలిపి జరుపుకోవడం విశేషమైతే, ఈ అపురూప కలయికకు అమెరికాలోని డాలస్ వేదిక కావడం మరో విశేషం. తెలంగాణ పోరాటం ఈ గడ్డ మీద జరిగినా దేశ దేశాల్లోని తెలంగాణ బిడ్డలు చేపట్టిన సంఘీభావ కార్యక్రమాల అండదండలు అసామాన్యమైనవి. ఉద్యమానికి వారు కలిగించిన ఉత్తేజం అద్వితీయమైంది. తెలంగాణ ఎన్నారైల పోరాటదీప్తిని గౌరవించుకుంటూ డాలస్‌లో నిర్వహించిన భారీ సభ తెలంగాణకు ఓ మూలమలుపు. అదొక మహా సంరంభం. మహత్తర సందర్భం. విశ్వవేదికపై జరిగిన తెలంగాణ అలయ్ బలయ్. డాలస్ సభ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆత్మీయ నీరాజనాలెత్తింది. అమెరికాలోని పలు నగరాలతోపాటుగా ఇతర దేశాల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన ఎన్నారైలు హాజరైన ఆ సభలో ఆయనకు లభించిన స్వాగత సత్కారాలు అపురూపమైతే, అద్భుతమైన రీతిలో ఆయన చేసిన ప్రసంగం ఓ మైలురాయిగా నిలుస్తుంది. తెలంగాణ మట్టి పరిమళాన్ని గుర్తు చేస్తూ 'జననీ జన్మభూమిశ్చ' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు కేటీఆర్. మారిన పరిస్థితుల్లో మరో పోరాటానికి సన్న ద్ధం కావాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ అభిమానుల్లో నూతనోత్సా హం కలిగించారు. 'తెలంగాణ గాలివాటంగా వచ్చిన రాష్ట్రం కాదు. సుదీ ర్ఘ యాతనలు, అమరుల త్యాగాలతో రాష్ట్రాన్ని సాధించుకున్నం. సాధించుకున్న రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రస్థాయిలో నిలుపుకొన్నం. తెలంగా ణ విఫల రాష్ట్రం అవుతుందని, పాలించడానికి నేతలున్నారా అని గేలి చేసినవారే తమకు కూడా తెలంగాణలోని నేతల వంటి పాలకులుంటే బాగుండనే రీతిలో ప్రశంసలందుకున్నాం' అని గుర్తుచేశారు. కానీ, నేడు పరిస్థితి తారుమారైంది. మాయదారి హామీల మోసకారి పాలనలో రాష్ట్రం చీకట్లలోకి జారుకున్నది. ప్రజలు ఆగమాగమైపోతున్న రు. అవస్థలు పడుతున్నరు. కేసీఆర్ పాలన నాటి మంచిరోజులను పదే పదే గుర్తుచేసుకుంటున్నరు. ఈ నేపథ్యంలో కేటీఆర్ తన చల్లని మాటల తో గుండెదిటవు కల్పించారు. తెలంగాణలో మళ్లీ వెలుగులు విరజిమ్మే రోజు ఎంతో దూరంలో లేదని కేటీఆర్ ఢంకా బజాయించారు. మరో మూడేండ్లలో మళ్లీ కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి తీరుతుందని భరోసా కల్పించారు. బిడ్డ మళ్లీ తల్లి ఒడికి చేరుతుందని భావగర్భితంగా చాటిచెప్పారు. కేటీఆర్ తన ప్రసంగాన్ని రాజకీయాలకే పరిమితం చేయకుండా ఎన్నారైలతో బీఆర్ఎస్ అనుబంధాన్ని ప్రత్యేకంగా స్మరించుకున్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను, విశేషించి ఏఐని అందిపుచ్చుకోవాలని పిలుపునివ్వడం గమనార్హం. అంతేకాకుండా అటు అమెరికాతో పాటుగా దేశ దేశాల వలస విధానాల్లో వస్తున్న పెనుమార్పుల వల్ల తెలంగాణ బిడ్డలకు ఎదురవుతున్న సమస్యలనూ ప్రస్తావించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా బీఆర్ఎస్ ఎల్లవేళలా, అన్నివిధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణకు సేవచేయడం బరువు కాదని, అది తమ బాధ్యతని కేటీఆర్ చెప్పడం కొసమెరుపు.

# తెలంగాణ స్ఫూర్తి



నాతెలగాణ రాష్ట్రము సనాతన కాలమునుండి గూడ దు ర్జాతుల వారు చేసెడు దురాగత పాపములన్ దళించక ని ర్భీతిగ ఉద్యమమ్ముల నపేక్షిత పోరును సల్పె ఎప్పుడే రీతులగాని మౌనమును రిత్తగ దాల్చగ లేదు విజ్ఞతన్ వీరులకెప్పుడీ పుడమి పేరును గాంచె ననాది నుండియున్ పోరును సల్పి స్వేచ్ఛను అపూర్వముగా భువి కాంచ నెంచి యె వ్వారల శత్రు మూకల రవంత మిగుల్చక పారదోలి యీ భారత భూమిపై గనె వివర్ధిత స్ఫూర్తి నిరంతరమ్ముగన్ తెలగాణన్ తమ స్వార్థపూరితపు నిస్తేజంపు వ్యూహమ్ములన్ తలపెట్టన్ తమ దుష్టభావముల స్వాంతమ్మందు యోచించుచున్ మెలగన్ జూచెడు వారినోర్చుకొనుచున్ మేలందుటల్ జేయ నా ఖలులన్ మానసమందు ఓర్చుకొనిరే కాఠిన్యమున్ జూపకన్ నైజామున్ సహియింపకీ జనము విన్నానమ్ము జూపించుచున్ తేజమ్మొప్పగ పోరు సల్పిరిట ఆ ధీశక్తులన్జూపుచున్ నైజమ్మున్ భువి జూపినారిచట సంధానించు వ్యూహమ్ములా రాజుల్ కాలికి బుద్ధి సెప్పి చనగన్ రారాజులున్ వీరులున్ కాకతి వంశధీమణులు క్రాంతిని జూపుచు శత్రుమూకలన్ పీకమడంచ గల్గిరి సువీక్షతమౌ తగు పోరుసల్పి ఎం దాక తెలుంగు నేలది ముదమ్మున నుండెనొ అంతదాక వి ద్యాకిరణమ్ములుం దగ నయమ్మును పంచుచు నుండి రెప్పుడున్

# మెదడుపై పెరుగుతున్న ఒత్తిడి” - “బ్రెయిన్ పవర్” పెంచుకునే మార్గాలివీ!







ఈ అలవాట్లతో బ్రెయిర్ సూపర్ పవర్?గా పనిచేస్తుందంటున్నారు నిపుణులు

మానవ శరీరంలో మెదడు ఎంతో కీలకమైన అవయవం. ఆలోచనలు, భావోద్వేగాలు, జ్ఞాపకాలను విశ్లేషించేది, నిర్ణయాలు తీసుకునేది అదే. ఇక ఒక్కమాటలో చెప్పాలంటే బాడీలో మెదడే హెడ్?మాస్టర్. అయితే, మన పూర్వీకులు చూడని ఎన్నో సంక్లిష్టతలను ప్రస్తుత ప్రపంచం ఎదుర్కొంటున్నదని, మొబైల్?ఫోన్లో నిరంతరం వచ్చిపడే నోటిఫికేషన్లు, ఆలోచనలు, వర్క్ వంటివి కుదురుగా నిలవనీయడం లేదని, దీనితో మెదడుపై ఒత్తిడి పడుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇది కాలక్రమంలో అల్జీమర్స్ వంటి సమస్యలకు దారి తీయొచ్చుట. మరి, ఈ పరిస్థితి రాకుండా ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం!

## సుడోకుజి

మెదడుకు మేత : సుడోకు, క్రాస్?వర్డ్స్, పజిల్స్ వంటి గేమ్స్ బుర్రను ఉత్తేజపరచడంలో ఎంతగానో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. లాజికల్ థింకింగ్, సమస్య పరిష్కార సామర్థ్యాలను మెరుగుపరుస్తాయని, నిత్యం పుస్తకాలు, వ్యాసాలు చదవడం కూడా ఇందుకు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల ఊహాశక్తిని పెంచడంతో పాటు, భావప్రకటనా శైలిని మెరుగుపరుస్తుందట. “నిద్రలో గుండెపోటు” - 19సెకన్ల ‘ఈ రూల్’ పాటిస్తే మంచిద ంటున్న నిపుణులు!

## వ్యాయామం

వ్యాయామం : శారీరక వ్యాయామం మెదడులో రక్తప్రసరణను పెంచుతుందని, ఫలితంగా ఆక్సిజన్, ఇతర పోషకాలు అంది, పనితీరు మెరుగవుతుందని నిపుణులు అంటున్నారు. వ్యాయామం వల్ల మెదడులో ఆరోగ్యకరమైన న్యూరోట్రాన్స్?మీటర్లు విడుదలవుతాయని, ఇవీ మెదడును ఉత్తేజితం చేస్తాయని వివరించారు. రోజూ కనీసం 30 నిమిషాల నడక లేదా జాగింగ్ చేస్తే ఆరోగ్యానికే కాదు మెదడుకు మంచిదని పేర్కొన్నారు. వీటితో పాటు ఆటలు ఆడడం, డాన్స్ చేయడంతోనూ ప్రయోజనం ఉంటుందని సలహా ఇస్తున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల అల్జీమర్స్ వ్యాధి వచ్చే ప్రమాదం తగ్గుతుందని పలు పరిశోధనల్లో తేలింది.

## పోషకాహారం

పోషకాలు : పోషకాహారం మెదడును ఆరోగ్యంగా ఉంచుతుందని, ఆకుకూరలు, పండ్లు, ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు చిరుధాన్యాలు తరచూ తీసుకుంటే మంచి మానసిక ఆరోగ్యం కూడా సొంతమవుతుందని నిపుణులు అంటున్నారు. వాల్?నట్స్, చియా సీడ్స్, ఫ్లాక్స్ సీడ్స్, చేపలలో ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయని, క్వినోవా, ఓట్స్, బ్రౌన్ రైస్ వంటి ధాన్యాలూ మెదడుకు కావాల్సిన శక్తిని అందిస్తాయని పేర్కొన్నారు. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు సమృద్ధిగా ఉండే ఆపిల్, ద్రాక్ష, క్యారెట్, ఆకుకూరలు, బంగాళాదుంప మెదడుకు రక్షణ కల్పిస్తాయని వివరించారు. తగినంత నిద్ర : మెదడు రోజంతా ఏదోటి ఆలోచిస్తూ, కొత్త విషయాలను గ్రహించి, జ్ఞాపకాలుగా మార్చుడంతో పాటు అనేక సంక్లిష్టమైన ప్రక్రియలు నిర్వహిస్తుందని నిపుణులు చెబుతున్నారు. రాత్రిళ్లు ప్రశాంతమైన నిద్ర అనేది మెదడు పనితీరు, జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని, రోజువారీ పనులను సులభతరం చేస్తుందని, ఒత్తిడి, నిరాశను కూడా తగ్గిస్తుందని అధ్యయనంలో పేర్కొంది. అలసిపోయిన శరీరానికి విశ్రాంతి ఎలా అవసరమో, మెదడుకూ అలాగే కావాలని తెలిపారు. రక్షణ కవచం : రోడ్డు ప్రమాదాల్లో మెదడుకు గాయాలయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, బైక్ డ్రైవింగ్, సైక్లింగ్ చేసేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అంతేకాకుండా ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. నిత్యవిద్యార్థిలా : కొత్తభాషలు, కళలు, సంగీతం నేర్చుకోవడం వల్ల మెదడులో కొత్త న్యూరాన్ కనెక్షన్లు ఏర్పడతాయని, ఈ అలవాట్లు మెదడును యవ్వనంగా ఉంచుతాయని నిపుణులు వివరించారు. సంగీతం, రచన, చిత్రలేఖనం వంటివి మెదడులోని విభిన్న ప్రాంతాలను ఉత్తేజితం చేస్తాయని, సృజనాత్మకతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు. మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కొత్తదేమైనా తెలుసుకోవాలనే ఉత్సాహంతో ఉండాలని వెల్లడించారు. రొటీన్ వద్దు : నెలల తరబడి ఒకేరకమైన పనులు చేయడం వల్ల మెదడు పనితీరు నెమ్మదించవచ్చునని, అందుకే జీవితంలో చిన్న చిన్న మార్పులు, కొత్త అనుభవాలకు చోటివ్వాలని నిపుణులు అంటున్నారు. సాధారణ పనుల్లో కూడా కొద్దిపాటి మార్పులు చేసుకోవడం, పర్యటనలు, కొత్త ప్రదేశాలకు వెళ్లడం వల్ల మెదడుకు ఆనందం, అనుభవాలు సొంతమవుతాయని వివరించారు.




## మద్యం, సిగరెట్

మత్తు వదలరా : మద్యం, సిగరెట్, మత్తుపదార్థాలు దీర్ఘకాలంలో మెదడుపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటికి అలవడితే జ్ఞాపకశక్తి మందగిస్తుందని, భావోద్వేగాలు నియంత్రణలో ఉండవని, అంతేకాకుండా మెదడు కొత్త విషయాలను నేర్చుకునే సామర్థ్యం మత్తుపదార్థాల వల్ల బలహీనమవుతుందని, సృజనాత్మకత, విశ్లేషణ శక్తి తగ్గిపోతుందని వివరించారు. అతిగా మద్యం సేవించడం చిత్తవైకల్యానికి ప్రధాన ప్రమాద కారకం అని అధ్యయనంలో పేర్కొంది. డిప్రెషన్, గుండె సంబంధిత వ్యాధులూ అదనంగా వస్తాయని నిపుణులు తెలిపారు. తల్లిదండ్రులకు మత్తుపదార్థాల అలవాటు ఉంటే, పిల్లల మెదడు అభివృద్ధిపై చెడుప్రభావం పడుతుందని పేర్కొన్నారు.

## మొబైల్?ఫోన్లు

డిజిటల్?కు దూరం : ఆధునిక సాంకేతికత మెదడుకు కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తుందని, ప్రస్తుతం మనిషి జీవితం ఫోన్లు, ల్యాప్?టాప్?లు, ట్యాబ్?లు, కంప్యూటర్?లతో నిండిపోయిందని నిపుణులు తెలిపారు. దీని వల్ల మెదడు విశ్రాంతి తీసుకునే సమయాన్ని కోల్పోతుందని వివరించారు. అనవసరమైన సమాచారం తెలుసుకోవడం, పడుకునే ముందు స్క్రీన్ చూడడం వల్ల నిద్ర సరిగా పట్టదని, చేసే పనిలో నాణ్యాతా కొరవడుతుందని చెబుతున్నారు. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రించడం, తరచూ డిజిటల్ విరామం తీసుకోవడం మెదడుకు హాయిని కలిగిస్తాయని తెలిపారు. నలుగురితో కలివిడిగా : శరీరానికి పోషకాహారం ఎంత ముఖ్యమో, మెదడుకు సామాజిక సంబంధాలు అంతే అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఇతరులతో మాట్లాడడం, కలిసి పనిచేయడం, ఆప్యాయతలు పంచుకోవడం ఇవన్నీ మెదడును ఉత్తేజంగా ఉంచుతాయని తెలిపారు. అనుభవాలు ఇతరులతో పంచుకుంటే మనసు తేలికపడి, మానసిక ప్రశాంతత లభిస్తుందని, మిత్రులతో జరిపే సంభాషణలు గత స్మృతులను స్ఫురణకు తెచ్చి జ్ఞాపకశక్తిని పెంచుతాయని వివరించారు. ఇలా చేసి చూడండి : హెడ్?ఫోన్స్ వాల్యూమ్ మరీ శ్రుతిమించినా ప్రమాదమని, భారీ మొత్తంలో వెలువడే ధ్వని తరంగాల విపరీత ప్రభావం వల్ల సహేతుకంగా ఆలోచించటం, నిర్ణయాలు తీసుకోవటం, లెక్కలు వేయటం వంటి కాగ్నిటివ్ (విషయగ్రహణ) నైపుణ్యాలు కొరవడతాయని న్యూరోసర్జన్ డా. పి.రంగనాథం చెబుతున్నారు. ఒత్తిడి, ఆందోళన వల్ల మెదడు తెల్లభాగంలోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతిని స్మాల్ వెసల్ ఇస్కిమిక్ డిసీజ్ వచ్చే అవకాశం ఉందని డా. పి.రంగనాథం అంటున్నారు. ఇది విషయగ్రహణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని, మున్ముందు పక్షవాతం ముప్పు పెరుగుతుందని చెబుతున్నారు. ధ్యానం, ప్రాణాయామం, యోగా వంటి పద్ధతులతో మానసిక ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు. హైబీపీతో బాధపడుతున్నా వారు క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలని, పండ్లు, పండ్ల రసాలు, పచ్చి బటానీ వంటివి తీసుకోవటమూ ముఖ్యమని డా. పి.రంగనాథం తెలిపారు. అంతేకాకుండా సూర్యరశ్మి మెదడును ప్రేరేపితం చేసి, చురుకుగా ఉంచుతుందని, అందువల్ల శరీరానికి కాసేపైనా ఎండ తగిలేలా చూసుకోవాలని వివరించారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ‘డూమ్ స్క్రోలింగ్’ అలవాటు మీకు ఉందా?



## అలాంటి విషయాల గురించే వెతుకుతున్నారా? కొన్ని నియమాలు తప్పనిసరంటున్నా నిపుణులు

ప్రస్తుతం ఎవరిని చూసినా మొబైల్?లోనే ఎక్కువ టైం గడుపుతున్నారు. సోషల్ మీడియాతోపాటు ఎన్నో వెబ్?సైట్స్?లో మునిగి తేలుతున్నారు. అందులో ఉపయోగపడే సమాచారం ఎంత ఉంటుందో తెలియదుగానీ, అవసరం లేని విషయాలు, అవాస్తవమైన వార్తలే ఎక్కువగా జనాల కంటపడుతుంటాయి. అలాంటి వాటిని పట్టించుకోకుండా వదిలేయాల్సి ఉండగా, చాలా మంది లోతుగా ఆలోచిస్తుంటారట. ఈ పరిస్థితినే ‘డూమ్ స్క్రోలింగ్’ అంటారని నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంలో ఈ సమస్య ఎన్నో మానసిక సమస్యల్ని తెచ్చి పెడుతుందని హెచ్చరిస్తున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! మనసును కుంగదీస్తాయ్ : ప్రతికూల వార్తలు కంట పడినప్పుడు మనసులో ఒక రకమైన ఆందోళన మొదలవుతుందంటున్నారు నిపుణులు. అలాంటి సంఘటనలు మీ లైఫ్?లోనూ జరుగుతాయేమోనన్న ఆలోచనలు మరింతగా కుంగదీస్తాయని చెబుతున్నారు. అప్పటికే మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారైతే, ఇలాంటి ప్రతికూల వార్తల గురించి లోతుగా అన్వేషించే క్రమంలో మరింత టెన్షన్ పడతారని అంటున్నారు. ఫలితంగా ఉన్నట్టుండి చెమటలు పట్టడం, శ్వాస అందకపోవడం, గుండె దడ పెరగడం లాంటి లక్షణాలు కనిపిస్తాయని, ఈ సమస్యలు ఆరోగ్యానికి మంచివి కావని సూచిస్తున్నారు. వీటితోపాటు తలనొప్పి, కండరాల ఉద్రిక్తత, మెడ, భుజం నొప్పి, తక్కువ ఆకలి, నిద్రపోవడంలో ఇబ్బంది, రక్తపోటు పెరగడం కూడా ఇతర లక్షణాలు కూడా ఉండొచ్చని హార్వర్డ్ నిపుణులు చెబుతున్నారు.

### “నిద్రలో గుండెపోటు” - 19సెకన్ల ‘ఈ రూల్’ పాటిస్తే మంచిదంటున్న నిపుణులు!

తీవ్ర ఆందోళన : ముఖ్యంగా నిద్రకు ఉపశమించే ముందు ఇలాంటి వార్తలు కంటపడితే, శరీరంలో ఒత్తిడి హార్మోన్ స్థాయిలు పెరిగి ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తల్లో కొన్ని అవాస్తవ సంఘటనలు కూడా ఉంటాయని, కొన్ని వెబ్?సైట్లు కూడా నిజానిజాలు తెలుసుకోకుండా వాటిని అలాగే పోస్ట్ చేస్తుంటాయని తెలిపారు. పదే పదే కంట పడే ఇలాంటి సంఘటనలు కూడా తీవ్ర ఆందోళనకు గురిచేస్తాయని, కాబట్టి సందేహం ఉన్న వార్తల గురించి వెతికే క్రమంలో కొన్ని ప్రామాణిక వెబ్?సైట్లను ఫాలో అవడం మేలని సూచిస్తున్నారు. ప్రతికూల సోషల్ మీడియా కంటెంట్ను వినియోగించడానికి ఎక్కువ సమయం గడుపుతుంటే, వారు మరింత బాధపడతారని ప్రచురించిన అధ్యయనం పేర్కొంది. డూమ్? స్క్రోలింగ్ తెచ్చే అనర్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. దీని ప్రభావం మానసిక ఆరోగ్యంపై పడకుండా ఉండాలంటే కొన్ని నియమాలు తప్పక పాటించాలని చెబుతున్నారు. ఇంత వరకే : రోజువారీ లైఫ్?స్టైల్?లో ప్రతిదానికీ ఒక టైమర్ చేసుకునే విధంగా, మొబైల్, ఆన్?లైన్ విషయంలో మాత్రం ఈ నియమం పాటించారట, ఖాళీ దొరికినప్పుడల్లా మొబైల్?తోనే కాలక్షేపం చేస్తుంటారని నిపుణులు అంటున్నారు. కానీ ఈ విషయంలోనూ ఒక కచ్చితమైన టైమ్ టేబుల్ తప్పనిసరని, దాన్ని బట్టే ఓ అరగంటో, గంటో సోషల్ మీడియా, ఇతర ప్రామాణిక వెబ్?సైట్లకు టైమ్ కేటాయించడం మంచిదని వివరించారు. వారితో టైమ్ గడపండి : ప్రస్తుతం చాలా మంది రాత్రిళ్లు నిద్ర పోకుండా అదే పనిగా ఫోన్ చూస్తుంటారని, ఈ అలవాటుకు స్వస్తి చెప్పాలంటే మొబైల్??ను బెడ్?రూం బయటే పెట్టాలని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా కాలక్షేపం కోసం మొబైల్?ను ఆశ్రయించే వారు, అందుకు ప్రత్యామ్నాయ మార్గాల్ని వెతుక్కోవడం మేలని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పిల్లలు, భాగస్వామి, ఫ్రెండ్స్?తో టైం గడపడం, అభిరుచులపై దృష్టి పెట్టడం, కాసేపు అలా ప్రకృతితో మమేకమవడం, యోగా, ధ్యానం, పుస్తకాలు, వ్యాయామాలకు టైం కేటాయించాలని సూచిస్తున్నారు. అనవసరమైన సమాచారం కోసం వెతుకులాడకుండా కెరీర్?కు ఉపయోగపడే సమాచారం, మానసిక ప్రశాంతతను అందించే సరదా విషయాలు, స్ఫూర్తిదాయక కథలు వంటివి చదివితే మంచిదని సలహా ఇస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య, మానసిక నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ‘యోగా’ చేస్తున్నారా? - ఈ జాగ్రత్తలు తప్పనిసరంటున్న నిపుణులు!

-గర్భిణులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు!



మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా చాలా మంది జీవితాల్లో యోగా ఓ భాగమైంది. దీనివల్ల శారీరకంగానే కాదు, మానసికంగానూ ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చనని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రతిదానికీ ఓ లిమిట్ ఉన్నట్లే యోగాకూ కొన్ని పరిమితులు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఏ ఆసనం ఎప్పుడు, ఎలా వేయాలి? ఎలా వేయకూడదో కచ్చితంగా తెలిసుండాలని సూచిస్తున్నారు. అంతేకాదు, యోగా చేసే క్రమంలో కొన్ని విషయాల్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. మరి, యోగా చేసే టైంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం! అతి అనర్థమే : ఏదైనా అతిగా చేస్తే అనర్థాలు తప్పవని పెద్దలంటుంటారు. యోగా విషయంలోనూ ఇలాంటి నియమం వర్తిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మెరుగైన ఫలితాలు పొందాలని ఎక్కువసేపు యోగా చేయడం, శరీరాన్ని ఇబ్బంది పెట్టే ఆసనాలు వేయడం వల్ల మొదటికే మోసం వస్తుందని హెచ్చరిస్తున్నారు. అందుకే శరీరానికి సౌకర్యవంతంగా ఉండే ఆసనాలనే ఎంచుకోవాలని సూచిస్తున్నారు. అలాగే మొదటిసారి యోగా చేసే వారు అనుభవం ఉన్న వారిని లేదా ఇతరులను చూసి ఆసనాలు వేయడం కాకుండా ఓసారి యోగా నిపుణుల సలహాలు తీసుకొని ముందుకెళ్లడం మేలని సూచిస్తున్నారు.

యోగాజి

“నిద్రలో గుండెపోటు” - 19సెకన్ల ‘ఈ రూల్’ పాటిస్తే మంచిదంటున్న నిపుణులు!

అనువైన ప్రదేశం : యోగా చేయడానికి మరీ చల్లగా, అత్యంత వేడిగా ఉన్న ప్రాంతాలు, అధిక తేమతో కూడిన ప్రదేశాలు యోగా చేయడానికి పనికి రావని నిపుణులు అంటున్నారు. ఇలా అనువుగాని ప్రదేశాల్లో యోగా చేస్తే లేని పోని ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకున్నట్లవుతుందని చెబుతున్నారు. అందుకే గాలి, వెలుతురు వచ్చే ప్రదేశాల్లో యోగా చేయడం అన్ని విధాలా మేలని సూచిస్తున్నారు.

యోగాజి

అప్రమత్తంగా : యోగాలో భాగంగా కొన్ని ఆసనాల్లో పలు సెకన్ల పాటు శ్వాసను బిగపట్టాల్సి రావచ్చని, అలాంటప్పుడు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. యోగా చేసేటప్పుడు అసాధారణ ఆసనాలు వేయడం, సొంత నైపుణ్యాలు ప్రదర్శించడం కాకుండా ట్రైనర్ల సలహాలు పాటించాలని సూచిస్తున్నారు. అంతే కాకుండా యోగా చేసే సమయంలో మరీ బిగుతుగా, శరీరానికి అతుక్కుపోయే లాంటి దుస్తులు ధరించడం వల్ల పక్కటెముకలు, ఊపిరితిత్తులపై ప్రతికూల ప్రభావం పడుతుందని, దీంతో పాటు శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదమూ ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే యోగా చేసే టైంలో స్వేచ్ఛగా కదలడానికి వీలు కల్పించే దుస్తులు ధరించాలని, నొప్పి లేదా అలసట అనిపిస్తే, ఆగి విశ్రాంతి తీసుకోవాలని అధ్యయనంలో పేర్కొంది.

## యోగాజి

ఆ సమయాల్లో : నెలసరి టైంలో కొన్ని రకాల ఆసనాలు వేయకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే గర్భిణులు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు కచ్చితంగా సంబంధిత వైద్యుల సూచనలు, సలహాల మేరకే యోగ సాధన చేయాలని ఓ అధ్యయనంలో పేర్కొంది. అంతేకాకుండా యోగా చేసే సమయంలో మరీ ఎక్కువ నీళ్లు తాగితే శరీరంపై భారం పడుతుందని, తద్వారా వ్యాయామాలకు ఆటంకం కలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. కాబట్టి, ఈ టైంలో నీళ్లు తగిన మోతాదులో తాగడం మంచిదని పేర్కొన్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com